www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సన్ రైజర్స్ మళ్లీ దంచేసింది..

బెంగళూరుపై 287 పరుగుల రికార్డు స్కోరు

తన రికార్డును తానే అధిగమించిన హైదరాబాద్

హెడ్ మెరుపు సెంచరీ.. క్లాసెన్ విధ్వంసం

పోరాడిన రాయల్ చాలెంజర్స్..

25 పరుగుల తేడాతో ఓటమి

మోత మోగిన చిన్నస్వామి స్టేడియం

11





మంగళవారం | 16-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 1 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి మ. 1.25 తదుపరి నవమి; నక్షత్రం: పుష్యమి తె. 5.16 తదుపరి ఆశ్లేష వర్జ్యం: ఉ. 11.48-1.33; దుర్ముహూర్తం: ఉ. 8.31-9.20, రా. 10.14-10.59; అమృతఘడియలు: రా. 10.17-12.01; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బాండ్ల రద్దుతో మళ్లీ నల్లధనం

ఎన్నికల బాండ్ల వల్ల రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శకత వచ్చింది



రద్దుతో పరిస్థితి మళ్లీ మొదటికి.. దానివల్ల అందరూ బాధపడతారు

400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారనేది దుష్ప్రచారం

దేశంలో ప్రజాస్వామ్యం ఉంది.. సుప్రీం లీడర్ ఎవరూ ఆవిర్భవించలేరు

ఈడీ, సీబీఐల దుర్వినియోగం ఆరోపణ.. ఓటమికి విపక్షాల సాకు

ఈడీ కేసుల్లో 3 శాతమే రాజకీయ నేతలపై.. 97% నేరస్థులపైనే

2047 నాటికి భారత్‌ను అగ్రదేశంగా నిలపడమే నా లక్ష్యం

దేశం కోసమే పెద్ద నిర్ణయాలు.. ఎవరూ భయపడాల్సిన పని లేదు

సనాతన ధర్మం మన రాజ్యాంగంలోనూ ఉంది

ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల రద్దు వల్ల దేశంలో మళ్లీ నల్లధనం ప్రవహిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. బాండ్ల వల్ల ఎన్నికల విరాళాలకు సంబంధించి పారదర్శకత వచ్చిందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలను ఈడీ, సీబీఐలతో బెదిరించి బీజేపీకి విరాళాలు ఇప్పించుకున్నారనే ఆరోపణలో నిజం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏకు 400 సీట్లు లభిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మోదీ మండిపడ్డారు. దేశంలో క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకొని ఉందని, అటువంటప్పుడు, ప్రజాస్వామ్యానికే ప్రమాదకారిగా మారే ఓ సుప్రీం లీడర్ ఆవిర్భవించే పరిస్థితే తలెత్తదన్నారు. సోమవారం ఏఎన్ఐ వార్తా సంస్థ ఎడిటర్ స్మితా ప్రకాశ్‌కు ప్రధాని మోదీ ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు అంశాలపై సవివరంగా మాట్లాడారు. బాండ్ల రద్దుతో దేశాన్ని మళ్లీ నల్లధనం వైపు తీసుకెళ్లామని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో, ఎవరికి వెళ్లాయో తెలిసే పరిస్థితే ఉండదని, దీనివల్ల అందరూ బాధపడే రోజు వస్తుందని చెప్పారు. మొత్తం 3 వేల కంపెనీలు ఎలక్టోరల్ బాండ్లు కొంటే, వాటిలో 26 కంపెనీల మీద మాత్రమే దర్యాప్తు జరిగిందని, సదరు సంస్థలు ఇచ్చిన

మిగతా 2వ పేజీలో...

గ్యారెంటీలపై కాంగ్రెసోళ్లను నిలదీయండి

రైతు డిక్లరేషన్ బోగస్..

అన్నదాతలకిచ్చిన గ్యారెంటీ బోగస్

ఈ సర్కారుకు ధాన్యం కొనుగోళ్ల కంటే ఢిల్లీకి పైసలు పంపడంపైనే శ్రద్ధ

హామీల అమలుపై కార్యాచరణ ప్రణాళిక సమితికే చెప్పండి

14

రైతు దీక్షలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్







నారాయణపేటలో నిర్వహించిన జన జాతర సభకు హాజరైన ప్రజలు; సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆగస్టు 15లోగా రుణమాఫీ!

వచ్చే పంట నుంచి రూ.500 బోనస్

ప్రజలంతా పెంచుకున్న రేవంత్ రెడ్డి అనే మొక్కను నరకడానికి ఢిల్లీ నుంచి ఒకరు.. గజ్వేల్ ఫామ్‌హౌస్ నుంచి మరొకరు బయల్దేరారు. ఆ మొక్కను రక్షించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలదే!

- సీఎం రేవంత్‌రెడ్డి

బిడ్డ కోసం బీజేపీకి భారత రాష్ట్ర సమితి తాకట్టు

ఐదు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలుపునకు

ప్రధాని మోదీ నుంచి సుపారీ తీసుకున్న కేసీఆర్

మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజిగిరి, జహీరాబాద్, భువనగిరిల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కుట్ర

14 స్థానాల్లో గెలిస్తే ముదిరాజ్ బిడ్డకు మంత్రి పదవి

ఎస్సీ వర్గీకరణ పోరులో మంద కృష్ణకు మద్దతు తెలిపాం

మేం వచ్చాక వర్గీకరణపై సుప్రీంలో కేసు వాదిస్తున్నాం

మాదిగల ఏబీసీడీ వర్గీకరణ బాధ్యత కాంగ్రెస్ తీసుకుంది

రాష్ట్రాన్ని చక్కదిద్దేందుకు 18 గంటలు పని చేస్తున్నాం

నారాయణపేట జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్రంలోని 68 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయలేకపోయామని, ఆగస్టు 15వ తేదీలోపు వారందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం వచ్చే పంట నుంచి రూ.500 బోనస్ ఇచ్చి పండిన

మిగతా 13వ పేజీలో...

స్వాతంత్ర్యం వచ్చింది ఆరెస్సెస్ వలసపాలనకు కాదు

బీజేపీ మేనిఫెస్టోలో పేదల కోసం ఏమీ లేదు: రాహుల్‌గాంధీ

2

వయనాడ్‌లో భారీ రోడ్ షో

రాహుల్ హెలికాప్టర్‌లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



ఏసీబీకి పట్టుబడిన ఎస్సై రాజ్యలక్ష్మి

స్టేషన్ బెయిల్‌కు రూ.25,000

ఫార్మసీ అనుమతికి 18,000

చార్జిమెమో ఎత్తివేతకు 20,000

ఏసీబీ వలలో లంచావతారాలు!

ఒకే రోజు మహిళా ఎస్సై, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీసీ డీఎం పట్టివేత

3

రూ.200 కోట్లు దానం చేసి.. ఆధ్యాత్మిక మార్గంలోకి

22న గుజరాత్ దంపతుల జైన సన్యాసం

2

రోజుకు రూ.100 కోట్లు

ఎన్నికల తనిఖీల్లో పట్టుబడుతున్న సొత్తు

45 రోజుల్లో 4,658 కోట్ల విలువైన సొత్తు సీజ్.. దేశ చరిత్రలో ఇదే రికార్డు

మత్తుపదార్థాల విలువే రూ.2,068 కోట్లు

రాజస్థాన్‌లో అత్యధికంగా 778 కోట్లు

వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

2

ముమ్మాటికీ అవినాశే!

ఇవిగో సాక్ష్యాలు.. ఆయనకు వివేకా హత్య లైవ్ అప్‌డేట్స్ తెలుసు

2019 మార్చి 15 తెల్లవారు జామున ఎర్రగంగిరెడ్డి, అవినాశ్ మధ్య కాల్స్

తర్వాత ఎంపీ నుంచి ఇతరులకు.. ముందురోజు అవినాశ్ ఇంట్లోనే సునీల్

గొడ్డలిపోట్లు ఉంటే గుండెపోటని ప్రచారం.. సాక్షిలో ఇలాగే ప్రసారం

చైర్మన్‌ను విచారించాలి.. వివేకా అడ్డు తొలగించాలనే హత్య

ఆ వీడియోలు చూస్తుంటే ఏడుపొస్తోంది.. వేళ్లన్నీ అవినాశ్ వైపే

జగన్ కాపాడుతున్నారు.. ఫోన్‌ను సీబీఐకి ఎందుకు సరెండర్ చేయరు?

పెద్దల ఒత్తిడి వల్లే సీబీఐ విచారణ ఆలస్యం: వివేకా కుమార్తె సునీత



3

బెదిరింపులు భరించలేకే.. అవినాశ్ బెయిల్ రద్దు కోరుతున్నా

అప్రూవర్‌గా మారినప్పటి నుంచి ఇబ్బందులు

అవినాశ్ బయటకువచ్చాక నాపై 4 ఎఫ్ఐఆర్‌లు

వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి వాదన

బెయిల్ రద్దు పిటిషన్‌కు సీబీఐ మద్దతు



2.69 లక్షల టన్నుల ధాన్యం ఇప్పటికే కొన్నాం!

మార్చి 23నే కొనుగోళ్లు ప్రారంభించాం

చివరి గింజ వరకూ కొంటాం

రైతులు తక్కువ ధరకు అమ్ముకోవద్దు

బీజేపీ, బీఆర్ఎస్‌లవి తప్పుడు ఆరోపణలు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 23 నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 2,69,699 మెట్రిక్

మిగతా 14వ పేజీలో...

మీడియాతో మాటలేంటి?

కోర్టు ఆవరణలో మాట్లాడడంతో కవితపై న్యాయమూర్తి ఆగ్రహం

ఏదైనా చెప్పాలనుకుంటే విచారణ సమయంలో చెప్పాలని ఆదేశం

సీబీఐ కేసులో కవితకు తొమ్మిది రోజుల జ్యుడీషియల్ కస్టడీ

14 రోజులు అడిగిన సీబీఐ.. ఈ నెల 23 వరకు విధించిన కోర్టు

గర్భకోశ సమస్య, హైబీపీ, అల్సర్‌తో బాధపడుతున్నా.. బెయిల్ ఇవ్వండి

కవిత పిటిషన్.. 22న విచారిస్తామన్న న్యాయమూర్తి

ఇది సీబీఐ కస్టడీ కాదు.. బీజేపీ కస్టడీ: మీడియాతో కవిత



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి మందలించారు. కోర్టు ఆవరణలో కవిత మీడియాతో మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడురోజుల సీబీఐ కస్టడీ ముగిసిన కవితను సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచగా.. కోర్టు హాలులోకి వచ్చేముందు, వెళ్లేముందు ఆమె మీడియాతో మాట్లాడారు. "ఈ కేసులో

మిగతా 13వ పేజీలో...

ఢిల్లీ మద్యం స్కాంలో చరణ్‌ప్రీత్‌సింగ్ అరెస్టు

గోవాకు డబ్బు తరలించినట్లు ఈడీ వెల్లడి.. 12న అదుపులోకి

2

మరుసటి రోజు ప్రత్యేక కోర్టు ముందుకు.. 18 వరకు ఈడీ కస్టడీ

ఆ నీటిని ఎలా పొదుపు చేశారు?

వివరాలు సమర్పించండి

పాలమూరు-రంగారెడ్డికి కేటాయించిన 45 టీఎంసీలపై ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ లేఖ

సమ్మక్కకు ఎన్ఓసీపైనా ఆరా

సీతారామ కింద అంత దిగుబడా? అని ప్రశ్నలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ మైనర్ ఇరిగేషన్‌లో 2012-13 నుంచి 2021-23 దాకా 45.66 టీఎంసీల నీటిని ఎలా పొదుపు చేశారని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ప్రశ్నించింది. ఈ మేరకు సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టు అప్రైజల్ (సౌత్) డైరెక్టరేట్ లేఖ రాసింది. మైనర్ ఇరిగేషన్‌లో ఏ విధంగా పొదుపు చేశారు? పొదుపు చేస్తున్నారనడానికి ప్రాతిపదిక ఏమిటి? వంటి వివరాలను జత చేసి, నిర్దేశిత నమూనాలో వివరాలు సత్వరం అందించాలని కోరింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణకు 90 టీఎంసీల నీటిని మైనర్ ఇరిగేషన్‌లో కేటాయించారు. అందులో పొదుపు చేస్తున్న 45 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేటాయిస్తూ

మిగతా 12వ పేజీలో...

తెలంగాణ అభ్యంతరాలు బేఖాతరు!

నదుల అనుసంధానంలో కేంద్రం దూకుడు

ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ నిర్మించాలని నిర్ణయం

గోదావరి-కావేరి అనుసంధానం ముసాయిదా

డీపీఆర్‌ను తెలంగాణకు పంపించిన ఎన్‌డబ్ల్యూడీఏ

ఏవైనా అభ్యంతరాలుంటే నెలాఖరులోగా తెలపాలి

లేదంటే డీపీఆర్‌కు ఆమోదం తెలిపినట్లే లెక్క

ఆ తర్వాతే ప్రభావిత రాష్ట్రాల సీఎంల సంతకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టులో బ్యారేజీ నిర్మాణ ప్రదేశం నుంచి నీటి లభ్యత, నీటి కేటాయింపులు వంటి అంశాలపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలను కేంద్రం పక్కనపెట్టింది. ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్‌ను జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తెలంగాణ ప్రభుత్వానికి పంపించింది. దీనిపై నెలాఖరులోగా అభ్యంతరాలు/సూచనలు/సలహాలు తెలియజేయాలని పేర్కొంది. లేనిపక్షంలో

మిగతా 12వ పేజీలో...

రూ.200 కోట్ల సంపదను దానం చేసి..
ఆధ్యాత్మిక మార్గంలోకి

» 22న జైన సన్యాసం తీసుకోనున్న గుజరాత్ దంపతులు



సూరత్, ఏప్రిల్ 15: గుజరాత్‌లోని ఓ సంపన్న కుటుంబానికి చెందిన దంపతులు ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లాలని నిర్ణయించుకుని, దాదాపు రూ.200 కోట్ల తమ సంపదను దానం చేశారు. హిమ్మత్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త భవేశ్ భండారి దంపతులకు ఓ కూతురు(19), ఓ కుమారుడు(16) ఉండగా.. 2022లోనే వారు జైన సన్యాసం తీసుకున్నారు. బంధాలను, సకల సౌకర్యాలను త్యజించి సన్యాసులుగా జీవిస్తున్నారు. వారి నుంచి ప్రేరణ పొందిన తల్లిదండ్రులు కూడా అదే మార్గంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గత ఫిబ్రవరిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తమ సంపదను మొత్తం దానం చేశారు. ఈ నెల 22న భండారి దంపతులు జైన సన్యాసం స్వీకరించనున్నారు. అప్పటి నుంచి వారు కేవలం రెండు తెల్లటి వస్త్రాలు, ఓ రజోహరన్(చీపురులాంటిది), భిక్షం ఎత్తుకునేందుకు ఓ పాత్రను మాత్రమే కలిగి ఉంటారు. కాళ్లకు చెప్పులు కూడా లేకుండా దేశ పర్యటన చేస్తూ, భిక్షను స్వీకరిస్తూ జీవిస్తారు.

ఢిల్లీ మద్యం స్కాంలో చరణ్‌ప్రీత్‌సింగ్ అరెస్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఢిల్లీ మద్యం స్కాంలో వచ్చిన డబ్బును గోవా ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారానికి తరలించిన చరణ్‌ప్రీత్ సింగ్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈ నెల 12నే అతడిని అరెస్టు చేసి.. మరుసటి రోజు ప్రత్యేక కోర్టులో హాజరపరిచింది. ఆప్ నాయకులతో చరణ్‌ప్రీత్‌కు సంబంధాలున్నాయని.. 2022లో జరిగిన గోవా ఎన్నికలకు డబ్బు చేరవేశాడని న్యాయస్థానంలో పేర్కొంది. అనంతరం చరణ్‌ప్రీత్‌ను కోర్టు ఈ నెల 18వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్, కవిత, మనీశ్ సిసోడియా, పలువురు మద్యం వ్యాపారులు సహా ఈడీ అరెస్టు చేసిన 17వ వ్యక్తి చరణ్‌ప్రీత్. కాగా, ఇతడిని గతంలోనే సీబీఐ అరెస్టు చేసింది. స్కాంలో కవిత తదితరులతో కూడిన సౌత్ గ్రూప్ రూ.100 కోట్లను ఆప్‌నకు ఇచ్చిందని ఆరోపిస్తున్న ఈడీ.. ఇందులో రూ.45 కోట్లను గోవా ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు పేర్కొంటోంది. ఇదిలా ఉండగా, మనీలాండరింగ్ కేసులో తనను ఈడీ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ చేసిన వినతిని సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది.

ఎన్నికల బాండ్లపై తీర్పును పునఃసమీక్షించండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలయింది. న్యాయవాది మ్యాథ్యూస్ జె నెడుంపర దీన్ని దాఖలు చేశారు. ఎన్నికల బాండ్లు అన్నవి శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు తీసుకున్న విధానపర నిర్ణయమని, దాన్ని కొట్టివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల ద్వారా పిటిషనర్లకు ఎలాంటి నష్టం కలగలేదని, అలాంటప్పుడు ఒక ప్రయివేటు పిటిషన్ మాదిరిగా విచారణ జరిపి ఎలా తీర్పు ఇస్తారని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్లపై ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు.

మథుర మసీదు సర్వేపై సుప్రీం స్టే పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: మథురలో శ్రీకృష్ణ జన్మభూమి దేవాలయాన్ని ఆనుకొని ఉన్న షాహీ ఈద్గా మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించకుండా ఇచ్చిన స్టే ఉత్తర్వులను సోమవారం సుప్రీంకోర్టు పొడిగించింది. న్యాయస్థానం పర్యవేక్షణలో సర్వే జరపాలని గతంలో అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు ఇవ్వగా దానిని నిలుపుదల చేస్తూ సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఆ ఆదేశాలను మళ్లీ పొడిగిస్తూ తదుపరి విచారణను ఆగస్టు నెలకు వాయిదా వేసింది.

సల్మాన్ ఇంటి వద్ద కాల్పులకు అమెరికాలో కుట్ర

ముంబై, ఏప్రిల్ 15: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి ఆవరణలో కాల్పులకు అమెరికాలో పథకం రచించినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కుడి భుజంగా భావించే రోహిత్ గోదారా.. బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ కోరిక మేరకు ఇద్దరు వ్యక్తులతో కాల్పులు జరిపించినట్లు పోలీసులు చెప్పారు. ఈ మేరకు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ ఎన్డీటీవీ వార్తను ప్రసారం చేసింది. ఆ ఇద్దరూ బిష్ణోయ్ గ్యాంగ్‌లో సభ్యులేనని పేర్కొంది. మరోవైపు, సల్మాన్ ఇంటి వద్ద కాల్పులు జరిపిన వ్యక్తుల కదలికలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నిందితుల్లో ఒకరిని విశాల్‌గా గుర్తించిన పోలీసులు.. అతడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, కాల్పుల ఘటనలో దుండగులు ఉపయోగించిన బైక్ యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. అయితే, ఆ బైక్‌ను తాను కొద్దిరోజుల క్రితమే వేరే వ్యక్తికి అమ్మినట్లు అతడు చెప్పాడు.

న్యాయ వ్యవస్థను కాపాడుకోవాలి!

» సీజేఐకి 21 మంది సుప్రీం, హైకోర్టు మాజీ జడ్జిల లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో న్యాయ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన మాజీ న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను కాపాడుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు చెందిన నలుగురు, హైకోర్టులకు చెందిన 17 మంది విశ్రాంత న్యాయమూర్తులు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు లేఖ రాశారు. కొన్ని వర్గాలు తప్పుడు సమాచారం అందిస్తూ న్యాయ వ్యవస్థను బహిరంగంగా అవమానిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అయితే సీజేఐకి ఈ లేఖ ఎందుకు రాయాల్సి వచ్చిందనేది మాత్రం వెల్లడించలేదు. అనవసర ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని సీజేఐని కోరారు. "కొందరు స్వార్థ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయ వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారు. న్యాయస్థానాల నుంచి అనుకూలంగా ఉండే నిర్ణయాలు వస్తే ప్రశంసిస్తున్నారు. అనుకూలంగా రాకపోతే తీవ్రంగా విమర్శిస్తున్నారు. అనవసరపు న్యాయ సమీక్షలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. తద్వారా న్యాయపరమైన నిర్ణయాలు, తీర్పులను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదెంతో ఆందోళనకరం. న్యాయ వ్యవస్థను అనవసర ఒత్తిళ్ల నుంచి రక్షించాల్సిన అవసరం ఉంది" అని సీజేఐకి రాసిన లేఖలో విశ్రాంత జడ్జిలు కోరారు. కాగా, రాజకీయ ఒత్తిళ్ల వల్ల న్యాయ వ్యవస్థకు ముప్పు ఉందని మార్చి 28న 600 మంది న్యాయవాదులు సీజేఐకి లేఖ రాశారు.

2 నిమిషాల ఇంధనం ఉందనగా ల్యాండింగ్

» ఇండిగో విమానంలో టెన్షన్... టెన్షన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: అయోధ్య నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణికులకు అత్యంత భయానక అనుభవం ఎదురైంది. దాదాపు రెండు గంటల పాటు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సి వచ్చింది. ఏప్రిల్ 13న జరిగిన ఈ సంఘటన... ఓ ప్రయాణికుడు 'ఎక్స్' ద్వారా పంచుకోవడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది."అయోధ్యలో మధ్యాహ్నం 3.25 గంటలకు బయలుదేరిన ఇండిగో విమానం(6ఈ2702) 4.30 గంటలకు ఢిల్లీలో దిగాల్సి ఉంది. కానీ, ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండింగ్ వీలుపడటం లేదని, మరో 45 నిమిషాల వరకు సరిపడా ఇంధనం మిగిలి ఉందని 4.15 గంటలకు పైలెట్ ప్రకటించారు. అనంతరం రెండు సార్లు ప్రయత్నించినప్పటికీ ల్యాండింగ్ సాధ్యపడలేదు. చాలాసేపు గాల్లో చక్కర్లు కొట్టిన తర్వాత విమానాన్ని చండీగఢ్‌కు మళ్లిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే చాలా సమయం గడవడంతో ప్రయాణికులతో పాటు సిబ్బంది కూడా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. టెన్షన్‌తో వాంతులు చేసుకున్నారు. అలాంటి పరిస్థితుల్లో చివరికి సాయంత్రం 6.10 గంటలకు.. అంటే 45 నిమిషాలకు సరిపడా ఇంధనం మాత్రమే ఉందని ప్రకటించిన 115 నిమిషాల తర్వాత విమానం చండీగఢ్‌లో సురక్షితంగా ల్యాండవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు" అని ఆ ప్రయాణికుడు పేర్కొన్నాడు. అయితే దిగే సమయానికి విమానంలో మరో 2 నిమిషాలకు సరిపడా ఇంధనం మాత్రమే మిగిలి ఉందని, ఆఖరి నిమిషంలో ల్యాండ్ అవడంతో పెద్ద ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నామని తెలిసి గుండెలు జారిపోయాయని అతను చెప్పుకొచ్చాడు. ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని డీజీసీఏ, ఇండిగోలకు ట్యాగ్ చేశాడు.

బాండ్ల రద్దుతో
మళ్లీ నల్లధనం



(మొదటి పేజీ తరువాయి)

విరాళాల్లో 37 శాతం మాత్రమే బీజేపీకి వచ్చాయని, 63 శాతం బీజేపీయేతర పార్టీలకు వెళ్లాయని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. అది దేశ ఆర్థికవ్యవస్థను పూర్తిగా దిగజారుస్తుందన్నారు. తొలిసారి ఓటు వేసే యువతీ యువకుల ఆకాంక్షలను అది పూర్తిగా ధ్వంసం చేస్తుందని, 25 ఏళ్లలోపు యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని విమర్శించారు. తన హయాంలో యువత జీవితాలు మెరుగుపడ్డాయని, ఆర్థికంగా నష్టం వస్తున్నా డేటాను తక్కువ ధరకు అందిస్తున్నామని, దీనివల్ల దేశంలో యువత డిజిటల్ విప్లవం తీసుకొస్తోందన్నారు. వచ్చే 25 ఏళ్ల దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

ఈడీ, సీబీఐ దుర్వినియోగం అబద్ధం

ఈడీ, సీబీఐ వంటి సంస్థలు బీజేపీ చెప్పినట్లు పని చేస్తున్నాయని, ఈవీఎంలను కూడా దుర్వినియోగపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను మోదీ కొట్టివేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటమికి ప్రతిపక్షాలు ఈ విధంగా కారణాలను వెతుక్కుంటున్నాయని ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐకి సంబంధించిన ఏ చట్టాలనూ తమ ప్రభుత్వం చేయలేదని, అవన్నీ కాంగ్రెస్ హయాంలో రూపొందించినవేనని చెప్పారు. ఈడీ పెట్టిన కేసుల్లో 3% మాత్రమే రాజకీయ నేతలపై నమోదయ్యాయని, మిగిలిన 97% కేసులు రాజకీయాలకు సంబంధించని వారి మీద ఉన్నాయని స్పష్టం చేశారు. 2014కి ముందు ఈడీ రూ.34 కోట్ల నగదును మాత్రమే స్వాధీనం చేసుకుందని, గత పదేళ్లలో ఈ మొత్తం రూ.2,200 కోట్లకు పెరిగిందన్నారు. గతంలో ఎన్నికల సంఘం (ఈసీ) కమిషనర్ల నియామకాలు పూర్తిగా ప్రధానమంత్రి విచక్షణ మేరకు జరిగేవని, దానిని మార్చి ప్రతిపక్షానికి కూడా తాము చోటు కల్పించామని మోదీ గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో నియమించిన ఎన్నికల కమిషనర్లు ఆ పార్టీ అధినేతల కుటుంబానికి సన్నిహితంగా ఉన్న ఉదంతాలు ఉన్నాయని, కొందరు కమిషనర్లకు పదవీకాలం పూర్తయిన తర్వాత రాజ్యసభ సభ్యులుగా, మంత్రులుగా పదవులు కూడా ఇచ్చారని మోదీ పేర్కొన్నారు. బీజేపీ ఆ స్థాయికి దిగజారదని చెప్పారు. '2024 ఎన్నికల రూపంలో దేశ ప్రజలకు ఒక అవకాశం వచ్చింది. 50-60 ఏళ్ల పాటు పాలించిన కాంగ్రెస్ నమూనా ప్రభుత్వం ఉంది. మరోవైపు, నా పదేళ్ల పాలన ఉంది. (నా హయాంలో) తప్పులు జరిగి ఉండవచ్చు. కానీ, ప్రయత్న లోపం మాత్రం లేదు. అన్ని రంగాల్లో ఈ రెండు ప్రభుత్వాలను పోల్చి చూసి ఓటేయండి' అని ఓటర్లకు పిలుపునిచ్చారు.

మోదీనే భారత్.. భారత్ అంటే మోదీనే?

ఏఎన్ఐ: మా కెమెరా బృందాలు ఏ బీజేపీ సభకు, ర్యాలీకి వెళ్లి చూసినా అక్కడి బీజేపీ అభ్యర్థులు, వక్తలు మోదీ గురించే మాట్లాడుతున్నారు. గతంలో ఇందిర హయాంలో 'ఇండియానే ఇందిర. ఇందిరానే ఇండియా' అని కాంగ్రెస్ వాళ్లు చెప్పుకొన్నట్లుగా.. ఇప్పుడు 'మోదీనే భారత్. భారత్ అంటే మోదీనే' అనే పరిస్థితి వచ్చిందనుకోవాలా?

మోదీ: భరతమాత పుత్రుడిగా మోదీని భావిస్తున్నారని నేను అనుకుంటున్నా. మోదీ భరత మాత పుత్రుడు. ఆమెకు సేవ చేస్తున్నాడంతే!

మోదీతో ప్రజాస్వామ్యానికి ముప్పా?

ఏఎన్ఐ: మోదీ ఎంత శక్తిమంతుడైతే దేశంలో ప్రజాస్వామ్యానికి అంత ప్రమాదం అన్న విమర్శపై ఏమంటారు?

మోదీ: దేశంలో 6 లక్షల పంచాయతీలున్నాయి. వాటిని ఎన్నికైన ప్రజాప్రతినిధులు పాలిస్తుంటారు. ఎన్నో రాష్ట్రాలు.. ఎన్నెన్నో పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. ఇంత జరుగుతున్నా కూడా భారతదేశంలో ఒక సుప్రీం లీడర్ ఆవిర్భవిస్తున్నాడని ఎవరైనా అంటే అలా అనేవారు అజ్ఞానులని నా అభిప్రాయం.

ఎన్నికలు కాగానే పెద్ద నిర్ణయాలు

2047 కల్లా దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని, ఇది మొత్తం దేశ ప్రజల ఆకాంక్ష అని మోదీ తెలిపారు. దీని కోసం ఒక్క నిమిషం కూడా వృథా చేయదలుచుకోలేదని, అందుకనే ఎన్నికలకు ముందు నుంచే దీనిపై పని చేస్తున్నానన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే తొలి 100 రోజుల్లో చేపట్టాల్సిన పనుల గురించి ఇప్పటికే కసరత్తు జరిపామని గుర్తు చేస్తూ, 2019లో కూడా ఎన్నికలకు ముందే ఈ పని చేశామని చెప్పారు. ఎన్నికలైన తొలి వంద రోజుల్లోనే ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్‌పై నిషేధం వంటి నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేశారు. ఈసారి కూడా పెద్ద నిర్ణయాలు ఉంటాయని, దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే తాను ఏ నిర్ణయమైనా తీసుకుంటానని, ఎవరూ భయపడనక్కర్లేదని ప్రధాని తెలిపారు. జమిలి ఎన్నికలకు తాము కట్టుబడి ఉన్నామని, దేశంలో మెజార్టీ ప్రజలు ఇందుకు మద్దతుగా ఉన్నారని, అనేక సానుకూల సూచనలు చేశారన్నారు.

సనాతన ధర్మంపై విషం

సనాతన ధర్మానికి వ్యతిరేకంగా డీఎంకే వంటి పార్టీలు మాట్లాడుతున్నాయని, అలాంటి విషం చిమ్మే వారితో కలిసి పనిచేయాల్సినంత అవసరం కాంగ్రెస్‌కు ఏముందని మోదీ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు ప్రతి పేజీలోనూ సనాతన ధర్మం తాలూకు చిత్రాలను ముద్రించారని, రాజ్యాంగం ప్రకారమే సనాతన ధర్మం ప్రభుత్వంలో భాగమని చెప్పారు. ఉత్తర దక్షిణ భారతాల మధ్య అగాధం ఏమీ లేదని, భారతదేశాన్ని వేర్వేరు ప్రాంతాలుగా చూడటం తెలివిమాలిన పని అని మోదీ దుయ్యబట్టారు. భారతదేశంలో అత్యధిక గ్రామాలు శ్రీరాముడి పేరుతో ఉన్న రాష్ట్రం తమిళనాడు అన్న విషయం ఎంతమందికి తెలుసని ఆయన ప్రశ్నించారు. ఐక్యరాజ్య సమితిలో అతి ప్రాచీన భాషగా తమిళానికి గుర్తింపు రావడం పట్ల హర్షం వ్యక్తం చేసింది తానేనని గుర్తు చేశారు. డీఎంకే పట్ల ప్రజల వ్యతిరేకత బీజేపీకి సానుకూలంగా మారుతుందన్నారు. తాను వివిధ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడి సంప్రదాయాన్ని అనుసరించి దుస్తులు ధరిస్తే కూడా ప్రతిపక్షాలు తనపై విమర్శలు గుప్పించాయని, తన మీద వాటికి ఉన్న ద్వేషాన్ని చూసి ఆశ్చర్యపోయానన్నారు. దేశంలోని ప్రతీ ప్రాంతం తనకు ముఖ్యం కాబట్టే, జీ 20 సదస్సు సమావేశాల్ని ఢిల్లీకే పరిమితం చేయలేదని, ప్రతీ రాష్ట్రంలో వాటిని జరిపామని గుర్తు చేశారు. సమావేశాల్లో ప్రపంచ దేశాధినేతలందరినీ ఏకం చేశానని, డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించేలా చేశామని, ఇది మొత్తం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని మోదీ తెలిపారు. రామ మందిరాన్ని బీజేపీ రాజకీయ ఆయుధంగా వాడుకోవడం లేదని, ప్రతిపక్షాలే ఆ పని చేశాయని మోదీ ఆరోపించారు.

ప్రతిపక్షాలకు విశ్వసనీయత లేదు

సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతికి తమ మేనిఫెస్టో బాటలు వేస్తోందని మోదీ అన్నారు. సోమవారం కేరళలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తిరువనంతపురంలో తలపడే లెఫ్ట్, కాంగ్రెస్ తమిళనాడులోని తిరునల్వేలీలో కలిసి పోటీచేస్తున్నాయని, ఏమాత్రం విశ్వసనీయత లేని విపక్షాలను తిరస్కరించాలని ఆయన కోరారు. అవినీతిపరులంతా కూటమి కట్టి తనను అడ్డుకోవాలని చూస్తున్నారని మోదీ ఆరోపించారు.



కేరళలో ఎన్నికల ప్రచారంలో మోదీ



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	41.1	24.2
కామారెడ్డి	40.6	26.8
హనుమకొండ	40.0	24.5
ఖమ్మం	40.0	26.0

2050 నాటికి ఏటా కోటి మరణాలు!

» ప్రజారోగ్యానికి పెనుముప్పుగా యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారింది. బ్యాక్టీరియల్ వ్యాధులకు వ్యతిరేకంగా యాంటీబయాటిక్‌ను నీరుగార్చే ఏఎంఆర్‌ను రాబోయే దశాబ్దాల్లో ప్రపంచం ఎదుర్కోనున్న అత్యవసర ఆరోగ్య ప్రమాదాల్లో ఒకటిగా ఆరోగ్యరంగ నిపుణులు గుర్తించారు. దీని కారణంగా 2050 నాటికి ఏటా కోటి మంది ప్రాణాలు కోల్పోతారని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో జంతువుల్లోనూ ఔషధ నిరోధకత పెరగడం తీవ్రమై, చికిత్స చేయలేని అనారోగ్యానికి దారితీస్తుందని, అల్పాదాయ దేశాల్లో పశువుల ఉత్పత్తిలో 11% తగ్గుదలకు దారితీస్తుందని చెబుతున్నారు. దీని వల్ల జీవనోపాధి, ఆహార భద్రత దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. మెరుగైన వ్యాధి నివారణ ద్వారా యాంటీబయాటిక్స్ అవసరాన్ని తగ్గించి యాంటీమైక్రోబియల్ నిరోధక వ్యాప్తిని అదుపు చేసేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ప్రజల్లో యాంటీమైక్రోబియల్ నిరోధకత పెరుగుదలను అంతం చేయడమే ఈ శతాబ్దంలో సాధించాల్సిన ముఖ్యమైన ఆరోగ్య విజయాల్లో ఒకటని వారు చెబుతున్నారు.

ఒక్క అల్లరి జరిగినా... ఈసీ ఆఫీసు ముందు నిరాహార దీక్ష

» మమతా బెనర్జీ హెచ్చరిక

» డీఐజీ బదిలీకి నిరసన



కూచ్‌బెహార్, ఏప్రిల్ 15: ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అల్లర్లు, హింసాత్మక సంఘటన ఒక్కటి జరిగినా ఎలక్షన్ కమిషన్ (ఈసీ) కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. బీజేపీ సూచనల మేరకే ముర్షిదాబాద్ డీఐజీని బదిలీ చేసిందని ఆరోపించారు. సోమవారం కూచ్ బెహార్, అలియాపూర్‌దౌర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగిస్తూ అల్లర్లను రెచ్చగొట్టేందుకే బీజేపీ పోలీసు అధికారులను బదిలీ చేయిస్తోందని ఆరోపించారు. ముర్షిదాబాద్, మాల్దాల్లో ఒక్క హింసాత్మక సంఘటన జరిగినా అందుకు ఎన్నికల సంఘమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. "ఒక్క గొడవ జరిగినా ఈసీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తా.. అవసరమైతే ఎన్నికలు జరిగే 55 రోజుల పాటు దీక్ష చేస్తా" అని మమత అన్నారు. సింగూరు ఉద్యమం సమయంలో 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేశానని గుర్తు చేస్తూ దీర్ఘకాలం పాటు ఆందోళన చేయడం తనకు కష్టమేమీ కాదని అన్నారు. జైలుకు పంపిస్తామన్న బీజేపీ నేతల హెచ్చరికలపైనా మమత మండిపడ్డారు. "ఎలా పోరాడాలో నాకు తెలుసు. పిరికిదాన్ని కాను" అని వ్యాఖ్యానించారు.

ఒకే దేశం.. ఒకే నాయకుడు..
ప్రజలను అవమానించడమే!

స్వాతంత్ర్యం వచ్చింది ఆర్ఎస్ఎస్ వలసపాలన కోసం కాదు

» బీజేపీ మేనిఫెస్టోలో పేదల కోసం ఏమీ లేదు: రాహుల్‌గాంధీ

» వయనాడ్‌లో రోడ్ షో.. తమిళనాడులో విద్యార్థులతో ముఖాముఖి



వయనాడ్‌లో రాహుల్ రోడ్ షో

చెన్నై, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భారతదేశం బ్రిటిష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం పొందినది ఆర్ఎస్ఎస్ భావజాలంతో వలసపాలన సాగించడానికి కాదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'ఒకే దేశం.. ఒకే నాయకుడు, ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' తదితర బీజేపీ విధానాలపై విమర్శలు ఎక్కుపెట్టారు. దేశానికి ఒకే నాయకుడు ఉండాలనే బీజేపీ నేతల ఆలోచన ప్రతి భారతీయ యువకుడినీ అవమానించడమేనన్నారు. దేశానికి ఒకరి కంటే ఎక్కువ మంది నాయకులు ఎందుకు ఉండకూడదని రాహుల్ ప్రశ్నించారు. దేశంలోని ప్రజలందరూ కలసి దేశాన్ని పరిపాలించాలని తాము కోరుతున్నామని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం ఇదేనన్నారు. దేశ ప్రజల అభిప్రాయాలను కాంగ్రెస్ వినాలనుకుంటుందని, వారి సంస్కృతి, మతం, భాష, విశ్వాసాలను కాంగ్రెస్ గౌరవిస్తుందని, అయితే, బీజేపీ అధిష్ఠానం మాత్రం తాము చెప్పిందే దేశమంతా అమలవ్వాలనుకుంటోందని విమర్శించారు. కేరళలోని తాను పోటీ చేస్తున్న వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓపెన్ టాప్ కారుపై కూర్చొని భారీ రోడ్‌షో జరిపారు. అంతకుముందు హెలికాప్టర్‌లో ఆయన తమిళనాడులోని నీలగిరి జిల్లా పందలూరుకు చేరుకున్నారు. అక్కడ కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, రోడ్డు మార్గంలో వయనాడ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి, మోదీకి కేవలం ఒకే దేశం.ఒకే భాష.. ఒకే నాయకుడు కనిపిస్తున్నాయని, ఇది మన దేశ మూలస్వరూపాన్ని అర్థంచేసుకోలేకపోవడమేనని విమర్శించారు. బీజేపీ మేనిఫెస్టోలో పేదల కోసం ఏమీ లేదని విమర్శించారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' అనే ఎజెండాను దేశంపై రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. 'పేదల కోసం బీజేపీ విధానాలు ఏమిటి' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల కోసం విధానాలు ఉన్నాయని చెప్పారు. కానీ, బీజేపీ మేనిఫెస్టోలో 2036లో ఒలింపిక్స్ నిర్వహణ గురించి ప్రస్తావించారని, కాంగ్రెస్, బీజేపీ మధ్య వ్యత్యాసం ఇదేనని రాహుల్ తెలిపారు. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషల సమాహారంగా ఉన్న భారతదేశాన్ని రంగురంగుల పుష్పగుచ్ఛంతో ఆయన పోల్చారు. హిందీ కంటే మలయాళం తక్కువ అని అనడం కేరళ ప్రజలనే అవమానించినట్లన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయనాడ్‌పై సవతి తల్లిలా ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ..

తమిళనాడులోని నీలగిరి జిల్లా పందలూరులో రాహుల్‌గాంధీ హెలిక్యాప్టర్‌ను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. సోమవారం ఉదయం పందలూరులో హెలిపాడ్ వద్ద రాహుల్ హెలికాప్టర్ దిగారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు హెలికాప్టర్‌ను చుట్టిముట్టి తనిఖీలు జరిపారు. తనిఖీలకు సహకరించిన రాహుల్.. పక్కనే ఉన్న తేయాకు కార్మికులతో కొద్దిసేపు ముచ్చటించారు.

రోజుకు 100 కోట్ల సొత్తు జప్తు

» తనిఖీల్లో 45 రోజుల్లో రూ. 4,658 కోట్ల నగదు, డ్రగ్స్, ఇతర వస్తువులు సీజ్

» దేశ చరిత్రలో ఇదే రికార్డు స్థాయి మొత్తం

న్యూఢిల్లీ, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తాయిలాలు, నగదు, డ్రగ్స్, మద్యం ఏరులై పారుతున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్నికల అధికారులు/ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జరిపిన దాడులు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో మార్చి1 నుంచి శనివారం వరకు రికార్డుస్థాయిలో రూ.4,658 కోట్ల విలువైన సొత్తు సీజ్ అయ్యింది. గడిచిన 45రోజుల్లో రోజుకు సగటున రూ.100కోట్లకుపైగా సొత్తు పట్టుబడింది. 2019సార్వత్రిక ఎన్నికలప్పుడు సీజ్ అయిన మొత్తం సొత్తు రూ.3,475 కోట్లుగా ఉంది. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) సోమవారం ఈ వివరాలు వెల్లడించింది. పట్టుబడ్డ నగదు, బంగారం, ఆభరణాలు, సామగ్రి విషయంలో.. కేవలం ఎన్నికల పంపిణీలు అనికాకుండా.. లెక్కపత్రాలులేకుండా తీసుకువెళ్లేవి కూడా ఉన్నాయి. ఎన్నికల క్రతువు ముగిసేసరికి ఈసారి మరింత నగదు, తాయిలాలు, డ్రగ్స్, మద్యం సీజయ్యే అవకాశాలున్నట్లు ఈసీ అభిప్రాయపడింది. ఎన్నికల ప్రచారంలో రాజకీయ నాయకులకు సహకరించినట్లు ఆరోపణలు వచ్చిన 106 మంది ప్రభుత్వోద్యోగులపై ఈసీ చర్యలు తీసుకుంది. కాగా ఇప్పటి వరకు సీజ్ అయిన మొత్తం సొత్తులో 45% (రూ.2,068 కోట్లు) మాదకద్రవ్యాలు కావడం గమనార్హం.! ఇందులో రూ.485కోట్లు డ్రగ్స్ గుజరాత్‌లో పట్టుబడ్డాయి. రూ.293 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ అయిన తమిళనాడు రెండోస్థానంలో ఉంది. మొత్తం సొత్తులో నగదు రూ.395.39 కోట్లు కాగా.. మద్యం విలువ రూ.489.31 కోట్లు, విలువైన వస్తువులు (రూ. 562.10 కోట్లు), తాయిలాలు (1,142.49 కోట్లు) ఉన్నట్లు ఈసీ తెలిపింది. ఇప్పటివరకు సీజ్ అయిన రూ.4,658 కోట్లలో అత్యధికంగా రూ.778కోట్ల సొత్తు రాజస్థాన్‌లో పట్టుబడింది. ఈ జాబితాలో ఏపీ (రూ.125.97కోట్లు) 12వ, తెలంగాణ (రూ.121.84కోట్లు)13వ స్థానంలో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

ఏపీలో సీజ్ చేసిన మొత్తం సొత్తు(రూ.125.97 కోట్లు)లో నగదు రూ.32.15 కోట్లు.. మద్యం రూ.19.71 కోట్లు, మత్తుపదార్థాలు రూ.4 కోట్లు, విలువైన వస్తువులు రూ.57.14 కోట్లు, తాయిలాలు రూ.12.89 కోట్లున్నట్లు ఈసీ పేర్కొంది. తెలంగాణలో సీజ్ అయిన సొత్తు (రూ.121.84కోట్లు)లో నగదు రూ.49.18 కోట్లు, మద్యం రూ.19.21కోట్లు, డ్రగ్స్ రూ.22.71 కోట్లున్నాయి.

కేజ్రీవాల్‌కు లభించని ఊరట

ఈడీ అరెస్టుపై ఆయన పిటిషన్‌ను తక్షణమే విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ



కేజ్రీవాల్‌ను కలిసి వస్తున్న మాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టులోనూ ఊరట దక్కలేదు. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తక్షణమే విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈనెల 29వ తేదీ తర్వాత ప్రారంభమయ్యే వారంలో ఆయన పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీ ప్రతిస్పందన కోరుతూ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా సోమవారం నోటీసులు జారీ చేశా రు. వీటికి ఈనెల 24లోపు జవాబివ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ.. న్యాయస్థానం దృగ్గోచరమకు గురయ్యే కొన్ని వాస్తవాలను వెల్లడించాలనుకుంటున్నట్లు తెలిపారు. కేజ్రీవాల్ అరెస్టుతో ఆయన ఎన్నికల్లో ప్రచారం చేసే పరిస్థితి లేకుండాపోయిందంటూ సింఘ్వి చేసిన వాదనలను సుప్రీం విస్మరించింది. కాగా.. సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట లభించలేదని తెలిసిన కొద్దిసేపటికే రౌజ్ అవెన్యూలోని ఈడీ ప్రత్యేక కోర్టు కూడా ఆయన జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 23వరకు పొడిగించింది. దాంతో తిహాడ్ జైలులో కేజ్రీవాల్ కనీసం మరో రెండు వారాలు గడపక తప్పదని తెలుస్తోంది.

కేజ్రీవాల్‌ను ఉగ్రవాదిగా చూస్తున్నారు: మాన్

కేజ్రీవాల్‌ను జైల్లో ఉగ్రవాదిగా చూస్తున్నారని, కరడుగట్టిన నేరగాళ్లకు ఇచ్చే సౌకర్యాలుకూడా కల్పించడంలేదని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆరోపించారు. సోమవారం ఆయన తిహాడ్ జైల్లో కేజ్రీవాల్‌ను కలిశారు. అద్దాల గోడకు అటూ ఇటూ కూర్చొని దాదాపు అరగంటసేపు ఫోన్ లైన్ ద్వారా మాట్లాడుకున్నారు. కాగా కేజ్రీవాల్ జైలు నుంచే ప్రభుత్వ పాలనను నిర్వహించనున్నారు. వచ్చే వారం నుంచి జైల్లోనే రోజుకు ఇద్దరు మంత్రుల చొప్పున కలుసుకుని, ఆయావిభాగాల్లో పురోగతిని పరీక్షించనున్నారు.

బెదిరింపులు.. వేధింపులు భరించలేకే..

- అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతున్నా
- వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి వాదనలు
- దస్తగిరి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తాను అప్రూవర్‌గా మారినప్పటి నుంచి వస్తున్న బెదిరింపులు, వేధింపులు భరించలేకే ఈ కేసులో నిందితుడు, ఎంపీ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశానని తెలంగాణ హైకోర్టుకు దస్తగిరి తెలిపారు. ఆయన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. దస్తగిరి, వివేకా కుమార్తె సునీతారెడ్డి, సీబీఐతోపాటు అవినాశ్‌రెడ్డి వాదనలూ విని తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు దస్తగిరి తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. "నా తండ్రిపై దాడి, మరో నిందితుడు శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్య రెడ్డి జైల్లోకి వచ్చి నరికేస్తానని బెదిరించడం వంటి రెండుమూడు ఘటనలే కాకుండా చాలా సందర్భాల్లో వేధింపులకు పాల్పడుతూనే ఉన్నారు. ఇక భరించలేకే అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ పిటిషన్ దాఖలు చేశాను. 'మా జగనన్న పైనే పోటీచేస్తాడా నీ కొడుకు' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు నా తండ్రిపై దాడిచేశారు. సీబీఐ అధికారి రాంసింగ్ కొట్టి అప్రూవర్‌గా మార్చాడని మీడియాకు చెప్పాలని చైతన్యరెడ్డి బెదిరించాడు. తమ మాట వినకపోతే నా భార్యపై కేసులు పెట్టి లోపలేస్తామని, నా పిల్లలు అనాథలవుతారని, కుటుంబంతో సహా అంతం చేస్తాం అని ఒత్తిడి తెచ్చాడు. అవినాశ్‌రెడ్డికి ముందస్తు బెయిల్ వచ్చిన తర్వాత నాపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు పెట్టారు. ఏడేళ్ల కంటే తక్కువ జైలుశిక్ష పడే చిన్న కేసులో 137 రోజులు జైల్లో ఉంచారు. నన్ను నిందితుడిగా కాకుండా సాక్షిగా గుర్తించాలని దాఖలు చేసిన పిటిషన్ సీబీఐ కేసులో పెండింగ్‌లో ఉంది. నిందితులు బయట ఉంటే నాకు నాకు కుటుంబానికి రక్షణ లేదు ఈ పరిస్థితుల్లో అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు' అని దస్తగిరి కోరారు. వివేకా కుమార్తె సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నళిన్‌కుమార్ వాదనలు వినిపించారు. "అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలకు హైకోర్టు బెయిల్ ఇవ్వడంపై సుప్రీంకోర్టులో పిటిషన్‌లు వేశాం. సాక్షుల విషయంలో నేరుగా రాష్ట్ర పోలీసులే జోక్యం చేసుకుంటున్నారు. ఇతర కేసుల్లో దస్తగిరిని అరెస్టు చేసిన పోలీసులు 'వైఎస్ వాళ్లతో ఎందుకు పెట్టుకుంటున్నావు? అప్రూవర్‌గా బలవంతంగా మార్చారని ప్రెస్‌మీట్ పెట్టి చెప్పు' అని పోలీసులే దస్తగిరిని బెదిరించినట్లు ఉంది. దస్తగిరి భార్యను స్థానికంగా ఉండే ఓ మహిళా టైలర్, వైసీపీ కార్పొరేటర్ కలిశారని దస్తగిరి రాసిన లేఖలో ఉంది. రూ. 5 కోట్లు ఇస్తాం.. ఇంకా కావాలంటే జగనన్న ఓఎస్డీ కార్యాలయంలో రూ.20 కోట్లు ఇప్పిస్తామని ప్రలోభ పెట్టారు. మరో ఘటనలో ఆయన తండ్రిపై దాడిచేశారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ట్రయల్ జరిగే పరిస్థితి లేదు. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలి" అని కోరారు. సీబీఐ తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనిల్ తన్వర్ వాదనలు వినిపించారు. "చైతన్యరెడ్డి జైలుకు వెళ్లినట్లు జైలు అధికారులు అంగీకరించారు. 'నీ భార్యను అరెస్టు చేయిస్తా'మని దస్తగిరిని బెదిరించారు. అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి ' అని కోరారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. వేసవి సెలవుల తర్వాత భాస్కర్‌రెడ్డి, ఎంవీ కృష్ణారెడ్డి, అజయ్ కల్లం పిటిషన్‌లపై విచారణ చేపడతామని వ్యాఖ్యానించింది.

రాణాలో కాంగ్రెస్ నేత డ్యాన్స్

- సోషల్ మీడియాలో వైరల్.. ఎస్సైపై బదిలీ వేటు
- హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

మహదేవపూర్, ఏప్రిల్ 15: ఠాణాలో సరదాగా డ్యాన్స్ చేసిన ఓ జడ్పీటీసీ సభ్యురాలి భర్త.. ఇద్దరు పోలీసులపై క్రమశిక్షణ చర్యలకు కారకులైన ఉదంతమిది..! ఈ ఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో జరిగింది. మహదేవపూర్ జడ్పీటీసీ సభ్యురాలు గుడాల అరుణ భర్త, స్థానిక కాంగ్రెస్ నేత శ్రీనివాస్ సోమవారం ఉదయం మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లారు. ఆ సమయంలో ఎస్సై(ఎస్‌హెచ్‌వో) ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పనిలో ఉన్నారు. కాంగ్రెస్ నేత ఫోన్‌లో సినిమా పాటపెట్టి.. అందుకు అనుగుణంగా స్టెప్పులు వేశారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనిపై సీరియస్ అయిన మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ ఎస్సై ప్రసాద్‌ను ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌పై బదిలీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు.

ఏసీబీ వలలో లంచావతారాలు!

- ఒకే రోజు మహిళా ఎస్సై, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీసీ డీఎం పట్టివేత


ఎస్సై రాజ్యలక్ష్మి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్, ఆర్టీసీ డీఎం శ్రీకాంత్

ఆసిఫాబాద్, నల్లగొండటౌన్, ఎల్కతుర్తి, హుజూరాబాద్: లంచావతారాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. లంచం తీసుకుంటుండగా ఒకేరోజు ఏకంగా ముగ్గురిని పట్టుకున్నారు. వీరిలో ఒక మహిళా ఎస్సై, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఉన్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ గ్రామంవద్ద గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి స్టేషన్ బెయిల్, వాహనం విడుదలకు మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన యాహియఖాన్‌ను రాజ్యలక్ష్మి రూ.40వేలు డిమాండ్‌చేయగా రూ.25వేలకు ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో బాధితుడు కరీంనగర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం యాహియఖాన్ ఎస్సైకి రూ.25వేలు ఇస్తున్న క్రమంలో అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లోని కొత్తగూడెంలో నూకల వెంకట్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్పత్రిని ప్రారంభించారు. అందులో ఫార్మసీ అనుమతి కోసం ఆస్పత్రి మేనేజర్ చిట్టెపు సైదిరెడ్డి గత నెల 26న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా సరైన ధ్రువీకరణ పత్రాలులేవనే కారణంతో దరఖాస్తు తిరస్కరణకు గురైంది. దీంతో సైదిరెడ్డి ఈనెల 3న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్‌ను కలిశారు. అనుమతి కోసం మళ్లీ ఆన్‌లైన్ చేసుకోవాలని, దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపేందుకు రూ.18వేలు ఇవ్వాలని సోమేశ్వర్ డిమాండ్ చేశారు. దీంతో సైదిరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం కార్యాలయంలో సోమేశ్వర్‌ను కలిసి రూ.18వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఆర్టీసీ డ్రైవర్‌పై చార్జిమెమో ఎత్తివేసేందుకు లంచం డిమాండ్ చేసిన డిపో మేనేజర్ డబ్బులు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు సోమవారం చిక్కారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లికి చెందిన తాటికొండ రవీందర్ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఫిబ్రవరిలో తన బంధువు మృతి చెందడంతో రవీందర్ ఒక రోజు విధులకు హాజరుకాలేదు. తర్వాత డ్యూటీకి వెళ్లగా విధులకు రానందుకు మూడు రోజులు గైర్హాజరు వేయడంతోపాటు డిపో మేనేజర్ చార్జిమెమోను జారీ చేశారు. ఈ మెమోను ఎత్తివేసేందుకు రూ.30 వేలు ఇవ్వాలని రవీందర్‌ను డిపో మేనేజర్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మొదటగా రూ.10 వేలు మేనేజర్‌కు రవీందర్ ఇవ్వగా మిగతా రూ.20 వేలు ఇవ్వాలని ఇటీవల మేనేజర్ ఒత్తిడి చేశారు. దీంతో రవీందర్ వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఓ హోటల్‌కి డిపో మేనేజర్ శ్రీకాంత్ రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ముమ్మాటికీ అవినాశే!

వివేకా, అవినాశ్ కుటుంబాల మధ్య పదేళ్లుగా రాజకీయ విభేదాలు.. అడ్డు తొలగించాలనే హత్య

మేనత్తను దేవుడు క్షమించడు: సునీత

మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): "వివేకా హత్య ముమ్మాటికీ అవినాశ్ రెడ్డి పనే. ఇందుకు అన్ని ఆధారాలూ ఉన్నాయి. హంతకులను కాపాడుతున్న ముఖ్యమంత్రి జగన్ చేతిలో అధికారం ఉండకూడదు. వివేకా హత్య జరిగిన రోజు రాత్రి అంటే.. 15-3-2019 తెల్లవారుజామున 1:37 గంటల నుంచి 2 గంటలా 19 నిమిషాల మధ్య ఏ1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి, అవినాశ్ మధ్య ఫోన్ కాల్స్ నడిచాయి. ఆ సమయంలోనే వివేకా హత్య జరిగింది" అని వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. వివేకా హత్య జరిగిన తరువాత అవినాశ్ నంబరు నుంచి చాలా కాల్స్ బయటికి వెళ్లాయని, అవి ఎవరికి వెళ్లాయో అవినాశ్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. వివేకా చేతి వేళ్లను నరికేశారని, నుదుటిమీద, తలవెనుక గొడ్డలిపోట్లు ఉన్నాయని, అయినా, ఉదయం 7:44 గంటలకు సాక్షి చానల్‌లో 'గుండెపోటుతో వివేకా మృతి' అని ప్రసారం చేశారని, దీనిపై సాక్షి ఛైర్మన్‌ను సీబీఐ విచారించాలని డిమాండ్ చేశారు. వివేకా హత్య జరిగిన గది నుంచే సాక్షికి సమాచారం వెళ్లిందని, సాక్షి ఓనర్‌కు వివేకా హత్యకు సంబంధించిన లైవ్ అప్‌డేట్స్ ఎవరు ఇచ్చారో విచారణ చేయాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో సునీత మీడియాతో మాట్లాడారు. తన తండ్రి హత్యకు దారితీసిన పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. 'జస్టిస్ ఫర్ వివేకా.. సూత్రధారులెవరు..?' పేరిట పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను వివరించారు. హత్య జరిగినపుడు జగన్ చానల్‌లో ప్రసారమైన వార్తలను, ఆ రోజు అవినాశ్ మీడియాతో మాట్లాడిన వీడియోను, వివేకా మృతదేహంపై ఉన్న గాయాల వీడియోలను ప్రదర్శించారు. వివేకా హత్య జరిగిన రోజు రాత్రి జరిగిన సంఘటనలను వివరించారు. హత్య జరిగిన తర్వాత తెల్లవారుజామున 3.15 గంటలకు ఏ3 గజ్జల ఉమాశంకర్ రెడ్డి వివేకా ఇంటి వైపు నుంచి అవినాశ్ రెడ్డి ఇంటి వైపు పరిగెత్తిన ఫుటేజీని మీడియాకు ప్రదర్శించారు. నిందితులతో అవినాశ్ రెడ్డి దిగిన ఫొటోలను బయటపెట్టారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య లైవ్ అప్‌డేట్స్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోదరుడు, ఎంపీ అవినాశ్ రెడ్డికి తెలుసునని స్పష్టం చేశారు. ఈ కేసులో వేళ్లన్నీ అవినాశ్ వైపే చూపిస్తున్నాయని, అందుకు బలమైన సాక్ష్యాలు ఉన్నాయన్నారు. గూగుల్ టేకౌట్ ప్రకారం వివేకా హత్యకు ముందు రోజు నిందితుడు సునీల్ యాదవ్ అవినాశ్ రెడ్డి ఇంట్లో ఉన్నాడని వెల్లడించారు. హత్య జరిగిన రోజు రాత్రి మరో నిందితుడు ఎర్రగంగిరెడ్డి, అవినాశ్ మధ్య ఫోన్ కాల్స్ సాగినట్టు సీబీఐ విచారణలో గుర్తించిందని తెలిపారు. వివేకా, భాస్కర్ రెడ్డి (అవినాశ్ తండ్రి) కుటుంబాల మధ్య పదేళ్లుగా రాజకీయ విభేదాలు ఉన్నాయని, వివేకా ఉన్నంత కాలం రాజకీయంగా ఎదగలేమని, అయన్ను అడ్డు తొలగిస్తేనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని హత్య చేయించారని ఆరోపించారు. పథకం పన్ని, అతికిరాతకంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "సీబీఐ ఇచ్చిన వీడియోలు చూస్తే ఏడుపు ఆగడం లేదు. ఇంత స్పష్టమైన ఆధారాలు ఉన్నా గుండెపోటు, రక్తపు వాంతులు అని ప్రచారం చేశారు. నెత్తుటి మడుగులో వివేకా మృతదేహం ఉంటే.. సాక్షి టీవీ గుండెపోటు అని ప్రసారం చేసింది. సాక్షి ఛైర్మన్‌ను విచారించాలి. ముఖ్యమంత్రి హోదాలో ఉండి హంతకులను కాపాడుతున్న జగన్ చేతిలో అధికారం ఉండకూడదు" అని సునీత నిలదీశారు. అవినాశ్ రెడ్డి తీసుకున్న ఒక స్క్రీన్‌షాట్‌ను పరిశీలిస్తే హత్య జరిగిన రోజు రాత్రి ఆయన ఫోన్ నుంచి ఉమాశంకర్ రెడ్డికి పలు దఫాలు కాల్ చేసినట్లు నమోదై ఉందని తెలిపారు. హత్య గురించి తమకు ఏమీ తెలియదని భాస్కర్ రెడ్డి, అవినాశ్ చెప్పడం పచ్చి అబద్ధమని చెప్పారు. నిందితులు ఎవరూ తనకు తెలియదని అవినాశ్ రెడ్డి బుకాయించినా.. గూగుల్ టేక్ అవుట్ వాస్తవాలను బయట పెట్టిందని సునీత తెలిపారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సునీత

అవినాశ్-గంగిరెడ్డి ఫోన్‌కాల్స్

ఐపీడీఆర్ (ఇంటర్నెట్ ప్రొటోకాల్ డిటైల్ రికార్డ్) ద్వారా వివేకా హత్య కేసు నిందితులు తమ ఫోన్లను, డేటాను ఎందుకు వాడారనే వివరాలను సీబీఐ సేకరించిందని సునీత తెలిపారు. ఆ వివరాల ప్రకారం వాట్సాప్ కాల్స్ హత్య జరిగిన రోజు, హత్యకు ముందు ఎవరెవరి మధ్య సంభాషణలు జరిగాయో సీబీఐ సేకరించిందన్నారు. "వివేకా హత్య జరిగిన రాత్రి అంటే 15-3-2019న తెల్లవారుజామున 1:37 నిమిషాల 8 సెకన్ల సమయంలో ఎర్ర గంగిరెడ్డి తన ఫోన్ 9440281444 నుంచి అవినాశ్ రెడ్డి నంబరు 9989067352కు కాల్ చేశారని గుర్తించారు. అవినాశ్ ఫోన్ నుంచి గంగిరెడ్డికి 2.19 గంటల సమయంలో ఫోన్ వెళ్లింది. అదే సమయంలో వివేకా హత్య జరిగింది. వివేకా హత్య దృశ్యాలను చూస్తే ఆయనది గుండెపోటు అని ఎవరికైనా అనిపిస్తుందా" అని సునీత ప్రశ్నించారు. హత్య వీడియోను సాక్షి విలేకరి తీసి భాస్కర్ రెడ్డికి పంపారు. ఇంట్లో నుంచి మృతదేహాన్ని బయటికి తెచ్చే సమయంలో వివేకా ఇంట్లోనే భాస్కర్ రెడ్డి, అవినాశ్ రెడ్డి ఉన్నారు. ఉదయం 7:44 గంటలకు సాక్షి చానల్‌లో 'గుండెపోటుతో వివేకా మృతి' అని ప్రసారం చేశారు. ఉదయం 10.06 గంటల సమయంలో విజయసాయి రెడ్డి మాట్లాడుతూ గుండెపోటుతో వివేకా మరణించడం బాధాకరమని చెప్పారు. 10:31 గంటల సమయంలో పీఏ కృష్ణారెడ్డి వివేకా తలపై గాయాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు 11 గంటల సమయంలో మీడియా ముందుకు వచ్చిన అవినాశ్.. రక్తపు వాంతులతో చనిపోయి ఉంటారని భావించామని.. తలపై ఉన్న గాయాలు చూశాక హత్య చేశారనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు' హత్య వెనుక జరిగిన వాస్తవాలు ఇవీ అని సునీత ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఇప్పుడు నాది ఒంటరి పోరాటం కాదు

తన తండ్రి మృతి చెందాక ఐదేళ్లపాటు న్యాయం కోసం తాను ఒంటరిగానే పోరాటం చేశానని సునీత పేర్కొన్నారు. ఇప్పుడు తనకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి మద్దతు వస్తోందని, తాను ఒంటరిని కాదని తెలిపారు. సీబీఐ నుంచి తనకు 4 టెరాబైట్స్ డేటా వచ్చిందని, దాన్ని పూర్తిగా చూడలేదని.. అందులో నుంచి కొంత సమాచారమే ఇప్పటి వరకు తాను చూసినట్లు తెలిపారు. న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తే అమాయకులు తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. తన తండ్రి హత్యకు సంబంధించిన దృశ్యాలను ఇప్పటికీ తాను చూడలేకపోతున్నానని కన్నీటి పర్యంతం అయ్యారు. తనకు జరిగిన అన్యాయం వివరించి, తనకు న్యాయం చేయాలని కోరేందుకు సీఎంగా ఉన్న జగన్ మోహన్ రెడ్డిని కలవాలని అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖలు రాస్తే కనీసం స్పందించలేదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి బాధ్యత ఇదేనా అని ప్రశ్నించారు. జగన్‌కు, బీజేపీతో అవినాభావ సంబంధం ఉందన్నారు. జగన్‌కు ఏదైనా సమస్య వస్తే ఢిల్లీపెద్దలు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందన్నారు.

మేనత్తను ఆ దేవుడు కూడా క్షమించడు

చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన తన మేనత్త అయిదుగురు అన్నదమ్ములకు ఒకటే ఆడపడుచు అని.. ఆమెను అతి గారాబంగా పెంచారని సునీత వివరించారు. సొంత అన్నను హత్య చేస్తే చలనం లేని ఆమె.. హంతకులవైపు ప్రేమను చూపుతూ వారికి వంత పాడటం ద్వారా తన అన్నపై చాలా ప్రేమ చూపుతోందని ఎద్దేవా చేశారు. పాపుల వైపు నిలబడిన తన మేనత్తను ఆ దేవుడు కూడా క్షమించడని పేర్కొన్నారు.

బీజేపీపై జనంలో మౌన వ్యతిరేకత

ఆ పార్టీకి 370, ఎన్డీఏకి 400 సీట్లు అసాధ్యం.. మోదీ హవా తగ్గింది.. విపక్షాలపై అణిచివేత వికటించనుంది

- పలు రాష్ట్రాల్లో బీజేపీ స్కోరు తగ్గడమేగానీ పెరగదు
- ఫలితాల తర్వాత ఎన్డీఏ పార్టీలు సొంత నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది
- తటస్థ పార్టీలూ కీలకపాత్ర పోషిస్తాయి
- 'ఇండియా కూటమి' అంచనాలు
- 250 సీట్ల వరకూ సాధించగలమని ధీమా





న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఎన్ని సీట్లు సాధిస్తుంది? ఇండియా కూటమి ఎన్ని గెల్చుకుంటుంది? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. దేశ రాజధానిలో దీనిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఎన్డీఏకు, తమకు మధ్య 50 నుంచి 70 సీట్లకు మించి తేడా ఉండకపోవచ్చునని ఇండియా కూటమి వర్గాలు చెబుతున్నాయి. ఇందుకు వారు అనేక కారణాలు చూపిస్తున్నారు. 1. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతోపాటు మోదీ వ్యవహార శైలి నచ్చని అనేక ఇతర వర్గాలవారు మౌనంగా సంఘటితమవుతున్నారు. వారే ఈ ఎన్నికల్లో నిర్ణాయక శక్తిగా మారనున్నారు. 2. 2019తో పోలిస్తే 2024లో మోదీ హవా అంతగా లేదు. జనంలో ఆయన మీద మోజు తగ్గిపోతోంది. 3. గత లోక్‌సభ ఎన్నికల్లో యూపీ, గుజరాత్, కర్ణాటక, హరియాణా, అస్సాం, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో బీజేపీ అత్యధిక సీట్లు సాధించింది. ఈసారి ఆయా రాష్ట్రాల్లో ఎంతో కొంత నష్టం తప్పదు 4. బీజేపీకి మోదీ ఏకైక నాయకుడిగా మారటంతో రాష్ట్ర, జాతీయస్థాయి అన్ని ఎన్నికల్లోనూ ఆయన మీదే ఆధారపడే పరిస్థితి ఆ పార్టీకి ఉంది. పలు రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి నేతలను పెద్దఎత్తున బీజేపీలో చేర్చుకుంటున్నారు. ఇది ఆ పార్టీకి వ్యతిరేకంగా మారే అవకాశం ఉంది. 5. ప్రతిపక్ష పార్టీలపై ఓవైపు తీవ్ర అణిచివేత చర్యలకు పాల్పడుతూ మరోవైపు వారినే అవినీతిపరులుగా చిత్రిస్తూ మోదీ చేస్తున్న ప్రచారం పస కోల్పోతోంది. ఇది వికటించే అవకాశాలున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్డీఏకు, ఇండియా కూటమికి మధ్య 50 నుంచి 70 సీట్ల తేడా మాత్రమే ఉంటే.. ఎన్డీఏ కూటమిలో ఉన్న పార్టీలే కాక బీజేడీ, అకాలీదళ్, అన్నాడీఎంకే వంటి తటస్థంగా ఉన్న పార్టీలు కీలక పాత్ర పోషించే అవకాశాలున్నాయని ఇండియా కూటమి భావిస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏలో అజిత్ పవార్ ఎన్సీపీ, ఏక్‌నాథ్‌షిండే శివసేన, నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్‌జనశక్తి, అప్నాదళ్, ఆర్‌ఎల్డీ, తెలుగుదేశం, జనసేన ఉన్నాయి. ఎన్నికల అనంతరం ఎన్డీఏ కూటమిలోని పార్టీలు ఫలితాలనుబట్టి రాజకీయ సమీకరణల్లో భాగమయ్యే అవకాశాలు లేకపోలేదని ఇండియా కూటమి వర్గాలు తెలిపాయి. మరోవైపు గత ఎన్నికలతో పోలిస్తే వివిధ రాష్ట్రాల్లో ఫలితాలు మారే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నాయి. రామమందిర ప్రభావం ఎంత ఉన్నా ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లలో ఈసారి 15 సీట్లన్నా తమకు దక్కుతాయని ఇండియా కూటమి ఆశిస్తోంది. ఆ రాష్ట్రంలో బీసీలు, మైనారిటీలు సంఘటితం కావడం, మాయావతి ప్రభావం దాదాపు తగ్గిపోవడం ఇందుకు కారణాలుగా చెబుతున్నారు. మహారాష్ట్రలో అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే బీజేపీతో చేతులు కలిపినాప్రజలు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేల వైపే సానుకూలంగా ఉన్నారని, ఈసారి తమ కూటమి మొత్తం 48 సీట్లలో సగమైనా సాధిస్తుందని పేర్కొంటున్నారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పుంజుకుంటున్నా మొత్తం 42 సీట్లలో 20 దాటే అవకాశాలు లేవని వారు భావిస్తున్నారు. బిహార్‌లో గత ఎన్నికల్లో ఎన్డీఏ 39 సీట్లు సాధించిందని, తరచూ పార్టీలు మారే నితీష్ కుమార్ విశ్వసనీయత తగ్గిపోవడం, వివిధ సామాజిక వర్గాలు, మైనారిటీలు సంఘటితమై ఇండియా కూటమికి దన్నుగా నిలవటం వల్ల ఎన్డీఏ సంఖ్యాబలంఈసారి 25 సీట్లకు దాటే అవకాశాలు లేవని అంటున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లలో దాదాపు అన్ని సీట్లు గత ఎన్నికల్లో బీజేపీ గెల్చుకుంది. ఈసారి ఆ రాష్ట్రాల్లో 8 నుంచి 10 సీట్లు కోల్పోవచ్చని తెలుస్తోంది. కర్ణాటకలో గత ఎన్నికల్లో 28 సీట్లలో 25 సీట్లు గెలుచుకున్న ఎన్డీఏ సంఖ్యాబలం ఈసారి 15 సీట్లలోపే పరిమితం అయ్యే అవకాశాలున్నాయి.

తెలంగాణలో నాలుగు కష్టమే

తెలంగాణలో బీజేపీ గతంలో గెలుచుకున్న నాలుగు సీట్లనే నిలబెట్టుకోవడం కష్టమని, తమిళనాడు, కేరళలో ఆ పార్టీకి సీట్లు వచ్చే అవకాశాలు లేవని ఇండియా కూటమి వర్గాలు తెలిపాయి. ఇక ఒడిశాలో గతంలో మాదిరే గరిష్ఠంగా 8 సీట్లకు మించి గెలుచుకోలేదని, అస్సాంలో ఏడు సీట్లు గెలుచుకోవచ్చని వారు అంటున్నారు. జార్ఖండ్‌లో 10, ఛత్తీస్‌గఢ్‌లో 8, హర్యానాలో 7, ఉత్తరాఖండ్‌లో మూడు సీట్లు గెలుచుకున్నా బీజేపీకి అధికారం దక్కదని పేర్కొన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ అరెస్టు కారణంగా వచ్చిన సానుభూతితో ఇండియా కూటమి కనీసం 3 సీట్లనైనా గెల్చుకుంటుందని అంచనా వేస్తున్నారు. మొత్తమ్మీద బీజేపీ చెబుతున్నట్లుగా సొంతంగా 370 సీట్లు, ఎన్డీఏ కూటమి 400 సీట్లకుపైగా సీట్లను సాధించే పరిస్థితి లేదని చెబుతున్నాయి.

బైకును ఢీకొట్టి.. మృతదేహంతో ముందుకు..

- 18 కి.మీ. నడుస్తున్న కారుపైనే మృతదేహం
- అనంతలో ఇన్నోవా డ్రైవర్ ఘాతుకం


ఎర్రిస్వామి (ఫైల్)

ఆత్మకూరు ఏప్రిల్ 15: ఇన్నోవా కారులో అతివేగంగా వెళుతూ ఓ బైకును ఢీకొట్టాడు. ఆ ఉదుటుకు ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి ఎగిరి ఇన్నోవాపై పడి ప్రాణాలు కోల్పోయాడు. దీన్ని పట్టించుకోకుండా కారును డ్రైవర్ అలాగే 18 కిలోమీటర్ల దూరం ముందుకు దూసుకుపోయాడు. ఈ దారుణ ఘటన ఏపీలోని అనంతపురం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగింది. కూడేరు మండలం చోళసముద్రానికి చెందిన జిన్నే ఎర్రిస్వామి (35) అనంతపురంలో మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అత్తవారి ఊరు సిద్ధరాంపురానికి వచ్చిన ఆయన, ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. ఆత్మకూరు మండలం వైకొత్తపల్లి వద్దకు చేరుకోగానే అనంతపురం వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవా..ఎర్రిస్వామి బైకును ఢీకొట్టింది. ఎర్రిస్వామి ఎగిరి ఇన్నోవాపై పడి ప్రాణాలు కోల్పోయాడు. అయినా వాహనాన్ని ఆపకుండా డ్రైవర్ ముందుకు వెళ్లిపోయా డు. గమనించిన మరో వాహనదారుడు.. ఇన్నోవాను వెంబడించి ఓవర్‌టేక్ చేశాడు. అక్కడ స్థానికులను అప్రమత్తం చేశాడు. అక్కడున్న గొర్రెల కాపరులు, స్థానికులు రోడ్డుపైకి వచ్చి.. ఇన్నోవా రాగానే కేకలు వేశారు. దీంతో భయపడిన డ్రైవర్.. ఇన్నోవాను నిలిపి పారిపోయాడు. విచారణ జరిపి, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

వివాహేతర సంబంధం పెట్టుకుని నా భర్త నన్ను పట్టించుకోవట్లేదు

- ఇంటి ఎదుట మెదక్ ఏఆర్ డీఎస్పీ భార్య ధర్నా

హయత్‌నగర్, ఆదిభట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పరాయి స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకుని భర్త తనను పట్టించుకోవడం లేదంటూ మెదక్ ఏఆర్ డీఎస్పీ రంగనాథ్ భార్య జ్యోతి ఆయన ఇంటి ముందు బైఠాయించారు. రంగ నాథ్‌కు నాగార్జునసాగర్‌కు చెందిన జత్లావత్ జ్యోతితో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలుండగా, ప్రస్తుతం హాస్టల్‌లో ఉంటున్నారు. జ్యోతికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో గతేడాది నవంబర్‌లో ఆమె తమ్ముడు ఆమెను పుట్టింటికి తీసుకెళ్లారు. అయితే అప్పటి నుంచి రంగనాథ్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను దూరం పెట్టారని జ్యోతి ఆరోపించారు. సోమవారం కుటుంబసభ్యులతో కలిసి తుర్కయంజాల్‌లోని భర్త రంగనాథ్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి రంగనాథ్‌తో చర్చించి గేటు తాళం తీయించడంతో జ్యోతి ఇంట్లోకి వెళ్లారు. దాంతో సమస్య సద్దుమణిగింది. కాగా, భర్తపై తాను నల్లగొండ మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశానని జ్యోతి చెప్పారు.

తొలిదశ ఎన్నికల్లో సంపన్నులు

- బరిలో 1618 మంది అభ్యర్థులు
- ఐదుగురు అపర కోటీశ్వరులు
- 252 మందిపై క్రిమినల్ కేసులు

సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ ఈ నెల 19న జరగనుంది. మొత్తం 1,618 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. వీరిలో ఐదుగురు అపర కోటీశ్వరులు కావడం గమనార్హం. 252 మందిపై(16%) క్రిమినల్ కేసులు ఉన్నాయి. మరో 161 మందిపై(10%) తీవ్ర స్థాయి క్రిమినల్ నేరాలు నమోదయ్యాయి. ఎన్నికల సంఘానికి అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ ఆయా వివరాలు వెల్లడించింది.

- మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ ఆస్తులు రూ.716 కోట్లు. సంపన్నుల జాబితాలో ఈయనదే తొలిస్థానం.
- తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గం నుంచి బరిలో ఉన్న ఏఐఏడీఎంకే అభ్యర్థి అశోక్‌కుమార్ ఆస్తులు రూ.662 కోట్లు. ఈయన అత్యధిక సంపన్నుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు.
- రూ.304 కోట్ల ఆస్తులతో బీజేపీ అభ్యర్థి దేవనాథన్‌యాదవ్ .టి మూడోస్థానంలో ఉన్నారు. ఈయన తమిళనాడులోని శివగంగ నుంచి పోటీ చేస్తున్నారు.
- ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ గఢ్వాల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి మాలా రాజ్యలక్ష్మీషా రూ.206 కోట్ల ఆస్తులతో నాలుగో స్థానంలో నిలిచారు.
- ఉత్తరప్రదేశ్‌లోని షహరన్‌పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి మాజిద్ అలీ రూ.159 కోట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

నేరాల చిట్టా ఇదీ..

- తొలిదశలో పోటీ చేస్తున్న 1,618 మంది అభ్యర్థుల్లో 252 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.
- 161 మంది అభ్యర్థులపై అతి తీవ్ర నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.
- ఏడుగురు అభ్యర్థులపై హత్య, 19 మందిపై హత్యాయత్నం కేసులు ఉన్నాయి.
- 18 మంది అభ్యర్థులపై మహిళలపై దాడులకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.
- ఒక అభ్యర్థిపై అత్యాచారం కేసు(సెక్షన్ 376) నమోదైంది.
- 35 మంది విద్వేష ప్రసంగాలతో సమాజంలో అల్లర్లు సృష్టించిన కేసులు ఎదుర్కొంటున్నారు.
- తొలిదశ ఎన్నికలు జరుగుతున్న 102 స్థానాలకు సంబంధించి 43 సీట్లలో ఎన్నికల సంఘం రెడ్ అలర్ట్ ప్రకటించింది.

- సెంట్రల్ డెస్క్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చెల్లుకు చెల్లు!

ముప్ఫైమూడేళ్ళ తరువాత ఇజ్రాయెల్‌మీద నేరుగా దాడిచేసిన మొదటి సార్వభౌమ దేశంగా ఇరాన్ ఆదివారం రికార్డులకు ఎక్కింది. వందలాది క్షిపణులు, డ్రోన్లు ఇజ్రాయెల్‌మీద పంపి పక్షంరోజుల క్రితం తాను చేసిన శపథాన్ని నిలబెట్టుకుంది. అసలే లేవనివి, చివరిదాకా సాగనివి, పేలనివి, మార్గమధ్యంలోనే కూలినవి పోను గట్టిగా ఓ డజను క్షిపణులు కూడా ఇజ్రాయెల్‌ను తాకలేదని వార్తలు వచ్చాయి. పదేళ్ళబాలిక గాయపడిందని, సైనికులు, యుద్ధవిమానాలు లేని ఓ చిన్న మిలటరీబేస్ ధ్వంసమైందని తప్ప, పెద్దగా విధ్వంసం జరిగినట్టు దాఖలాలులేవు. ఇన్నేళ్ళకు, అంత తెగించి, ఇంతభారీగా చేసిన దాడి చివరకు ఇలా పరిణమించడం ఆశ్చర్యం. ఇజ్రాయెల్ ఆయుధసంపత్తి, దాని ఆత్మరక్షణ సామర్థ్యం, అగ్రరాజ్యాలు దానికి ఇప్పటికే అందించిన, అందిస్తున్న ఆర్థిక, సాంకేతిక సహాయం ఎంత హెచ్చుస్థాయిదో ఇరాన్‌కు తెలియనిదేమీ కాదు. ఆగర్భశత్రువుమీద కక్షతీర్చుకొనే తమ లక్ష్యం నెరవేరిందని, ఆపరేషన్ ముగిసిందని ఇరాన్ వెంటనే ప్రకటించేయడం చూసినప్పుడు, ఇది ప్రతీకాత్మక దాడేకానీ, నిజంగా ప్రతీకారం కాదేమోనని చాలామందికి అనుమానం కలిగింది.

అమెరికా, బ్రిటన్, జోర్డన్ తదితర దేశాల సాయంతో ఈ దాడిని ఇజ్రాయెల్ విజయవంతంగా తిప్పికొట్టింది. అగ్రరాజ్యాల సమస్త రక్షణ వ్యవస్థలు చక్కని సమన్వయంతో పనిచేశాయి. ఈనెల ఒకటిన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడిచేసి, రివల్యూషనరీ గార్డ్స్ అత్యున్నతస్థాయి కమాండర్లతో సహా పన్నెండుమందిని ఇజ్రాయెల్ చంపివేయడం, ప్రతీకారం తీర్చుకొని తీరుతానని ఇరాన్ హెచ్చరించడం తెలిసినవే. గాజాయుద్ధం అత్యంత అమానవీయమైన స్థాయికి చేరుకున్న ప్రస్తుతస్థితిలో, తనకు జరిగిన ఈ అవమానానికి ఇరాన్ ఈమారు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటుందని చాలామంది విశ్వసించారు. ప్రతీకార దాడికి ఇరాన్ సన్నాహాలు ఆరంభించిదంటూ అమెరికానుంచి ఇజ్రాయెల్‌కు పదిరోజుల క్రితమే సమాచారం అందడంతోపాటు, ఇజ్రాయెల్‌ను కాపాడటంకోసం అగ్రరాజ్యాలు తమ ఆయుధ సంపత్తిని పశ్చిమాసియాకు హడావుడిగా తరలించిన విషయం తెలిసిందే. ఇక, తమ పొరుగుదేశాలకు ఈ దాడికి సంబంధించి డెబ్బయ్‌రెండు గంటల ముందస్తు సమాచారాన్ని అందచేశామని ఇరాన్ రక్షణమంత్రి తెలియచేశారు కూడా. ఈ ప్రతీకారదాడి అనూహ్యమైనది కాకపోవడంతో ఇజ్రాయెల్, దానిమిత్రదేశాలకు ఆత్మరక్షణకు తగినంత సమయం లభించింది.

ఎంత రెచ్చగొట్టినా, ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌మీద దాడికిదిగదన్న భ్రమలు ఈ ఘటనతో తొలగిపోయాయి. జరిగినదానికి ఆగ్రహంతో ఇజ్రాయెల్ కచ్చితంగా ఇరాన్‌మీద విరుచుపడుతుందని కొందరి నమ్మకం. ప్రతీకారం తథ్యమని ఇజ్రాయెల్, సహకారం ఖాయమని అమెరికా బయటకు ప్రకటిస్తున్నప్పటికీ, ఇరాన్‌తో కయ్యానికి దిగినపక్షంలో తాను ఏ మాత్రం రక్షించబోనని ఇజ్రాయెల్‌కు అమెరికా తేల్చేసింది. అమెరికా పాలకుడుగా ఎవరున్నా ఇజ్రాయెల్ పక్షాన నిలవడం తప్పదు కానీ, నెతన్యాహూను గుడ్డిగా వెనకేసుకొస్తూ, గాజాయుద్ధాన్ని అమెరికా యథేచ్ఛగా అనుమతించడం బైడెన్‌కు స్వదేశంలో చెడ్డపేరుతెస్తోంది. సంప్రదాయ డెమోక్రాట్ ఓటుబ్యాంకులోనే అసమ్మతి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఇరాన్ దాడికి ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకున్న పక్షంలో అది పశ్చిమాసియాకు మాత్రమే పరిమితం కాదు. అమెరికా దిగితే తానూ రంగప్రవేశం చేస్తానని రష్యా అంటోంది. గాజాయుద్ధం ప్రపంచాన్ని చుట్టుముడుతుందన్న భయాలు నిజమవుతాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు ముకుతాడు వేయాల్సిన అవసరం, బాధ్యత అమెరికాకు ఉన్నాయి. ఇరాన్ దాడి నిజానికి సంపూర్ణంగా విఫలమైనప్పటికీ, స్వదేశంతోపాటు చాలా ఇస్లామిక్ దేశాల ప్రజలకు అది ఆత్మసంతృప్తిని మిగల్చింది. గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌కు ఆ మాత్రం గుణపాఠం చెప్పినందుకు వారంతా సంతోషిస్తున్నారు. చెల్లుకు చెల్లు ఇక చాలు అని ఇరాన్ కూడా అంటోంది. కానీ, నెతన్యాహూ అధికారకూటమిలోని పార్టీలన్నీ ప్రతీకారం పేరిట ఆవేశంతో ఊగిపోతున్నాయని వార్తలు వస్తున్నాయి. ఆర్నెల్ల యుద్ధంలో ముప్పైమూడువేలమంది పాలస్తీనియన్లను ఊచకోతకోయడం, గాజాను నేలమట్టంచేయడం వినా నెతన్యాహూ సాధించిందేమీ లేదు. బందీలను విడిపించలేదు, హమాస్ నాయకత్వం నాశనం కాలేదు, యుద్ధం లక్ష్యాలన్నవేవీ నెరవేరలేదు. హమాస్ దాడికి ప్రతీకారం పేరిట గాజాలో సాగిస్తున్న మారణకాండకు స్వస్తిచెప్పి కాలువెనక్కుతీసుకొనేందుకు ఇజ్రాయెల్ ఇప్పటికైనా సిద్ధపడాలి.

జనసంకల్పమే మోదీ గ్యారంటీ

ప్రజలు తిరస్కరించిన రాజకీయ పార్టీలలో ప్రధానమైనది కాంగ్రెస్. గత రెండు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఘోరంగా ఓడించారు. కాంగ్రెస్ ఇప్పుడు దేశంలో కేవలం రెండు రాష్ట్రాలకు పరిమితమైన పార్టీ. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ బీజేపీని ముఖాముఖి 190 స్థానాల్లో ఎదుర్కొన్నది. బీజేపీ 175 స్థానాల్లో విజయం సాధించగా కేవలం 15 స్థానాల్లో మాత్రమే బొటాబొటి ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ గెలిచింది. దాదాపు 224 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 50 నుంచి 70 శాతం వరకు ఓట్లు సాధించింది. ఈ గణాంక వివరాలను చూస్తే ఏమి అర్థమవుతుంది? కాంగ్రెస్ పార్టీ బీజేపీ దరిదాపుల్లో కూడా రాలేదని స్పష్టమవుతుంది. అలాంటి పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకు ఏమి విలువ ఉంటుంది? దాదాపు 6 దశాబ్దాల పాటు ఈ దేశాన్ని ఏలినప్పటికీ కోట్లాది ప్రజలను దారిద్ర్యం నుంచి విముక్తి కలిగించలేకపోయిన పార్టీ ఇప్పుడు సామాజిక న్యాయం చేస్తామని ప్రగల్భాలు పలుకుతోంది. కుటుంబ వారసులు, అవినీతిపరులు, అక్రమార్జనపరులు, పదవికోసం నానా గడ్డి కరిచేవారున్న కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో ఆరుదశాబ్దాల పాటు ప్రజలను కులాలుగా, మతాలుగా చీల్చి పబ్బం గడుపుకుంది. అలాంటి పార్టీ చేసే వాగ్దానాలను ప్రజలు పట్టించుకునే అవకాశమే లేదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

భారతీయ జనతా పార్టీకి ఇలాంటి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోకు ఉన్న విశ్వసనీయత వేరు. ఎన్నికల ప్రణాళిక అనేది బీజేపీకి ఒక సైద్ధాంతిక పత్రం. ప్రజలను గౌరవించే ప్రమాణ పత్రం. ఒక దృఢ సంకల్పం. అందుకే రానున్న అయిదు సంవత్సరాల్లో బీజేపీ తాను అమలు చేసే కార్యక్రమాలను ఎన్నికల ముందు ప్రజలకు సంకల్పపత్రం రూపంలో తెలిపింది. సంకల్పం అంటే హామీలకు మించింది. రానున్న అయిదు సంవత్సరాల్లో ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మార్చేందుకు బీజేపీ కంకణం కట్టుకుంది. అవినీతిపై పోరును మరింత తీవ్రతరం చేస్తామని ప్రకటించింది. రాబోయే తరం కోసం సంస్కరణలను అమలు చేసి వివిధ రంగాల్లో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తామని స్పష్టం చేసింది. అనేక ప్రజా అనుకూల నిర్ణయాలను తీసుకుంటానని తెలిపింది. 2047 కల్లా భారత్‌ను అగ్రరాజ్యంగా మార్చేందుకు ఒక్క క్షణం వృథా చేయకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభిస్తామని తెలిపింది. వివిధ వర్గాలకు మోదీ గ్యారంటీ పేరుతో తాము తీసుకోబోయే చర్యలనన్నీ ఈ మేనిఫెస్టోలో ప్రకటించింది.



ఎన్నికల ప్రణాళిక అనేది బీజేపీకి ఒక సైద్ధాంతిక పత్రం. ప్రజలను గౌరవించే ప్రమాణ పత్రం. ఒక దృఢ సంకల్పం. అందుకే రానున్న అయిదు సంవత్సరాల్లో బీజేపీ తాను అమలు చేసే కార్యక్రమాలను ఎన్నికల ముందు ప్రజలకు సంకల్ప పత్రం రూపంలో తెలిపింది. వివిధ వర్గాలకు మోదీ గ్యారంటీ పేరుతో తాము తీసుకోబోయే చర్యలనన్నీ ఈ మేనిఫెస్టోలో ప్రకటించింది. బీజేపీ సంకల్పం అంటే ప్రజల సంకల్పం. మోదీ గ్యారంటీ అంటే జనం ఆత్మవిశ్వాసం.

బీజేపీ తాను వాగ్దానం చేసిన వాటిలో అనేకం అమలు చేసింది. కశ్మీర్‌ను భారతదేశం నుంచి విడదీసి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ను రద్దుచేసి కశ్మీర్‌ను మన దేశంలో అంతర్భాగం చేస్తామని బీజేపీ కొన్ని దశాబ్దాలుగా చెబుతూ వస్తోంది. పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ఆర్టికల్ 370ను రద్దు చేసింది. ఉమ్మడి పౌర స్మృతి దిశగా చర్యలు ప్రారంభించి త్రిపుల్ తలాఖ్‌ను రద్దుచేసింది. అయోధ్యలో శ్రీరాముడు జన్మించిన చోటే రామ మందిరం నిర్మించి తీరతామని బీజేపీ ఎప్పుడో వాగ్దానం చేసింది. ఆ కల నెరవేరి ఈ ఏడాది జనవరిలోనే అయోధ్యలో భవ్యమైన రామ మందిరం వెలిసింది. ఉగ్రవాదం, నక్సలిజంపై బీజేపీ ఏ మాత్రం సహించని వైఖరిని అవలంబించినందువల్లే ఇవాళ దేశం ఈ దుష్టశక్తులనుంచి ఊపిరి పీల్చుకుంటోంది. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసి దేశాభివృద్ధికి తగ్గ అధునాతన చట్టాలను ప్రవేశపెట్టింది. బ్రిటిష్ కాలపు వలస పాలనను ప్రతిబింబించే నేర శిక్షాస్మృతి స్థానంలో సమగ్రమైన భారతీయ నేర సంహితను ప్రవేశపెట్టింది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న 5 దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇప్పుడు ఆర్థికంగా బలోపేతమైన 5 దేశాల్లో ఒకటిగా మారింది. మోదీ హయాంలో 25 కోట్లమంది పేదలు దారిద్ర్య రేఖను దాటిపోయారు. రైతులు, మహిళలు, మత్స్యకారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపార సంస్థలు, ఎస్‌సి, ఎస్‌టి, ఆదివాసీల జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పులు కనపడుతున్నాయి. గత పది సంవత్సరాల్లో రైతులకు కనీస మద్దతు ధరలు భారీ ఎత్తున పెరిగాయి. అంతర్జాతీయ ధరలతో నిమిత్తం లేకుండా ఎరువులు చవక ధరల్లో లభిస్తున్నాయి. ఇవన్నీ బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రకటించి మరీ అమలు చేసింది. మోదీ ప్రభుత్వం గత పదేళ్లుగా తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేసేందుకే ఈ మేనిఫెస్టోను రూపొందించారు. పదేళ్ల క్రితం మోదీ అధికారంలోకి వచ్చిన సమయంలో దేశమంతా నిరాశా నిస్పృహలు నెలకొనివున్నాయి. మోదీ తొలి హయాంలో ఈ నిరాశా నిస్పృహలు తొలగిపోయి దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదనే విశ్వాసం బలపడింది. గత అయిదేళ్లలో ఈ విశ్వాసం ఆత్మవిశ్వాసంగా మారింది. దేశంలో నిరంతరం సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, మౌలిక సదుపాయాల నిర్మాణం, అభివృద్ధి వేగంగా అమలవుతాయని, యువకులు, మహిళలు, మధ్యతరగతి, అణగారిన వర్గాలకు అవకాశాలు పెరుగుతూనే ఉంటాయని ఒక స్పష్టత వచ్చింది. ఆధునిక భారతానికి అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకూ ఒకే పౌర స్మృతి కొనసాగుతుందని, స్త్రీపురుషుల మధ్య సమానత్వం ఏర్పడుతుందని ఆశాభావం కలిగింది. ప్రతి ఏడాది దేశంలో ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరిగి వేల కోట్లు ఖర్చయ్యే దుస్థితి పోయి ప్రతి ఐదేళ్లకూ ఒకేసారి దేశమంతటా అన్ని స్థాయిల్లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అందరికీ స్పష్టమైపోయింది.

ఈ పదేళ్లుగా ప్రధాని మోదీ పనితీరు ఆధారంగానే బీజేపీ ఇవాళ అత్యంత ఆత్మవిశ్వాసంతో తన సంకల్ప పత్రాన్ని ప్రజల ముందు ప్రకటించింది. వచ్చే పాతికేళ్లలోపు దేశంలో మార్పులు ఏమి జరుగబోతాయో ప్రకటించింది. గ్రామాల్లో పెద్ద ఎత్తున వ్యవసాయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అమలు చేసేందుకు 'కృషి మౌలిక సదుపాయాల మిషన్'ను ప్రకటించింది. వృద్ధులకు ఉచితంగా, నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్ యోజనను విస్తరిస్తామని తెలిపింది. 2029 వరకు దేశంలో 80 కోట్ల మంది భారతీయులకు ఉచితంగా ఆహార ధాన్యాల సరఫరా కొనసాగుతుందని తెలిపింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు పైప్ ద్వారా గ్యాస్‌ను అందిస్తామని తెలిపింది. ముద్రా రుణాలను రూ.20 లక్షల మేరకు రెట్టింపు చేస్తామని ప్రకటించింది పేద కుటుంబాలకు పిఎం సూర్య ఘర్ ముఫ్తి బిజ్లీ యోజన క్రింద ఉచిత విద్యుత్ కూడా అందిస్తామని తెలిపింది.

కాంగ్రెస్ పార్టీలో కొందరు తమను తాము మేధావులు అనుకునేవారు ప్రజలను భ్రమింపచేసేందుకు అందమైన పదాలతో వాగ్దానాలను రూపొందించి మేనిఫెస్టోలో చేరుస్తారు. బీజేపీలో అలా జరగదు. బీజేపీ తన మేనిఫెస్టో కోసం ప్రజలనుంచి సూచనలు కోరింది. దాదాపు 11 లక్షల మంది ప్రజలు తమ సూచనలు చేశారు. 4 లక్షల మంది నమో ఆప్ ద్వారా తమ ఆలోచనలను పంచుకున్నారు. వీటన్నిటినీ దాదాపు 50 మందికి పైగా బీజేపీ కేంద్ర మంత్రులు, పార్టీ నేతలు రెండు నెలల పాటు క్రోడీకరించి సంకల్ప్ పత్రాన్ని రూపొందించారు. అందుకే బీజేపీ సంకల్పం అంటే ప్రజల సంకల్పం. మోదీ గ్యారంటీ అంటే జనం ఆత్మవిశ్వాసం.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

దక్షిణాదికి పొంచి ఉన్న ప్రమాదం!

దేశంలోని ఉత్తర–దక్షిణ తేడాలు అందరికీ తెలిసినవే. భాష, సంస్కృతుల్లో ఇవి కొట్టొచ్చినట్లు కనపడతాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడి రాకపోకలు పెరిగిన తర్వాత అవి ఇంకా బాగా తెలిసొచ్చాయి. ఈ తేడాలు ఆధారంగానే ద్రవిడవాదం తలెత్తింది. భాషల తులనాత్మక పరిశీలనను దేశ చరిత్రలో కీలక ఘట్టంగా చెప్పుకోవాలి. ఉత్తర, దక్షిణ భాషల విభిన్నత అప్పుడే బాగా తెలిసింది. ఈ రెండిటి పుట్టుక వేరనీ అప్పుడే స్పష్టమైంది. సంప్రదాయ పండితుల ఆలోచనలు వీటికి పూర్తి విరుద్ధంగా ఉండేవి. భాషలన్నీ సంస్కృతం నుంచే వచ్చాయని గట్టిగా నమ్మేవారు. సంస్కృత సంప్రదాయాలు, ఆలోచనల ప్రభావం శతాబ్దాల పాటు బలంగా కొనసాగింది. అందుకే దక్షిణాది భాషలకు సొంత మూలాలు ఉన్నాయన్న భావన సంప్రదాయ పండితులకు తట్టలేదు. తట్టినా సంస్కృతాన్ని దైవభాషగా భావించటం వల్ల దాన్ని పట్టించుకోలేదు.

భాషల పరిశీలన వల్ల మరో సంగతి వెల్లడైంది. సంస్కృతానికి కొన్ని యూరోపు భాషలకున్న బంధం బయటపడింది. ఆ బంధం ఇతర విషయాల పరిశోధనకు దారి తీసింది. ఆర్యుల స్థానికత గుట్టును తెలిపింది. వారి వలసల చరిత్ర వెలుగులోకి వచ్చింది.. భారత్‌కు వారెప్పుడు తరలి వచ్చారో స్థూలంగా వెల్లడైంది. ఇవన్నీ ఇప్పుడు అందరికీ తెలిసిన సాధారణ విషయాలు. కానీ ఆర్యులరాక ఒకప్పుడు ఎన్నో సంచలనాలకు కారణమైంది. 100–150 ఏళ్ల క్రితం అది సృష్టించిన ప్రభావం ప్రగాఢమైంది. చరిత్ర పరిశోధనలో తేలిన ప్రతి ఘట్టాన్నీ సమకాలీన అవసరాల కోసం వాడుకోవటం అన్నిచోట్లా జరిగింది. దక్షిణాదిన పలురంగాల్లో ఆనాడు నెలకొన్న బ్రాహ్మణ ఆధిక్యతపై ఆగ్రహంగా ఉన్న వర్గాలకు ఆర్యవలస సిద్ధాంతం అలాగే ఉపకరించింది. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సమర్థించటానికి కావాల్సిన సిద్ధాంతాలు సంస్కృతంలో పుష్కలంగా ఉన్నాయి. దాన్ని వ్యతిరేకించే వర్గాలకు బలమైన సిద్ధాంతం ఒకటి కావాలి. ఎక్కడ నుంచో వచ్చిన ఆర్యులు ఉత్తరాదిలో ఒకనాడు ఉండే ద్రవిడులను తరిమేశారనే సిద్ధాంతం అట్లా బ్రాహ్మణ ఆధిక్యతను ఎదుర్కొనే సాధనంగా పరిణమించింది. ఆ తర్వాత ద్రవిడ దృక్కోణం నుంచి చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి. మూలవాసులనూ, ద్రవిడులనూ, వాళ్ల సంస్కృతులనూ, భాషలనూ ఆర్యులు అణచివేశారనే భావనే ఇందులో ప్రధానమైంది. ఈ అణచివేతల్లో నిజనిజాలెంత ఉన్నా ఒకటి మాత్రం చారిత్రక వాస్తవం. ఆర్యుల వలసలపై చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉంది. హిందూత్వవాదులు మాత్రం దీన్ని అంగీకరించరు. విదేశీగడ్డ నుంచి వచ్చిన వారివల్లే వేద సమాజం ఏర్పడిందని అంగీకరిస్తే హిందూమత స్వదేశీయతకు అర్థం లేకుండా పోతుంది. ఆర్యుల వలసలపై అంగీకారమున్నా ద్రవిడులను దక్షిణాదికి నెట్టివేశారనే ప్రతిపాదనను చరిత్రకారులు ఇప్పుడు అంగీకరించటం లేదు. ఆర్య–ద్రవిడ వైషమ్య దృష్టి నుంచి గతాన్ని చూడటమూ తగ్గిపోయింది. కానీ వందేళ్ల కిందట ఈ దృష్టితోనే దక్షిణాదిలో ఆత్మగౌరవ ఉద్యమాలు ఊపిరులు పోసుకున్నాయి. జ్యోతిరావు ఫూలే, రామస్వామి నాయకర్ సిద్ధాంతాలు అలా మొగ్గతొడిగినవే.

వీటిని కాసేపు పక్కనపెట్టి సమకాలీన చిత్రాన్ని చూద్దాం. ఒకనాటి ఆర్య–ద్రవిడ వివాదంతో సంబంధం లేకుండా ఉత్తరాది–దక్షిణాది మధ్య ఇప్పుడు కొత్త విభజనలు పొడచూపుతున్నాయా? అని ప్రశ్నించుకుంటే అవుననే జవాబు చెప్పాలి. అభివృద్ధిపరంగా రాష్ట్రాల మధ్యన తలెత్తిన వ్యత్యాసాలు, కేంద్ర ప్రభుత్వం చేతిలో విపరీత అధికారాల కేంద్రీకరణ, ఉత్తరాదిని దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న విధానాలను దక్షిణాదిపై బలవంతంగా రుద్దటం, దక్షిణాది నుంచి ఉత్తరాదికి భారీగా ఆదాయం తరలి వెళ్లటం, లోక్‌సభలో దక్షిణాది సీట్లు తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉండటం లాంటి అంశాలు ప్రధానంగా వీటికి దోహదం చేస్తున్నాయి. 'సౌత్ వర్సస్ నార్త్: ఇండియాస్ గ్రేట్ డివైడ్' పేరుతో ఆర్.ఎస్. నీలకంఠన్ రాసిన పుస్తకం కూడా అదే కోవలోదే.



అమృతకాలంలో కచ్చితంగా జరగాల్సింది నిజమైన వికేంద్రీకరణ. జరుగుతున్నది మాత్రం పక్కా కేంద్రీకరణ. పన్నుల విధింపు అధికారం కేంద్ర ప్రభుత్వ అధికారానికి ఆయువుపట్టు. జీఎస్టీతో ఆ పట్టు మరింతగా పెరిగింది. రాష్ట్రాలకు సొంత వనరులను గణనీయంగా సమీకరించుకునే అధికారమే అసలైన సమాఖ్య అస్తిత్వానికి నిదర్శనం. అధికార కేంద్రీకరణ ఆగకపోతే ప్రస్తుతం ఉత్తరాది–దక్షిణాది మధ్య రేగుతున్న వివాదాలు మరోచోటా కనపడొచ్చు!

విద్య, ఆరోగ్యాల్లో దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదితో పోల్చితే పురోగతిని సాధించాయి. ఈ ప్రగతి జనాభా పెరుగుదలను బాగా ప్రభావితం చేసింది. చదువుకున్న మహిళలకు పుట్టే పిల్లల సంఖ్య తక్కువ. కుటుంబ నియంత్రణ పాటింపు ఎక్కువ. సంతాన సాఫల్య రేటూ బాగా తగ్గింది. మరణాల రేటు దిగువకు జననాల రేటు పడిపోతోంది. వృద్ధుల సంఖ్య దక్షిణాదిన పెరుగుతోంది. శిశు మరణాల్లో దక్షిణాది–ఉత్తరాది మధ్య తేడాలు బాగా పెరిగాయి. కాన్పు సమయంలో మరణించే తల్లుల సంఖ్యలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆరోగ్యానికి సంబంధించిన ఏ సూచీలోనైనా ఉత్తరాదిన వెనుకబాటే కన్పిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్య, డాక్టర్ల అందుబాటు, టీకాల కార్యక్రమం, అంగన్‌వాడీల్లో సౌకర్యాలు.. ఇలా దేన్ని పరిగణనలోకి తీసుకున్నా ఇదే పరిస్థితి. వీటిని పరిగణించకుండా ఉత్తరాదిని దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఆరోగ్యరంగంపై విధానాలను రూపొందిస్తోంది. నేషనల్ హెల్త్ మిషన్‌లో నిర్దేశించిన లక్ష్యాల్లో చాలా వాటిని దక్షిణాది రాష్ట్రాలు ఎప్పుడో దాటేశాయి. కేరళ, తమిళనాడులు సొంత విధానాలతో ఆరోగ్యరంగంలో సాధించిన ప్రగతిని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ప్రోత్సహించాల్సిన కేంద్రం చాలా విషయాలను ఏకపక్షంగా తన చేతుల్లోకి తీసుకుంటోంది. విద్య, వైద్యం అనేవి రాష్ట్ర ప్రభుత్వాలు చూడాల్సిన విషయాలు. స్థానిక అవసరాలకు అనుగుణంగా వైద్యులను తయారుచేసుకునే బాధ్యత కూడా రాష్ట్రాలపైనే ఉంటుంది. నీట్ లాంటి పరీక్షల వల్ల రాష్ట్రాలు అయిష్టంగా వైద్య సీట్లను వదులుకోవాల్సి వస్తోంది. వైద్యరంగంలోనే గాక ఇతర వాటిల్లోనూ దేశమంతటికి ఏకరీతిగా వర్తింపచేసే విధానాల వల్ల చెడే ఎక్కువ జరుగుతోందని నీలకంఠన్ గణాంకాల ఆధారంగా వివరించారు.



■ రాహుల్ కుమార్

ఉన్నత విద్యలోకి యువతీయువకులు ప్రవేశించటంలో కూడా ఉత్తర–దక్షిణాల మధ్య తేడా ఉంది. జాతీయ సగటు 26 శాతాన్ని మించి తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు ముందుకు వెళుతున్నాయి. ఆ సగటుకు ఉత్తరాది రాష్ట్రాలు ఇంకా దూరంగానే ఉన్నాయి. పాఠశాల స్థాయిల్లో చదువుమానే పిల్లలు ఉత్తరాదిలో ఎక్కువ. ఇలాంటి విభిన్న పరిస్థితులను అన్ని స్థాయిల్లోనూ కనపడతాయి. వీటిని పట్టించుకోకుండా జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్త అర్హత పరీక్షలు, బోధనా మాధ్యమంపై ఆదేశికాలు వెలువడుతున్నాయి. ఏదో రూపంలో హిందీని తప్పనిసరిగా నేర్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి. అనేక కారణాల వల్ల దక్షిణాదిన ఇంగ్లిషు బోధనా మాధ్యమం బాగా ప్రాచుర్యం పొందింది. ఆ మాధ్యమంలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న పిల్లల సంఖ్య దక్షిణాదిలో గణనీయంగా పెరుగుతోంది. కర్ణాటకలో 53శాతం, తమిళనాడులో 91శాతం, కేరళలో 81శాతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 80 శాతం పిల్లలు ఇలా చదువుతున్నవారే ఉన్నారు.

వ్యవసాయం నుంచి వస్తుతయారీ, సేవల రంగంలోకి అడుగు పెట్టటంలో కూడా దక్షిణాదిలో వేగం పుంజుకుంటోంది. గ్రామీణ కుటుంబాల్లో సైతం వ్యవసాయం మీద ఆధారపడటం తగ్గుతోంది. కర్ణాటకలో గ్రామీణ ప్రాంతంలో 55శాతం, తెలంగాణలో 52శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 42శాతం, తమిళనాడులో 35శాతం, కేరళలో 27శాతం కుటుంబాలు గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడగా.. రాజస్థాన్‌లో 78శాతం, యూపీలో 75 శాతం, మధ్యప్రదేశ్‌లో 71శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 68శాతం కుటుంబాలు దానిపై జీవిస్తున్నాయి.

ఇక పట్టణాల్లో జీవించే వారి సంఖ్య కూడా దక్షిణాదిలో బాగా పెరుగుతోంది. తమిళనాడులో 48శాతం, కేరళలో 48శాతం, కర్ణాటకలో 39శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 33శాతం (2011 జనాభా లెక్కల ప్రకారం) మంది పట్టణాల్లో జీవిస్తున్నారు. మహారాష్ట్ర, గుజరాత్‌లు మాత్రమే తమిళనాడు, కేరళకు దగ్గర్లో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో 22శాతం, బిహార్‌లో 11శాతం, రాజస్థాన్‌లో 25శాతం మధ్యప్రదేశ్‌లో 28శాతం, హిమాచల్‌లో 10శాతం మంది మాత్రమే పట్టణాల్లో జీవిస్తున్నారు. మహిళా శ్రామికుల వాటా కూడా దక్షిణాదిన ఎక్కువ.

1971 నుంచి 2011 వరకూ జనాభా లెక్కలను తీసుకుంటే ఉత్తరాది–దక్షిణాదిల మధ్య పెరుగుదలల్లో తేడాలు స్పష్టంగా కనపడతాయి. నాలుగు దశాబ్దాల్లో రాజస్థాన్‌లో జనాభా 166 శాతం పెరిగింది. అది కేరళలో 56 శాతం మాత్రమే. బిహార్‌లో 146శాతం పెరిగితే తమిళనాడులో అది 75 శాతమే. జనాభాను తగ్గించుకున్న రాష్ట్రాలకు ఏదోవిధంగా కేంద్రం నుంచి వచ్చే ఆదాయంలో గండి పడటం, 2026లో చేపట్టనున్న నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో లోక్‌సభ సీట్లు తగ్గే ప్రమాదం పొంచి ఉండటం.. దక్షిణాది ముందు ప్రస్తుతం పెనుసవాళ్లుగా మారాయి. దక్షిణాది నుంచి పన్నుల రూపంలో తీసుకునేది ఎంత? ఇచ్చేది ఎంత? అనే ప్రశ్నలు అయిదారేళ్లుగా గట్టిగానే వినిపిస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ నేతలు వందలసార్లు గణాంకాల ఆధారంగా ఈ విషయంపై విమర్శలు గుప్పించారు. తమిళనాడులోనూ అదే జరుగుతోంది.

ఒక ఓటుకు ఒక విలువ అన్నది ప్రజాస్వామ్యంలో కీలకం. మనకు 15లక్షల ఓటర్లు ఉన్న నియోజకవర్గాలూ ఉన్నాయి. 30 లక్షల ఓటర్లున్నవీ ఉన్నాయి. దీంతో ఒక ఓటుకు ఒకే విలువ అనేదానికి అర్థం లేకుండా పోతుంది. కొత్తగా చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అనివార్యం. దాన్ని ఆపలేం. లోక్‌సభ సీట్లు తగ్గితే బలహీనమయ్యే పరిస్థితి దక్షిణాదికి రాకుండా ఉండాలంటే కేంద్రం చేతిలోని అధికారాలను గణనీయంగా తగ్గించటమే మార్గం. రాష్ట్రాలకు కీలక అధికారాలు బదలాయింపు జరిగితే లోక్‌సభలో సీట్ల పెంపు సమస్య కాకపోవచ్చు. అంబేడ్కర్ సూచించినట్టు రాజ్యసభలో చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉంటే లోక్‌సభలోని సంఖ్యాధిక్యత సృష్టించే విపరిణామాలను కొంతైనా ఆపే అవకాశం ఉంటుంది. అమెరికా సెనెట్ చాలా వరకూ ఆ పనిని చేసిందని కూడా అంబేడ్కర్ చెప్పారు. అమృతకాలంలో కచ్చితంగా జరగాల్సింది నిజమైన వికేంద్రీకరణ. జరుగుతుంది మాత్రం పక్కా కేంద్రీకరణ. పన్నుల విధింపు అధికారం కేంద్ర ప్రభుత్వ అధికారానికి ఆయువుపట్టు. జీఎస్టీతో ఆ పట్టు మరింతగా పెరిగింది. రాష్ట్రాలకు సొంత వనరులను గణనీయంగా సమీకరించుకునే అధికారమే అసలైన సమాఖ్య అస్తిత్వానికి నిదర్శనం. అధికార కేంద్రీకరణ ఆగకపోతే ప్రస్తుతం ఉత్తరాది–దక్షిణాది మధ్య రేగుతున్న వివాదాలు మరోచోటా కనపడొచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

రామాలయ పునరుద్ధరణ కథలో 'రెండవ రామదాసు'

అది 1961. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి. ఆయన మంత్రివర్గంలో కల్లూరి చంద్రమౌళి దేవాదాయ శాఖ మంత్రి. బ్రహ్మానందరెడ్డి గారి క్యాబినెట్‌లో రెండు గ్రూపులు ఉండేవి. ఒక దానికి నీలం సంజీవరెడ్డి నాయకత్వం వహిస్తే, రెండవ గ్రూపునకు దామోదరం సంజీవయ్య నాయకత్వం వహించేవారు.

హైదరాబాద్ స్థాయిలో నీలం సంజీవరెడ్డి గ్రూపునకు అల్లూరి సత్యనారాయణ నాయకత్వం వహించేవారు. కల్లూరి చంద్రమౌళి సంజీవయ్య గ్రూపులో ఉండేవారు. ఆయన 1961లో దేవాదాయ శాఖ మంత్రిగా భద్రాచలం వచ్చారు. అప్పటి భక్త రామదాసు 265 ఏళ్ల కింద కట్టిన దేవాలయం శిథిలావస్థలో ఉన్నది. భద్రాచల పురప్రముఖులు, భక్తులు ఆయనను కలసి, ఆలయ పునరుద్ధరణ చేపట్టమని ప్రార్థించారు.

దేవాలయంలో నిధులు లేవు. ఆదాయం కూడా తక్కువ. రాముడు శాంతమూర్తి. వేంకటేశ్వరస్వామికి భయపడినట్టు భక్తులు రాముడికి భయపడరు. తిరుపతి హుండీలో నోట్ల కట్టలు పడితే, భద్రాచలం హుండీలో చిల్లర డబ్బులు పడతాయి. దేవాలయ నిర్మాణం చేయాలంటే చాలా ధనం కావాలి. ప్రభుత్వ ధనం ఖర్చు చేయడానికి వీలులేదు. కాని, భద్రాచల రామాలయ పునర్నిర్మాణం కోసం కల్లూరి చంద్రమౌళి ఒక దృఢ సంకల్పం తీసుకున్నారు. వెంటనే కార్యాచరణకు నడుం బిగించారు.

ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ రామభక్తులు. తమ ఆరాధ్య దైవం రామునికి ఆలయం పునర్నిర్మించుకోలేరా? చంద్రమౌళి ఒక మంత్రిగా కాక, ఒక రామభక్తునిగా ప్రతి ఊరు, ప్రతి పట్టణం, ప్రతి దేవాలయానికీ తిరిగి, రామాలయ పునరుద్ధరణకు, విరాళాలు వసూలు చేయసాగారు. మీరు వింటే ఆశ్చర్యపోతారు. 1962లో భద్రాచల రామాలయ పునరుద్ధరణకు, ఆంధ్రదేశ ప్రజలు, దేవాలయాలు 22 లక్షల రూపాయల విరాళాలను వితరణగా సమర్పించారు. అంటే ఇప్పటి లెక్కలో 100 కోట్ల రూపాయలు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు భద్రాచల రాముడంటే అంత భక్తి!

మరి దేవాలయం తిరిగి కట్టాలి కదా! అది ఆషామాషీ విషయం కాదు. మంత్రి గారు చాలా మంది పండితులతో ఆలోచనలు చేశారు. వారంతా చెప్పిందేమిటంటే మీరు ఆగమ శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటుచేసి, దేవాలయం ఏ విధంగా కడితే బాగుంటుంది, గర్భాలయ కొలతలెంత, అర్ధ మంటపము, మహామంటపములు ఎంత ఉండాలి, దేవాలయ గోపురం ఎంత ఉండాలి, వగైరాలు నిర్ధారణ చెయ్యాల్సి ఉంటుంది అని సలహా ఇచ్చారు. ఆ విధంగా చంద్రమౌళి మంత్రి హోదాలో విజయవాడ కనకదుర్గ ఆలయంలో ఆగమ పండితులతో సమావేశమయ్యారు. భద్రాచల రాముడు స్వయంభూ. విగ్రహాన్ని కదిలించడానికి వీలులేదు. రోజూ జరిగే నిత్య పూజలు, అభిషేకాలు నైవేద్యాలకు ఆటంకం కలగడానికి వీలులేదు. అందుకని దేవుని విగ్రహాల చుట్టూ టెంపరరీగా షెల్టరు కట్టి, రోజువారి కార్యక్రమాలను ఆచరించాలి.

భద్రాచల రాముడి మూలవిరాట్టు ఎత్తు రెండు అడుగుల ఒక అంగుళం. కావున గర్భాలయ లోపలి కొలతలు విగ్రహానికి నాల్గింతలు అంటే ఎనిమిది అడుగుల నాలుగు అంగుళాలు ఉండాలి. ఇది ఆగమశాస్త్రంలో నిర్దేశించబడిన నిబద్ధత.

దేవాలయం మొత్తం నిర్మాణం రాతి శిలలతో, శిల్పులతో చోళ సంప్రదాయంలో నిర్మించాలి. అప్పటికే కంచిపుర వాస్తవ్యుడైన గణపతి స్థపతిని పిలిపించి దేవాలయ స్థపతిగా నియమించారు. దేవాలయ కట్టడానికి ముందు పాత దేవాలయాన్ని పడగొట్టాలి కదా. రామదాసు కట్టిన దేవాలయ కొలతలు రికార్డులో నిక్షిప్తపరచడానికి అప్పటి ప్రభుత్వ ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఒక ముస్లిం సూపర్‌వైజరును దేవాలయానికి పిలిపించారు. అయితే ఆయనను అర్చకులు గర్భగుడిలోకి రానీయలేదు. దాంతో ఆయన టేపు ఇచ్చి అర్చకులనే కొలతలు చెప్పమన్నారు. ఇక్కడ చెప్పాల్సిన విషయం ఏమిటంటే టేపు రింగు ఒక అంగుళం ఉంటుంది. ఇది అర్చకులకు తెలియదు. రింగులో వేలు దూర్చి, రామదాసు కట్టిన గర్భాలయం కొలతలు ఏడు అడుగుల పదకొండున్నర అంగుళాలుగా చెప్పారు. ఆ ముస్లిం సూపర్‌వైజరు ఆ కొలతలనే నోటు పుస్తకంలో నోట్ చేసుకున్నారు. తర్వాత శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామ విగ్రహాలు చుట్టూ ఇనుప రేకులతో షెడ్డు ఏర్పాటు చేసి దేవాలయాన్ని కూలగొట్టారు. ఆ ముస్లిం సూపర్‌వైజర్ నోట్ చేసిన కొలత తప్ప భక్త రామదాసు కట్టిన గుడి కొలతలు ఎక్కడా లేవు.

ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరూ రామభక్తులు. తమ ఆరాధ్యదైవం రామునికి ఆలయం పునర్నిర్మించుకోలేరా? కల్లూరి చంద్రమౌళి ఒక మంత్రిగా కాక, ఒక రామభక్తునిగా ప్రతి ఊరు, ప్రతి పట్టణం తిరిగి, రామాలయ పునరుద్ధరణకు, విరాళాలు వసూలు చేయసాగారు. 1962లో భద్రాచల రామాలయ పునరుద్ధరణకు, ఆంధ్రదేశ ప్రజలు, దేవాలయాలు 22 లక్షల రూపాయలు విరాళాలను వితరణగా సమర్పించారు. అంటే ఇప్పటి లెక్కలో 100 కోట్ల రూపాయలు.



భద్రాచలంలో గోదావరి ఒడ్డున శిల్పినగరు ఏర్పాటు చేసి 400 మంది శిల్పులకు షెడ్లు వేయించి, దేవాలయం నిర్మాణం ప్రారంభించారు. పర్ణశాల వద్ద ఉన్న బండిరేవు క్వారీని దేవాలయ నిర్మాణానికి ఉపయోగించే శిలలుగా సెలక్టు చేసి, శిల్పినగరులో శిల్పులు, గణపతి స్థపతి ఆధ్వర్యంలో పని ప్రారంభించారు. సంవత్సరం గడిచిపోయింది. దాదాపు నాలుగు లక్షల వరకు వ్యయమైంది. శిల్పులు, వాళ్లు తయారుచేసిన కుడ్యపు శిలలను భద్రగిరి మీదకు తరలించి గుడి కట్టడం మొదలుపెట్టారు.

ఇక్కడ హైదరాబాద్‌లో వేడి మొదలైంది. సంజీవయ్య వర్గీయుడైన చంద్రమౌళికి పేరు రావడం బ్రహ్మానందరెడ్డి వర్గీయులకు కంటగింపు అయింది. వారు వెంటనే ఒక మీటింగు పెట్టి, బ్రాహ్మణ కులస్థుడైన నీలంరాజు వెంకట శేషయ్య, భాట్టం శ్రీరామమూర్తి, ముక్కు శర్మ ఇంకా కొంతమందిని సంప్రదించి, మీ కులస్థుడైన భక్త రామదాసు కట్టించిన రామాలయాన్ని, ఒక శూద్ర కులస్థుడైన (కమ్మ) చంద్రమౌళి కూలగొట్టి మళ్లీ కట్టడమేంటి, మీరందరూ ఏం చేస్తున్నారని ఎగదోశారు. ఇది రాజకీయ ఎత్తుగడ. బ్రాహ్మణ కులస్థులైన కొంతమంది పెద్దలు భద్రాచలం వచ్చి మీటింగులు పెట్టుకుని, ఏదైనా తప్పు దొరుకుతుందా అని ఎంక్వయిరీ చేయసాగారు. అప్పుడు వారికి ఎవరో గిట్టనివారొచ్చి, రామదాసు కట్టిన గుడి కొలతలు మార్చి చంద్రమౌళి సొంత కొలతలతో గుడి కడుతున్నారని, గర్భాలయ కొలత (7'-11 1/2") బదులు (8'-4") పెట్టి కొలతలు మార్చేశాడని ఏగదోశారు. నిప్పు రాజుకుంది.

మరునాడు పేపర్లలో భద్రాచల రామాలయ గర్భాలయ కొలతలు మార్చి కడుతున్నారని, భద్రాచలం నుంచి రాముడు వెళ్లిపోయాడని, గుడి అపవిత్రమవుతున్నదని పెద్ద హెడ్డింగులతో ప్రచురించారు. భద్రాచలంలోని కమర్షియల్ టాక్స్‌లో పనిచేస్తున్న ఒక బ్రాహ్మణునితో శిబిరం వేయించి, నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆంధ్రదేశమంతా అట్టుడికిపోయింది. సత్యాగ్రహ శిబిరానికి నలుమూలల నుంచి భక్తులు వచ్చి సత్యాగ్రహంలో పాల్గొనసాగారు. అగ్గి రాజుకుంది. మంటలు రాజధాని హైదరాబాద్ వరకు పాకాయి. ఒక వర్గం వారు అనుకున్న కార్యక్రమం నెరవేరింది.

వెంటనే ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, చంద్రమౌళిని ఆఫీసుకు పిలిపించుకుని 'ఏమిటీ గందరగోళం, ఈ గొడవ ఢిల్లీ వరకు పోయేట్టున్నది. దీనికి వివరణ కావాలి' అని కోరారు. దానికి చంద్రమౌళి 'అయ్యా ముఖ్యమంత్రిగారు, శిథిలావస్థలో ఉన్న భద్రాచల రామాలయాన్ని పునర్నిర్మించడానికి నేను ప్రభుత్వం మీద భారం పడకుండా భక్తుల విరాళాలతో పని ప్రారంభించాను. ఇందుకు ఆగమ శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటుచేసి, శాస్త్ర ప్రకారం నిర్దేశించిన విధంగా దేవాలయ నిర్మాణం జరుగుతోంది. గణపతి స్థపతి 400 మంది శిల్పులతో నిర్మాణం కొనసాగిస్తున్నారు. మీరు ఏ ఎంక్వయిరీ వేసుకున్నా నేను బద్ధుడనై ఉంటాను' అని సమాధానం చెప్పారు. వెంటనే ముఖ్యమంత్రి 'ఈ విషయాన్ని కంచి పీఠాధిపతికి ప్రభుత్వం తరఫున నివేదిస్తాను. ఆయన నిర్ణయానికి మనం బద్ధులమై ఉందాం' అని ముగించారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తం విషయం మీద కంచి పీఠాధిపతికి ఒక సమగ్ర నివేదికను పంపింది. అప్పటికే బ్రాహ్మణ శ్రేష్ఠులందరూ కంచికి చేరుకున్నారు. అప్పుడు కంచి పీఠాధిపతి చంద్రశేఖర స్వామివారు. ఆయన శాస్త్రాలన్నీ పరిశీలించారు. ఆగమ శాస్త్ర ప్రకారం మూలవిరాట్టు ఎత్తుకు నాలుగు రెట్లు అంటే 8'-4" కట్టడం శాస్త్ర సమ్మతం. కాని రామదాసు గారు కట్టిన ఆలయం 7'-11 1/2" కొలతలు అంటున్నారు. ఆయన బాగా ఆలోచించి తన జడ్జిమెంటు ఇచ్చారు. 'భద్రాచల రామాలయం ఇప్పుడు కడుతున్న కొలతల ప్రకారం (8'-4") ఆగమ శాస్త్ర ప్రకారం శాస్త్ర సమ్మతమే. కాని భక్త రామదాసు గారు పెట్టిన కొలతల ప్రకారం కడితే బాగుండేది'. కంచి స్వామివారి ఈ నిర్ణయం కల్లూరి చంద్రమౌళికి శరాఘాతంలా తగిలింది. ముఖ్యమంత్రికి పన్నీరు పోసినట్టయింది. వెంటనే చంద్రమౌళి మంత్రి పదవికి రాజీనామా చేసి, హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడ తన పూర్వీకుల ఇంట్లో రాజకీయాలతో తెగతెంపులు చేసుకుని నివసించసాగారు.

కాని ఇక్కడ మనం తెలుసుకోవలసిన విషయం ఒకటి ఉంది. రామదాసు గారు ఆగమశాస్త్ర నిబద్ధతతకు వ్యతిరేకంగా 7'-11 1/2" ప్రకారం దేవాలయం ఎందుకు కట్టారు? అదే వివరిస్తాను. రామదాసు కూడా దేవాలయాన్ని 8'-4" కొలతలతోనే కట్టారు. కాలక్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చిన మార్వాడీ భక్తులు, గర్భాలయంలో గోడలకు గ్లేజ్‌డ్ టైల్సు తమ సొంత ఖర్చుతోవేయించారు. అందువల్ల లోపలి కొలతలు తగ్గిపోయాయి. అంతేకాక అర్చకులు టేపులో రింగును 1" కింద లెక్కలోకి తీసుకోలేదు. ఈ వివాదం వల్ల ఒక నిబద్ధత గల రాజకీయవేత్త భక్త రామదాసుగారిలా పదవిని, ప్రతిష్ఠను కోల్పోవలసి వచ్చింది.

నేను భద్రాచలంలో సైటు ఇంజనీరుగా జాయిన్ అయిన సంవత్సరం తర్వాత, హైదరాబాద్‌లో పీవీ నర్సింహారావుగారి చాంబరులో సెక్రటేరియట్‌లో మీటింగు జరిగింది. అప్పుడు పీవీ గారు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి, కొండా వాసుదేవగారు ఎండోమెంటు కమిషనరు, భద్రాచల ఉద్ధరణ సంఘం అప్పటి కొత్త చైర్మన్ లక్కినేని నర్సయ్యగారితో సహా సభ్యులందరూ హాజరయ్యారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు మాదిరెడ్డి మాధవరావుగారితో సహా నేను కూడా హాజరయ్యాను. దేవాలయ గర్భాలయం 8'-4"తో తయారైంది. దాని లోపల మార్బుల్ స్టోన్సు తెప్పించి 7'-11 1/2" కొలతలకు లోపల అతికిస్తే సమస్య తీరిపోతుంది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు రాజస్థాన్ మక్రానా నుంచి తెల్లని శ్రేష్ఠమైన మార్బుల్ పలకలు తెప్పించి గర్భాలయంలో 7'-11 1/2" కొలతలకు సరిపడా నేను దగ్గరుండి అతికించాను. ఆ విధంగా ఆ వివాదాన్ని అధిగమించాం.

■ కొప్పుల ప్రకాశం

(రిటైర్డు ఇంజనీరు, హైదరాబాద్)



కూలర్లకు రిపేర్

రోజురోజుకూ ఎండలు ఎక్కువవుతుండడంతో వడగాలుల తీవ్రత పెరిగింది. దీంతో సికింద్రాబాద్‌లోని ఓ కూలర్ల రిపేర్ షాపు ఇలా కస్టమర్లతో కిటకిటలాడుతోంది.

మండే @ 41.5

నగరంలో భగ.. భగలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : భానుడు మళ్లీ భగ్గుమంటున్నాడు. రెండురోజులుగా కొంతమేర తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు సోమవారం పెరిగాయి. దీంతో గ్రేటర్‌వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సోమవారం మూసాపేట బాలాజీనగర్‌లో 41.5, షేక్‌పేటలో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పుల తీవ్రత పెరగడంతో ప్రజలు బయట తిరిగేందుకు ఇబ్బందులు పడ్డారు. గ్రేటర్‌తో పాటు పలు జిల్లాల్లో మరో రెండురోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలుంటాయని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

పలు ప్రాంతాల్లో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

- న్యూ మెట్టుగూడ-41.3
- హెచ్‌సీయూ- 41.3
- యాకుత్‌పురా- 41.3
- ముషీరాబాద్-41.3
- చార్మినార్- 41.1
- అల్వాల్ అంబేడ్కర్ నగర్-41.1

మధ్యాహ్న వేళల్లో బస్సుల ట్రిప్పులు తగ్గింపు

భానుడి భగ..భగలతో రేపటి నుంచి మధ్యాహ్న సమయంలో బస్సుల ట్రిప్పులు స్వల్పంగా తగ్గిస్తున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ట్రిప్పులు కొంతమేర కుదిస్తున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రత తగ్గే వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రిప్పులను తగ్గించి సాయంత్రం నాలుగు గంటల తర్వాత బస్సులు యథాతథంగా నడుపుతామన్నారు.

నేడు అత్యవసర పంపింగ్ ప్రారంభం

- నగరానికి నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరానికి నీటి తరలింపులో ఇబ్బందులు లేకుండా నాగార్జునసాగర్‌లో మంగళవారం అత్యవసర పంపింగ్‌ను ప్రారంభించనున్నారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టాలు 509.100అడుగులకు చేరడంతో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కెనాల్‌లోకి నీళ్లు రావడం లేదు. ప్రస్తుతం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దాదాపు 1.11టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. సాగర్‌లో పంపింగ్ ప్రారంభమయ్యేంత వరకు అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి రోజూ మూడు ఫేజ్‌ల్లో 1,254 మిలియన్ లీటర్ల నీటిని తరలిస్తున్నారు. అయితే, నాగార్జునసాగర్‌లో 510అడుగులకు దిగవకు చేరడంతో వాటర్‌బోర్డు అధికారులు అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా పనులు కొంతవరకు ఆలస్యం కావడంతో సోమవారం ప్రారంభం కావాల్సిన అత్యవసర పంపింగ్ వాయిదా పడింది. మంగళవారం ప్రారంభించే అవకాశమున్నదని అధికారులు చెబుతున్నారు. అత్యవసర పంపింగ్ ద్వారా రోజూ 900క్యూసెక్కుల నీటిని పంప్ చేసే విధంగా పది మోటార్లను సిద్ధం చేశారు. పంపింగ్ ప్రారంభమైతే నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ ద్వారా పుట్టంగండి చానల్ ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ జలాశయంలోకి నీటిని తరలిస్తారు. అక్కడి నుంచి కోదండాపూర్ నీటి శుద్ధి ప్లాంట్‌లో శుద్ధి చేస్తారు. హైదరాబాద్ మహా నగరానికి నిరాటంకంగా కృష్ణాజలాలను మూడు ఫేజ్‌ల్లో పంపింగ్ చేస్తారు.

సమాచారమిస్తే.. తొలగింపు..!



- నిర్మాణ రంగ వ్యర్థాల తరలింపుపై జీహెచ్‌ఎంసీ దృష్టి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగ వ్యర్థాల తరలింపునకు నిర్ణీత మొత్తం చెల్లిస్తే బల్దియా ఆమోదం పొందిన ఏజెన్సీలు వాటిని తీసుకెళ్తాయని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్ www.ghmc.gov.in, మై జీహెచ్‌ఎంసీ యాప్, సర్కిళ్ల వారీగా టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేసినా, వాట్సాప్ నెంబర్లకు వివరాలు పంపి సేవలు పొందవచ్చన్నారు. ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ల పరిధిలో 1800-120-1159, వాట్సాప్ 91009 27073, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో ఉండే వారు 1800-203-0033, వాట్సాప్ 73300 00203 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

24 గంటలపాటు మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా మద్యం విక్రయాలపై నగర కమిషనర్లు నిషేధం విధించారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ ఉదయం 6 గంటల వరకు మద్యం అమ్మకాలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ట్రై కమిషనరేట్ల పరిధిలోని మద్యం దుకాణాలు, కల్లుకాంపౌండ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లలో మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు.

ఎన్నికల పనులపై సందిగ్ధం..!



- 'ఏర్పాట్ల'పై కాంట్రాక్టర్లు వెనుకంజ
- అసెంబ్లీ ఎలక్షన్ల బిల్లులే ఇంకా పెండింగ్
- రూ.15 కోట్లకుపైగా బకాయిలు
- ప్రస్తుతం పనులు చేసేందుకు అనాసక్తి
- టెండర్లు పిలవాలని కమిషనర్ ఆదేశం

గ్రేటర్‌లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణా పనులపై సందిగ్ధత నెలకొంది. పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్(డీఆర్‌సీ) సెంటర్ల వద్ద మౌలిక సదుపాయాల కల్పన గందరగోళంగా మారింది. ఆయా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేసిన పనుల బిల్లులను జీహెచ్‌ఎంసీ ఇప్పటికీ చెల్లించక పోవడం ఇందుకు కారణం. ఎన్నికల సంఘం నుంచి నిధులు విడుదలైనా సర్కిల్ స్థాయిలో చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లపై నీలినీడలు కమ్ముకున్నాయి.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న జరిగే ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలు, డీఆర్‌సీ సెంటర్ల వద్ద ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తాజాగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పెండింగ్ బిల్లుల అంశాన్ని ఇంజనీర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన పనులకు సంబంధించి బిల్లులు ఇంకా చెల్లించలేదని, కొత్తగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

రూ.15 కోట్లు

అసెంబ్లీ ఎన్నికలు గతేడాది నవంబర్ 30వ తేదీన జరిగాయి. ఈ నేపథ్యంలో నగరంలోని పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, ఫర్నిచర్, తాగునీరు, షామియానాలు మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 4 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలతోపాటు, 15 డీఆర్‌సీ సెంటర్ల వద్ద రూ.15 కోట్లతో పనులు చేశారు. మెజార్టీ బిల్లులను ఎన్నికల సంఘం విడుదల చేసినా.. ఆర్‌ఓలు ఎన్నికలకు సంబంధించిన ఇతర పనుల బిల్లుల చెల్లింపునకు మళ్లించినట్టు ఓ ఇంజనీరింగ్ అధికారి చెప్పారు.

ఇష్టారాజ్యంగా...

సాధారణంగా ఎన్నికల నిర్వహణ వ్యయానికి ఆడిట్ ఉండదు. దీనిని

మిగతా 8వ పేజీలో..

కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- రంగారెడ్డిలో 350మంది సిబ్బందిపై చర్యలు
- మేడ్చల్‌లో ఇప్పటివరకు రూ.3.94కోట్లు సీజ్..



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మలక్‌పేట్, కార్వాన్, గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సెక్టోరల్ ఆఫీసర్ తనకు కేటాయించిన 10-12 పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లోని వసతులు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. వాటిపై మంగళవారం సాయంత్రంలోగా నిర్దిష్టమైన నివేదిక సమర్పించాలని సూచించారు. మాక్‌పోల్ విషయంలో జాగ్రత్త వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వహించిన వారిపై కొరడా..

రంగారెడ్డిజిల్లా ప్రతినిధి : ఎన్నికల విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై రంగారెడ్డి కలెక్టర్ కొరడా ఝుళిపించారు. ఈ నెల ఒకటి, రెండు, ఆ తదుపరి 10వ తేదీల్లో నియోజకవర్గాల వారీగా నిర్వహించిన శిక్షణా తరగతులకు గైర్హాజరైన సుమారు 350మంది సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరందరిపైనా క్రమశిక్షణ చర్యలతో

మిగతా 8వ పేజీలో..



కొంపల్లి సమీపంలో మంటల్లో కాలిపోతున్న ప్రైవేట్ ట్రావెల్‌బస్

ప్రైవేట్ ట్రావెల్ బస్ దగ్ధం

ఏసీ లోంచి పొగలు..

- అప్రమత్తమైన డ్రైవర్
- తప్పిన పెను ప్రమాదం, సురక్షితంగా ప్రయాణికులు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):నడుస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపి ప్రయాణికులను దించివేయడంతో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని

మిగతా 8వ పేజీలో..

స్పోర్ట్స్ కారు దహనం కేసు.. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు 8

ఆన్‌లైన్ బెట్టింగ్.. రూ.2.41కోట్లు సీజ్

- ముఠాలపై పోలీసుల దాడులు
- 15 మంది అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఫోన్లు, నగదు.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠాలపై సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఐదు ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలకు చెందిన బెట్టింగ్ ఆర్గనైజర్లు, బుకీలు, పంటర్లు కలిపి మొత్తం 15మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.33.30లక్షలతో పాటు 57 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.2.07కోట్లు కలిపి మొత్తం రూ.2,41,06,767 సీజ్ చేశారు. వారి నుంచి రూ.88.72లక్షల విలువైన వాహనాలు, ఫోన్లు, బైకులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

- దుండిగల్ పరిధి మల్లాపూర్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న లచ్చపాతుల చిన్నబాబు, చెన్నంశెట్టి కరీముల్లాశేఖాద్రి, పనమాటి వెంకటేష్, దొండ రమేష్‌లను శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో వీరు బెట్టింగ్ ఆర్గనైజర్ భీమవరం ప్రాంతానికి చెందిన కల్యాణ్ వద్ద బెట్టింగ్ పెడుతున్నామని తెలిపారు. పంటర్ల నుంచి దాదాపు రూ.10 లక్షల వరకు బెట్టింగ్‌లు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. వీరి నుంచి రూ.2,400నగదు, ఏడు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1,19,175, రెండు ల్యాప్‌టాప్‌లు, 10 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన పొందుర్తి సురేష్ (42) ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ద్వారా పంటర్ల నుంచి బెట్టింగ్‌లు స్వీకరిస్తుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్‌లో 110 మంది పంటర్లతో సుమారు రూ.1.50 కోట్లు బెట్టింగ్ పెట్టించాడు. పక్కా సమాచారమందుకున్న శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు ఇతడి ఇంటిపై దాడిచేసి ఆర్గనైజర్, బుకీ అయిన పొందుర్తి సురేష్‌తో పాటు వికారాబాద్ మధు కాలనీకి చెందిన రామకృష్ణారెడ్డి (30) పంటర్‌ను అరెస్ట్ చేసి రూ.30,07,200, రెండు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 49,92,539, 4 ఫోన్లు, స్కూటీని సీజ్ చేశారు.

- మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్, ఎస్‌ఆర్‌ఎస్ డైమండ్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఏపీలోని నరసరావుపేటకు చెందిన కందుకూరి వీరశంకర్ చారి(42), కడప ప్రొద్దుటూరుకు చెందిన భూమిరెడ్డి రాంప్రసాద్ రెడ్డి(53) క్రికెట్ ప్రధాన బుకీలు. వీరు నల్గొండ హుజూర్‌నగర్‌కు చెందిన పబ్బటి మురళి(40), నరసరావుపేటకు చెందిన ఉపాసరి వంశీకృష్ణ(30)ల సహకారంతో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. బెంగళూరుకు చెందిన రాజేష్‌రెడ్డి, దుబాయ్‌లో ఉంటున్న కడప జిల్లా వాసి జ సురేష్‌రెడ్డి అలియాస్ శంకర్ రెడ్డి, అనంతపూర్‌కు చెందిన నాగార్జునరెడ్డి, నాగర్‌కర్నూల్‌కు చెందిన సిద్దిక్‌లు బుకీలుగా పనిచేస్తున్నారు. వీరందరూ పరారీలో ఉన్నారు. వీరిస్థావరంపై మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి, నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరు ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి రూ.15.40 కోట్ల బెట్టింగ్ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. వీరి నుంచి

మిగతా 8వ పేజీలో..



ధ్వంసమైన కారు ముందుభాగం

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు..

దుండిగల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. మరో ముగ్గురు విద్యార్థులు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ హన్మకొండకు చెందిన అడ్వకేట్ అన్నమనేని అనిల్ కుమారుడు అన్నమనేని మేఘమ్స్(24) బహదూర్‌పల్లిలోని మహేంద్ర యూనివర్సిటీలో బీ టెక్ సెకండ్ ఇయర్. మేఘమ్స్ కారు(టీఎస్11ఈకె9744)ను తీసుకొని స్నేహితుల వద్దకు ఆదివారం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో కారును స్నేహితుడు సాయిమానస్ డ్రైవింగ్ చేస్తుండగా.. మేఘమ్స్, అర్ణవ్, చరణ్‌రెడ్డిలు కలిసి దుండిగల్‌కు బయలుదేరారు. అతివేగంగా వెళ్తున్న కారు నాగులూరు సుందర చైతన్య ఆశ్రమానికి వెళ్లే దారిలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. మేఘమ్స్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిమానస్, అర్ణవ్, చరణ్‌రెడ్డిలకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. వీరిలో అర్ణవ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అన్నమనేని అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో దారి దోపిడీలు

నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో దోపిడీదొంగలు రెచ్చిపోయారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం వివిధ పనుల మీద బయటకు వెళ్లి ఇంటికి వస్తున్న వారిని బెదిరించి రూ.39వేలు, ఆభరణాలు దోచుకున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధుల్లో కేసులు దర్యాప్తులో ఉన్నాయి. 8



ఇందిరానగర్ నుంచి కేబీఆర్ పార్క్ ప్రధాన రహదారికి లింక్ రోడ్డు నిర్మాణం

8 లింక్ రోడ్లు

రెండు నెలల్లో అందుబాటులోకి

- ఇందిరానగర్ టు కేబీఆర్ పార్క్..
- రోడ్ నంబర్ 10 నుంచి 12కు అనుసంధానం
- 12.88 కి.మీ.లు.. రూ.137.85 కోట్లు
- దూరాభారం తగ్గే అవకాశం

- పూర్తయిన లింక్ రోడ్లు- 30
- కిలోమీటర్లు - 35.33
- నిర్మాణ వ్యయం - రూ.453.72

- యూసుఫ్‌గూడ ఇందిరానగర్ చౌరస్తా నుంచి కేబీఆర్ పార్క్ ప్రధాన రహదారి వరకు 400 మీటర్ల లింక్ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ప్రస్తుతం యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, అమీర్‌పేట, బోరబండ, రహ్మత్‌నగర్ ప్రాంతాల నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ -5, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మీదుగా కేబీఆర్ పార్క్, బసవతారకం ఆస్పత్రి వైపు వచ్చే వారు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ సమీపంలో నేరుగా కేబీఆర్ పార్క్ మెయిన్ రోడ్డుకు చేరుకోవచ్చు.
- రోడ్ నంబర్ -10 నుంచి బీఆర్ఎస్ భవన్, రోడ్ నంబర్-12 వరకు 530 మీటర్ల రహదారి నిర్మాణంతో మహరాజ్ అగ్రసేన్ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌జామ్ కొంత మేర తగ్గనుంది. ప్రస్తుతం ఆ చౌరస్తాను మూసి బసవతారకం ఆస్పత్రి వైపు ఏర్పాటుచేసిన యూ టర్న్ కూడా తొలగించే అవకాశముంది.

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో లింక్ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఒకటి, రెండు నెలల్లో వీటిని అందుబాటులోకి తీసుకువస్తామని హైదరాబాద్ రోడ్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌ఆర్‌డీసీఎల్) వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన రహదారులపై ఒత్తిడి.. వాహనదారులకు దూరాభారం తగ్గేలా పలు ప్రాంతాల్లో లింక్, మిస్సింగ్ రోడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికే 30 రహదారులు అందుబాటులోకి రాగా.. మరో ఎనిమిది చోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, మాదాపూర్, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, అత్తాపూర్, నిజాంపేట, కేపీహెచ్‌బీ, జగద్గిరిగుట్ట, నెక్నాంపూర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రూ.452 కోట్లతో 35 కిలోమీటర్ల మేర ఈ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. బంజారాహిల్స్, నార్సింగి, గోల్నాక, చందానగర్ తదితర ప్రాంతాల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటికే ఉన్న రహదారులను విస్తరిస్తూ అక్కడక్కడా మిస్సింగ్ లింక్‌లు కలుపుతున్నారు. ఈ పనులకు సంబంధించి

మిగతా 8వ పేజీలో..

భర్త వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య

జవహర్‌నగర్, ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్, శివాజీనగర్ కాలనీలో తరుణ్ భార్య ప్రణీత(25) కూతురు మితాన్వి(4)తో కలిసి ఉంటున్నాడు. క్యాబ్‌డ్రైవర్‌గా పని చేస్తున్న తరుణ్ భార్యను తరచూ అనుమానించడం, వేధించడం చేసేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం భార్యాభర్తల మధ్య ఘర్షణ జరగడంతో ప్రణీత పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం తిరిగి ఇంటికి వచ్చి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రంజింపజేసిన 'అర్ధనారీశ్వరం'


నాట్యం చేస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శివశక్తిని చాటుతూ యువ నర్తకులు చేసిన అర్ధనారీశ్వరం నృత్యరూపకం ప్రేక్షకుల్ని రంజింపజేసింది. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హిరన్మయి నాట్యాలయ సంస్థ ఆధ్వర్యంలో అర్ధనారీశ్వరం పేరిట ప్రత్యేక నృత్యరూపకం ప్రదర్శించారు. నాట్య గురువు ప్రియాంక శిష్య బృందంతో కలిసి ఈ నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త గురు రోహిత్ ఆర్యజీ, రాజర్షి నంద్యజీ, మామిడి హరికృష్ణ, నాట్య గురువు భాగవతులు సేతూరాం, కళాకృష్ణ, తదితరులు పాల్గొని కళాకారులు సత్కరించి అభినందించారు.

విశ్వవిద్యాలయాల కృషితోనే 'వికసిత్ భారత్'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ రాధాక్రిష్ణన్

హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందిన దేశాల్లో భారతదేశాన్ని నంబర్‌వన్ స్థానంలో నిలిపే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ రూపొందించిన వికసిత్ భారత్ ప్రణాళిక విజయవంతం చేసేందుకు విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాక్రిష్ణన్ పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో ఇక్ఫాయ్ యూనివర్సిటీ, ఆల్ ఇండియన్ యూనివర్సిటీస్ అసోసియేషన్(ఏఐయూ) సంయుక్తంగా నిర్వహిస్తోన్న వైస్‌చాన్స్‌లర్ల జాతీయ కాన్ఫరెన్స్‌ను గవర్నర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఉన్నతవిద్యకు సంబంధించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయడంలో ఏఐయూ, ఏఐసీటీఈ ఎంతో కృషిచేస్తున్నాయని అన్నారు. మానవశక్తిని షార్ట్‌రూట్‌లో కాకుండా స్ట్రెయిట్‌రూట్‌లోనే అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం 78మంది విద్యావేత్తలు సంయుక్తంగా రూపొందించిన 'సస్టెయినబుల్ గోల్స్' పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిలాబారత సాంకేతిక విద్యామండలి ఛైర్మన్ టీజీ సీతారామ్, ఏఐయూ ఛైర్మన్ జీడీశర్మ, ఏఐయూ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ పాఠక్, ప్రధాన కార్యదర్శి పంకజ్‌మిట్టల్, ఇక్ఫయ్ యూనివర్సిటీ వీసీ గణేశన్, ఓయూ వీసీ రవీందర్, ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ ఎం.అంజిరెడ్డి, రాయలసీమ వర్సిటీ వీసీ సుధీర్‌ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ఒప్పందం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టడానికి అపోలో హాస్పిటల్స్ గ్రూపులో ఒక భాగమైన ది అపోలో యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ఒప్పందం చేసుకున్నాయి. యూకే, భారత్ మధ్య విద్య, పరిశోధన సంబంధాల బలోపేతానికి ఇది దోహదం చేయనున్నదని, ఈ రెండు వర్సిటీలు కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రాంను ప్రారంభించాయని ఓ ప్రకటనలో తెలిపాయి. ఈ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు తమ చివరి సంవత్సరం, గ్రాడ్యుయేషన్ యూకేలోని లీసెస్టర్ విశ్వ విద్యాలయంలో చేయడానికి అవకాశం ఉంటుంది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో గల ది అపోలో యూనివర్సిటీలో రెండు సంవత్సరాలు విద్యనభ్యసించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒప్పందం చేసుకోవడంపై లీసెస్టర్ విశ్వవిద్యాలయం ప్రోవోస్ట్ డిప్యూటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెన్రిట్టా ఓ కానర్, అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వినోద్ భట్ సంతోషం వ్యక్తం చేశారు.


సీతారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

పహాడిషరీఫ్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణంలో పేద, ధనిక అనే భేదం లేకండా అందరూ భాగస్వాములు కావాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మామిడిపల్లి రంగనాయకుల కాలనీలోని సీతారామలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, హోమం కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ పర్యవేక్షణలో పూజ కార్యక్రమాలు కొనసాగాయి. కార్యక్రమంలో విగ్రహ దాత ఎస్ఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ రాజేష్ మాధురి, గోపాల్ యాదవ్, భాస్కర్, శ్రీరాములు, రామకృష్ణ, రవి, కైవల్యం సైదులు, విజయ, మహేష్, అనిల్, చంద్రశేఖర్, గోపాల్ యాదవ్, గణేష్ గౌడ్, బాలరాజ్ యాదవ్, లింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

● **బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్**

పహాడిషరీఫ్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన జల్‌పల్లిలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చలేదన్నారు. విద్యుత్ కోతల వలన పంటలు ఎండిపోతున్నాయని, రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేదని అగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయమన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయకుండా, రంజాన్ కానుకలు ఇవ్వకుండా ముస్లింలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల పరిధిలోని ముస్లిం ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి స్థానికుడు, ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ని గెలిపించుకోవాలని అన్నారు.

ప్రధాన రోడ్లను యంత్రాల ద్వారానే శుభ్రం చేయాలి


● **తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జైపాల్‌రెడ్డి**

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్లను యంత్రాల ద్వారానే శుభ్రం చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పిల్లర్ నెంబర్ 117 నుంచి ఆరాంఘర్ చౌరస్తా మీదుగా మైలార్‌దేవుపల్లి ఆర్టీసీ బస్టాండ్ వరకు, దుర్గానగర్ చౌరస్తా నుంచి ఓల్డ్ కర్నూల్ రోడ్డు గగన్‌పహడ్ వరకు ప్రధాన రోడ్లను శుభ్రం చేసే పనులను కాంప్రెహెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రాం (సీఆర్ఎంపీ) సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. ఆ రోడ్లను స్వీపింగ్ మిషన్‌ల ద్వారా మాత్రమే శుభ్రం చేయాల్సి ఉండగా, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు మాత్రం పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారని ఆరోపించారు. లక్షలాది రూపాయలు సీఆర్ఎంపీ సంస్థకు చెల్లిస్తూ, పారిశుధ్య సిబ్బందితో ప్రధాన రోడ్లను ఎలా శుభ్రం చేయిస్తారని, ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులతో బస్తీలు, కాలనీలలోని రోడ్లను మాత్రమే శుభ్రం చేయించాలని అన్నారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, సీఆర్ఎంపీ రోడ్లను యంత్రాల ద్వారానే శుభ్రం చేయిస్తున్నాం. రోడ్డుకు ఇరువైపులా డివైడర్‌లను ఆనుకుని ఉన్న ప్రాంతాలలో మాత్రమే నిబంధనలకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు.


సిటీ కళాశాలలో రాష్ట్రీయ కళామంచ్ సింగిడి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

సింగిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

చార్మినార్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ పిలుపునిచ్చారు. ఏబీవీపీ కోఠి జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్రీయ కళామంచ్ సింగిడి - 2024 పోస్టర్లను సిటీ కళాశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ, జిల్లా కన్వీనర్ సభావట్ కళ్యాణ్ మాట్లాడుతూ ఏబీవీపీ అంటే ధర్నాలు రాస్తారోకలే కాదు అని, విద్యారంగ సమస్యలపై నిత్యం పోరాడుతూ విద్యార్థులను చైతన్య పరుస్తామన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని, వారిలోని నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావాలి అనే ఉద్దేశంతో ఏబీవీపీ రాష్ట్రీయ కళామంచ్, సింగిడి పేరుతో ప్రతీ సంవత్సరం ఎంతోమంది విద్యార్థి కళాకారులను వెలుగులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. సాంస్కృతిక పోటీలను ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఏప్రిల్ 20, 21 తేదీలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రాహుల్,సాత్విక్, కళాశాల కార్యదర్శి జితేందర్, వివాహ హాస్టల్ కన్వీనర్ రమేష్, విద్యార్థి నాయకులు శేఖర్, నీతూసింగ్, భవాని, తేజశ్రీ, పలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.


సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

లాల్‌దర్వాజ, గౌలిపురా ఆర్యవైశ్య సంఘం
అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్ ప్రమాణం స్వీకారం

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ, గౌలిపురా ఆర్యవైశ్య సంఘం సమావేశం సోమవారం గౌలిపురాలోని కన్యకా పరమేశ్వరీ ట్రస్టు భవనంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వారు ఎన్నుకొన్నారు. ప్రధాన కార్యదర్శిగా గుబ్బ శ్రీనివాస్, కోశాధికారిగా పడకండి వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా ఇరుకుల భిక్షపతిగుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శిగా కొల్యూర్ నర్సింహులు గుప్తా, సహాయ కోశాధికారిగా బలుస రవికుమార్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ముక్క శేఖర్‌గుప్తా, పీఆర్‌ఓగా సరాబు ఉదయ్ భాస్కర్ గుప్తా, గ్రీటింగ్‌కమిటీ ఛైర్మన్‌గా బెజుగం చంద్రమోహన్ గుప్తా నియమితులయ్యారు. ఫిబ్రవరి 26న అధ్యక్షుడిగా సరాబు సంతోష్ కుమార్ గుప్తాను ఎన్నుకొన్న విషయం తెలిసిందే. సోమవారం సంతోష్‌కుమార్ గుప్తా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారం దయానందగుప్తా, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, చీకోటి ప్రవీణ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు అల్లాడి నాగభూషణంగుప్తా, కాసెట్టి పాండు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మదీన, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనది. చాంద్రాయణగుట్ట ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఓ ఫార్మసీ దుకాణం అరుగులపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు దాదాపు 65 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 87125 69186 ఫోన్ నంబర్‌లో సమాచారమివ్వాలని కోరారు.

చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

● **100 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం**

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి చిత్రంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని, అందుకోసం ఇప్పటి నుంచే ఎన్ఎస్‌యూఐ నాయకులు సమష్టిగా కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యుయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు విష్ణువర్థన్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులలో 30వేల ఉద్యోగాలను ఇచ్చిందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలంటే చేవెళ్లలో కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేస్తున్న డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

గుడి కట్టడానికి తాము వ్యతిరేకం కాదు: బల్మూరి

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల కాళ్లు మొక్కయినా కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసేలా ప్రచారం చేయాలని ఎన్ఎస్‌యుఐ నాయకులకు సూచించారు. బీజేపీ మతం అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తుందని ఆయన ఆరోపించారు. గుడి కట్టడానికి తాము వ్యతిరేకం కాదని, ప్రజల అవసరాలను తీర్చడానికి కూడా పనిచేయాలన్నదే తమ డిమాండ్ అన్నారు. దేశ ప్రజలకు మతం, కులం కాదు భవిష్యత్తు కావాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో స్పష్టం చేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి 1.5లక్షల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, తెలంగాణ రాష్ట్ర డైయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి, కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కోరని బాల్‌రాజ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, సంజయ్ యాదవ్, మహ్మద్ ఖాలేద్, ఎన్.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో భారీ ర్యాలీ

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలంటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదర్‌గూడలో భారీ ర్యాలీ నిర్వహించారు. గడ్డం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారన్నారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు మూడు ఎలక్ట్రిక్ వాహనాలు


వాహనాలను ప్రారంభిస్తున్న జెమిని ఎడిబుల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస

నార్సింగ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ కేంద్రీకృత వంటశాల ఆధునీకరణకు జెమిని ఎడిబుల్స్ సంస్థ మూడు ఎలక్ట్రిక్ వాహనాలను సోమవారం అందజేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెమిని ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్ రెడ్డి, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు, ట్రస్టీ సత్యగౌర చంద్ర దాస హాజరై ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్య గౌర చంద్రదాస మాట్లాడుతూ నార్సింగ్‌లో వంటశాలను ఆధునీకరించడమన్నది మా లక్ష్యసాధనలో మరో ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. ఈ వ్యూహాత్మక పునర్నిర్మాణం 37,000 మందికి రోజూ వండే ప్రస్తుత వంటశాల సామర్థ్యాన్ని 50 వేలుకు పెంచుతున్నదని ఆయన పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ భారతదేశంలోని 16 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 72 వంటశాలల ద్వారా 24,082 పాఠశాలల్లోని 20లక్షల మంది పిల్లలకు ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జీవో సంస్థ నిర్వహించే పాఠశాల భోజన కార్యక్రమంగా నిలిచిందని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. అనంతరం అక్షయ పాత్ర ఫౌండేషన్ సీఈవో శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ జెమిని ఎడిబుల్స్ సంస్థ అందించిన ఈ సహకారాన్ని ఎన్నడూ మరవలేమన్న ఆయన, జెమిని ఎడిబుల్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జెమిని ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అక్షయపాత్ర వాళ్లు చేస్తున్న సేవలను కొనియాడారు. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు తమవంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

శ్రీరామనవమి శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ గిరిధర్

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్ తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఇతర అధికారులతో కలిసి శ్రీరామనవమి శోభాయాత్ర ముగింపు ప్రాంగణం అయిన సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయమశాల వద్ద ఏర్పాట్లను డీసీపీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో శోభయాత్రను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. తాగునీరు, రోడ్లపై చెత్త తొలిగింపు, డ్రైనేజీ సమస్యలు లేకుండా, రోడ్లపై గుంతలు లేకుండా, ఎలక్ట్రిక్ వైర్ల తొలగింపు తదితర అంశాలపై ఏర్పాట్లు చేశామన్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఛత్రి వద్ద ఈ శోభాయాత్ర బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి సిద్దంబర్ బజార్, ఎంజే మార్కెట్, పుత్లిబౌలి, కోఠి ఆంధ్ర బ్యాంక్ చౌరస్తా మీదుగా హనుమాన్ వ్యాయమశాలకు రాత్రి చేరుకుంటుందని అన్నారు. యాత్ర సందర్భంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నిర్వాహకులు కూడా పోలీసులకు సహకరించాలని డీసీపీ కోరారు. శోభాయాత్రకు వచ్చే వాహనాలు వెడల్పు ఎక్కువ ఉండకుండా చూడాలని... పలు చోట్ల మెట్రో పిల్లర్లు ఉండటం వల్ల విగ్రహాల ఎత్తు 20 అడుగుల లోపు ఉండేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 700 మంది సివిల్ పోలీసులతోపాటు 12 ప్లాటున్ల ఏఆర్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిర్వాహకులు వీలైనంత త్వరగా శోభాయాత్ర నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏసీపీ సుధాకర్, సీఐలు లింగేశ్వర్, శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చేవెళ్లలో బీజేపీని గెలిపించండి


రాజేంద్రనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీధర్, ఆ పార్టీ నాయకులు

రాజేంద్రనగర్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్ ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం రాజేంద్రనగర్ నియోజక వర్గంలోని 172వ పోలింగ్ బూత్ పరిధిలో ఆయన ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. దేశ వ్యాప్తంగా అధిక స్థానాలలో బీజేపీ విజయం సాధించి, మూడోసారి నరేంద్రమోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. ప్రచారంలో ఆయన వెంట రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గుంజ బాబురావు, పులిమామిడి రవీందర్, జ్ఞానేశ్వర్, పవన్, డి.కవిత, ఎస్.పెంటయ్య, ఎ.రఘుమారెడ్డి, వి.దయాకర్, ఎం.జంగయ్య తదితరులు ఉన్నారు.

తెలుగు మహాసభలను అధికారికంగా నిర్వహించాలి


మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న భాషోద్యమనేత గౌరీశంకర్

బర్కత్‌పుర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు మహాసభలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలుగు భాషోద్యమనేత పొన్నాల. గౌరీశంకర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుభాషను పరిపాలన భాషగా అమలు చేయాలని కోరుతూ సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించిందని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా తెలుగు మహాసభలను నిర్వహించి తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని కోరారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం సంతోషకరమని, ఆయన సారధ్యంలో జర్నలిస్టులకు న్యాయం జరుగుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎంకు స్పష్టత లేదు: మంద కృష్ణ మాదిగ

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డికి స్పష్టత లేదని, ఎస్సీ రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, మాదిగలకు నామినేటెడ్ పదవి ఇస్తామనడం హాస్యాస్పదమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని లీప్యాలెస్‌లో కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ నాయకుడు కిషన్ మాదిగ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మాదిగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ, కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో మాదిగలకు టిక్కెటు కేటాయించకుండా అన్యాయం చేశారని అన్నారు. ఓటు రూపంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆ పార్టీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థులకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని ఆయన ఆరోపించారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేకి అని, అందుకే పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేసిందే కాంగ్రెస్ అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అజిత్, శ్రీకాంత్, పరశురాం, ఇటుక శ్రీకిషన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


టిప్పర్ ఢీకొని వృద్ధురాలి మృతి

రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలుని టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ఘటన మైలార్‌దేవుపల్లి ప్రగతి కాలనీ వద్ద జరిగింది. మైలార్‌దేవుపల్లి ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలు ప్రకారం జానకిబాయి(78) కుమారులు చనిపోవడంతో ఆమె కోడలు మైలార్‌దేవుపల్లి బృందావన్‌కాలనీలో నివాసం ఉంటుంది. జానకీబాయి ఒంటరిగా ఉస్మాన్‌గంజ్‌లో ఓ ఇంట్లో పని చేస్తూ అక్కడే ఉంటూ అప్పుడప్పుడు కోడలు ఇంటికి వచ్చి పోతుండేది. శనివారం సాయంత్రం బృందావన్‌కాలనీలోని కోడలు ఇంటికి వచ్చిన జానకీబాయి సోమవారం ఉదయం ఉస్మాన్‌గంజ్‌కు వెళ్లడానికి రోడ్డుపక్కన నడుచుకుంటూ మైలార్‌దేవ్‌పల్లి బస్టాప్‌నకు వస్తుండగా, ప్రగతి కాలనీ వద్ద రాగానే వేగంగా వచ్చిన టిప్పర్ (టీఎస్ 10యూఏ 1237) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జానకీ భాయి అక్కడిక్కడే మృతిచెందినది.విషయం తెలుసుకున్న జానకీబాయి మనుమడు సతీష్ అక్కడికి వచ్చి మైలార్‌దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. స్టీరింగ్ రాడ్ విరిగిపోవడం వల్ల ప్రమాదం జరిగిందని డ్రైవర్ చెబుతున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహనీయుల ఉత్సవాలు విజయవంతం

● **ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు**



నర్సింగ్ రావు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు మచ్చ నర్సింగ్ రావు సోమవారం ఓ ప్రకటనలతో ధన్యవాదాలు తెలిపారు. ఏప్రిల్ 5న ఆరాంఘర్ చౌరస్తాలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి, ఏప్రిల్ 14న డాక్టర్ అంబేడ్కర్ జయంతిని రాజేంద్రనగర్‌లో నిర్వహించామని ఆయన తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు, పోలీస్ సిబ్బందికి, విద్యుత్‌శాఖ అధికారులకు పేరుపేరునా మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులందరి తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు.


పురుషోత్తం రావును సత్కరిస్తున్న నిర్వాహకులు హీరాలాల్‌సింగ్ తదితరులు

విశాల్ జాగరణ్‌లో ఆధ్యాత్మిక చింతన

మంగళ్‌హట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మాత విశాల్ జాగరణ్‌ల్ భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన, మనశ్శాంతి కలుగుతుందని బీఆర్ఎస్ గోషామహల్ డివిజన్ ఇన్‌చార్జి ఆల పురుషోత్తం రావు పేర్కొన్నారు. విశాల్ జాగరణ్‌లో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని ఆయన అన్నారు. రహీంపురా మైదానంలో ఠాకూర్ లోధ్ సమాజ్ అధ్యక్షుడు హీరాలాల్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మాత విశాల్ జాగరణకు ముఖ్య అతిధిగా పురుషోత్తం రావు హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పురుషోత్తం రావును సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ కృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.


లక్ష మల్లెపూలతో పూజలు చేస్తున్న భక్తులు

కన్నులపండువగా లక్ష మల్లెమాల పూజ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లాల్ దర్వాజ పూల్‌బాగ్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి లక్ష మల్లెపూల పూజ కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కందాడి మోహనాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బాశెట్టి లెనిన్‌బాబు, నివేదిత దంపతులు, దయానంద్ దంపతులు స్వామి వారికి లక్ష మల్లెపూలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, ధర్మకర్తలు పి. వెంకటేశ్వర్‌రావు, ఎం. అమరేశ్వర్‌రెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసుల కవాతు


ఫ్లాగ్ మార్చ్‌లో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, పోలీస్ అధికారులు

రాజేంద్రనగర్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ నేతృత్వంలో అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ టి.శ్రీనివాస్, రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్లు బి.నాగేంద్రబాబు, వెంకట్రామిరెడ్డి, పి.మధు, ఎస్ఐలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు, తెలంగాణ స్టేట్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని భరోసా కల్పిస్తూ ఈ ఫ్లాగ్ మార్చ్ సాగింది. ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీసులు తెలిపారు.

కేంద్రాన్ని ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐతో దాడులు

ఆర్థిక, సామాజిక విశ్లేషకులు పాపారావు

పంజాగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలను ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐతో దాడులు చేయించి జైలుకు పంపుతున్నారని ప్రముఖ ఆర్థిక, రాజకీయ, సామాజిక విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. ప్రతిపక్ష నాయకులను ఎన్నికల సందర్భంగా జైల్లో పెట్టడం అంటే వారిని పోటీలో లేకుండా చేయడమే అని ఆరోపించారు. సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధురానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ తెలంగాణ బుక్ హౌస్ ప్రచురించిన ప్రబీర్ పుర్కాయస్థ పుస్తకాన్ని ఆయన కామ్రేడ్ జితిన్, నవ తెలంగాణ బుక్ హౌస్ మేనేజర్ వాసుతో కలసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ యూట్యూబ్ చానల్ ద్వారా ప్రజా, కార్మిక సమస్యలు ప్రజలందరికీ తెలియజేసినటువంటి గొప్ప పోరాట యోధుడు ప్రబీర్ అన్నారు. ఆయన రచించిన అలుపెరుగని పోరాటం నాటి ఎమర్జెన్సీ నుంచి నేటి మోదీ ప్రభుత్వం అనుసరించే అప్రకటిత ఎమర్జెన్సీ వరకు వివిధ అంశాలను పుస్తకంలో వివరించాడన్నారు. దేశంలో మీడియా మొత్తం ఆర్ఎస్ఎస్, బీజేపీ చేతిలో ఉందనన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత


విద్యుత్ లేని తరగతి గదిలో విద్యార్థినులు

బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో కరెంట్ లేకపోవడంతో విద్యార్థులు ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లోనే పరీక్షలు రాస్తున్నారు. పాఠశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి ఐదురోజులైనా ప్రిన్సిపాల్ స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్థానిక నాయకులు కొందరు ఎంఈవోకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

8 లింక్ రోడ్లు

(5వ పేజీ తరువాయి)

జీహెచ్ఎంసీలో రూ.8 కోట్లు, హెచ్ఎండీఏలో రూ.5 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పనుల్లో వేగం తగ్గింది.

15 అడుగుల రోడ్డును..

యూసుఫ్‌గూడ ఇందిరానగర్ చౌరస్తా నుంచి అన్నపూర్ణ స్టూడియో మీదుగా 12 అడుగుల రోడ్డు ఉండేది. 20 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉండే ఈ మార్గంలో వాహనాలూ రాకపోకలు సాగించే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడా రహదారిని 60అడుగులకు విస్తరిస్తున్నారు. 400మీటర్ల మేర రూ.4 కోట్లతో పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణతోపాటు ఎత్తూ గణనీయంగా తగ్గిస్తున్నామని, దీంతో రాకపోకలు సులువుగా సాగుతాయని ఓ అధికారి తెలిపారు.

ఇవీ రహదారులు

- అలీకేఫ్ చౌరస్తా నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వరకు రూ.20 కోట్లతో 1.30 కి.మీలు.
- ఉస్మాన్‌నగర్ నుంచి విప్రో ప్రహరీ పక్కనుంచి వట్టినాగుల పల్లి వరకు రూ.35.20 కోట్లతో 3.60 కి.మీలు.
- వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి వసంత సిటీ రోడ్ - రూ.20.40 కోట్లతో 1.40 కి.మీలు
- అల్కాపురి టౌన్‌షిప్ నుంచి నార్సింగ్ రేడియల్ రోడ్ నంబర్ -5 - రూ.3 కోట్లతో 750 మీటర్లు.
- డాలర్ హిల్స్ నుంచి నెక్నాంపూర్ వరకు విస్తరణ - రూ.10 కోట్లతో 1.74 కి.మీలు.
- బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 నుంచి బీఆర్ఎస్ భవన్, రోడ్ నంబర్- 12 - రూ.9 కోట్లతో 530 మీటర్లు.

పట్టాలిచ్చారు.. పక్కన పెట్టారు

- జీహెచ్ఎంసీ ఎదుట 'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల నిరసన
- ఇళ్లలోకి రానివ్వడం లేదని కమిషనర్‌కు ఫిర్యాదు


జీహెచ్ఎంసీ వద్ద పట్టాలతో నిరసన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టాలిచ్చారు.. ఇళ్లలోకి అనుమతించడం లేదంటూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు సోమవారం జీహెచ్ఎంసీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మలక్‌పేట, యాకుత్‌పురా, చార్మినార్, ఎల్బీనగర్, మల్లాపూర్, అంబర్‌పేట, చార్మినార్ తదితర ప్రాంతాలకు చెందిన వందల మంది లబ్ధిదారులు ప్రధాన కార్యాలయం వద్ద కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తామందరికి రాంపల్లిలో ఇళ్లు కేటాయించి, పట్టాలిచ్చారని, కానీ ఇళ్లలోకి వెళ్లేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని, తాగునీటి సరఫరా లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మీటర్ కనెక్షన్ కోసం స్థానిక విద్యుత్ కార్యాలయంలో పలుమార్లు దరఖాస్తు చేశామని, వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి విద్యుత్ కనెక్షన్లకు మార్గం సుగమం చేయాలని కోరారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా.. ఆ లోపు రాంపల్లికి వెళితే స్థానిక స్కూళ్లలో పిల్లలను చేర్పించుకుంటామని కమిషనర్‌కు వారు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతానని, నిధులిచ్చినా ఇంకా పనులు ఎందుకు చేయలేదో తెల్సుకుంటానని కమిషనర్ చెప్పినట్టు లబ్ధిదారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు వచ్చిన లబ్ధిదారులను అక్కడి సెక్యూరిటీ ఆఫీస్‌లోకి అనుమతించకపోవడంతో.. సాయంత్రం 4.30 గంటల వరకు అక్కడే ఉన్నారు. సచివాలయంలో సమావేశానికి వెళ్తోన్న కమిషనర్‌ను కారు ఎక్కుతుండగా కలిసి గోడు వెల్లబోసుకున్నారు.

నివేదిత విజయానికి సహకరించండి

రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలకు ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి వినతి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి, పక్కన శ్రీధర్‌రెడ్డి, నివేదిత

సికింద్రాబాద్, బోయినపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత విజయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నేతలు సహకరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి విజ్ఞప్తి చేశారు. బోయినపల్లిలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలల వ్యవధిలో తండ్రి సాయన్నను, చెల్లి లాస్య నందితను కోల్పోయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న నివేదిత కొండంత ధైర్యంతో ప్రజాసేవ చేయడానికి ముందుకొచ్చారని, నివేదితను పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఆయన కోరారు. అవసరమైతే ఈ విషయమై నివేదితో కలిసి వెళ్లి అందరినీ కలిసి విజ్ఞప్తి చేస్తామని ఆయన తెలిపారు.

'డబుల్' ఇళ్లపై అసత్య ఆరోపణలు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయమై నివేదితపై చేస్తున్న ఆరోపణలను మర్రి రాజశేఖరరెడ్డి ఖండించారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించాలని లబ్ధిదారుల జాబితాను సాయన్న సిద్ధం చేశారని, ఆయన చుట్టూ ఉన్న కొందరు స్వార్థపరులు ఆ జాబితాలోని పేర్లు తెలుసుకుని, వారిని సంప్రదించి, డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. సాయన్న మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులపై బురద చల్లుతున్నారని ఆయన పేర్కొన్నారు. తన జీవితాన్ని కంటోన్మెంట్ ప్రజలకు అంకితం చేస్తానని, కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తానని నివేదిత అన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యులు బి.అనితప్రభాకర్, కె.పాండుయాదవ్, లోకనాథం, బోయినపల్లి మార్కెట్ మాజీ ఛైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరికృష్ణ, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద(ఆర్పీపీ) క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

నామినేషన్ ప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

మేడ్చల్: పార్లమెంటు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నందున నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీసీపీ నితిక పంతు, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రూ.3 కోట్ల 94 లక్షల నగదు సీజ్..

జిల్లాలో ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి సోమవారం వరకు 3 కోట్ల 94లక్షల 77వేల 276 రూపాయలను సీజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రూ. 83 లక్షల 94 వేల 655 విలువ గల ఆభరణాలు, ఇతర వస్తువులు సీజ్ చేసినట్లు తెలిపారు. 4 వేల 802 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. 312 మందిపై ఎక్సైజ్ శాఖ కేసులు నమోదు చేసిందని, 326 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు.

ఎన్నికల పనులపై సందిగ్ధం..!

(5వ పేజీ తరువాయి)

అదనుగా భావిస్తోన్న కొందరు అధికారులు ఖర్చులు ఎక్కువ చేసి చూపిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో రూ.4కోట్ల నుంచి రూ.5 కోట్లు ఖర్చు కాగా.. ఇంకొన్ని చోట్ల రూ.6కోట్ల నుంచి రూ.7 కోట్లు వెచ్చించినట్టు కేంద్ర కార్యాలయానికి వివరాలు పంపారు. పోలింగ్ సిబ్బందికి భోజనాలు, ఇతరత్రా ఏర్పాట్లలో కొందరు అధికారులు ఇష్టానికి వ్యవహరించారు. అందుకే కొన్నిచోట్ల 50 నుంచి 80 శాతం వరకు ఖర్చులు పెరిగాయని ఎన్నికల విభాగంలోని ఓ అధికారి తెలిపారు. విడతల వారీగా పంపిన ఈ బిల్లుల్లో కొన్ని ఎన్నికల సంఘానికి వెళ్లగా.. ఇంకొన్నింటిపై కేంద్ర కార్యాలయం అభ్యంతరం తెలిపింది.

ఆర్ఓల తీరుపై...

అసెంబ్లీ ఎన్నికల బిల్లుల చెల్లింపులో కొందరు ఆర్ఓల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు ఆర్థికంగా గిట్టుబాటయ్యే బిల్లులు చెల్లించి ఇంజనీరింగ్ పనుల బిల్లులను ఉద్దేశ పూర్వకంగా నిలిపివేశారని సికింద్రాబాద్ జోన్‌కు చెందిన ఓ ఇంజనీర్ ఆరోపించారు. జీహెచ్ఎంసీలో వివిధ పనులకు సంబంధించి రూ.1000 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల బిల్లులూ సకాలంలో చెల్లించకపోవడంతో ఏర్పాట్లపై సందిగ్ధం నెలకొంది. సోమవారం పలు నియోజకవర్గాలకు సంబంధించి 20 శాతం బిల్లులు చెల్లించేందుకు అంగీకరించినట్టు సమాచారం.

రూ.2.41కోట్లు సీజ్

(5వ పేజీ తరువాయి)

రూ.87వేలు, 4బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1,43,13,273తోపాటు కమ్యూనికేషన్ బోర్డులు, 7స్మార్ట్‌ఫోనులు, 9కీప్యాడ్ ఫోనులు, 2 లాప్‌టాప్‌లు, ట్యాబ్, బెంజికారు, యాక్టివా స్వాధీనంచేసుకున్నారు.

● గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలో ఉంటున్న గుంటూరు జిల్లా కొర్రపాడుకు చెందిన ఎర్రమంచు అజయ్‌కుమార్(53), అదే కాలనీలో ఉంటున్న విజయనగరం వాసి అనాదుల మహేష్ కుమార్(42)లు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. వీరు నరేష్ అలియాస్ నాని అనే ప్రధాన బుకీ వద్ద పంటర్లుగా ఉన్నారు. బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడిచేసి అజయ్, మహేష్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.73,500, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.21,034 సీజ్ చేశారు. రూ.1.04,534 విలువగల 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నిజాంపేటలో..

● బాచుపల్లి సాయినగర్‌లో ఉంటున్న పల్నాడు జిల్లా ముప్పాళ్లకు చెందిన మార్తల శ్రీకాంత్‌రెడ్డి(30), నిజాంపేటలో ఉంటున్న కడప చెన్నూరుకు చెందిన అల్లి లోకేష్(29), బాచుపల్లిలో ఉంటున్న నిజాంపేటకు చెందిన జి.వెంకటసునీల్(28) కలిసి బుకీలైన నీలేష్, బుద్దారెడ్డి వద్ద బెట్టింగ్ ఆర్గనైజర్లుగా పని చేస్తున్నారు. పక్కా సమాచారమందుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు బాచుపల్లిలోని శ్రీకాంత్‌రెడ్డి నివాసంపై దాడి చేశారు. శ్రీకాంత్‌రెడ్డి, లోకేష్, సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.13,30,146తోపాటు రూ.1.83 లక్షల విలువైన 6 స్మార్ట్‌ఫోన్లు, 3 లాప్‌టాప్‌లు, 16 కీప్యాడ్ మొబైల్‌లు స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో దారి దోపిడీలు

ఒంటరి వ్యక్తిపై దాడిచేసి..

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాండురంగనగర్‌లో నివాసం ఉండే జి.శ్రీనివాసరావు ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 14న రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తూ జానకమ్మతోట ప్రాంతానికి రాగానే మూత్ర విసర్జనకు ఆగాడు. అయితే, అతన్ని ఆరుగురు వ్యక్తులు పట్టుకుని దాడి చేసి రూ.30 వేలు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అనంతరం బాధితుడు కేకలు వేయటంతో వదిలేసి వెళ్లిపోయారు. బాధితుడు వెంటనే మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆటోలో ఎక్కించుకుని..

నార్సింగ్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి ఆటోలో డ్రైవర్‌గా, ప్యాసింజర్‌గా వచ్చిన దోపిడీ దొంగలు కోకాపేట్ వైపు వెళ్తూ మరికొందమందిని ఆటోలో ఎక్కించుకుని మార్గమధ్యంలో వారిపై దాడి చేసి, బెదిరించి రూ.4,500 దోచుకుని పారిపోయారు. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. ఇంకా ఎవరైనా దారి దోపిడీకి గురై ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వారికి అండగా ఉంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైక్‌పై వెళ్తున్న యువకుున్ని అడ్డగించి..

మదీన, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన నీరజ్(22) ఉదయం 6 గంటల సమయంలో బైక్‌పై తన తండ్రిని ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ వద్ద వదిలిపెట్టి తిరిగి వెళ్తున్నాడు. రుమాన్ హోటల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి 'నీ బైక్‌కు నంబర్ ప్లేట్ లేదు.. కేసు అవుతుంది' అని బెదిరించారు. అక్కడే ఒక సందులోకి తీసుకెళ్లి కత్తితో బెదిరించి అతని జేబులో ఉన్న రూ.4500 నగదు, చేతికి ఉన్న బ్రాస్‌లెట్‌ను లాక్కుని పారిపోయారు. దీంతో బాధితుడు చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పాత నేరస్థుడు జాబ్రీ ఈ నేరానికి పాల్పడ్డట్టు గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకున్నామని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. జాబ్రీపై ఇప్పటికే ఐదారు కేసులున్నాయి. నెలరోజుల క్రితమే జైలు నుంచి వచ్చాడని పోలీసులు తెలిపారు.

ఈత కొలనులో పడి బాలుడి మృతి


కార్తికేయ (ఫైల్)

సనత్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ కార్మిక సంక్షేమ కేంద్రం ఆవరణలోని ఈత కొలనులో పడి 12ఏళ్ల బాలుడు మృతిచెందాడు. ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్, మహేశ్వరి దంపతులకు కుమార్తె తేజశ్విని, కుమారుడు కార్తికేయ ఉన్నారు. కార్తికేయ వశిష్ట స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పరీక్ష పూర్తయిన తర్వాత మిత్రులతో కలిసి క్రికెట్ ఆడేందుకు కార్మిక సంక్షేమ కేంద్రం ఆవరణలోని మైదానానికి వెళ్లాడు. క్రికెట్ బాల్ పగలడంతో ఈత కొలనులో క్రికెట్ బంతులు ఉండవచ్చని స్నేహితులు చెప్పడంతో సమీపంలోని చెట్టు ఎక్కి ఈత కొలను వైపునకు దిగాడు. ఈత కొలను వైపునకు దిగిన కార్తికేయ రాకపోవడంతో అక్కడే ఉన్న అతడి స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే బాలుడి తల్లిదండ్రులు వచ్చి ఈత కొలను గేట్లు తెరిపించి చూడగా నీటి కొలన్‌లో శవమై తేలుతున్న కార్తికేయ కనిపించాడు. తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ కారు దహనం కేసు..

నిందితుల కోసం ప్రత్యేక బృందాలు

- సీసీ ఫుటేజీలను జల్లెడపడుతున్న పోలీసులు


కాలిపోతున్న స్పోర్ట్స్ కారు(ఫైల్)

పహాడిషరీఫ్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న కారు కొనుగోలు చేస్తామని పిలిచి మామిడిపల్లి - శంషాబాద్ రోడ్డులో కోట్ల విలువైన స్పోర్ట్స్ కారును దహనం చేసిన కేసులో పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పహాడిషరీఫ్ పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రధాన నిందితుడు అహ్మద్‌తోపాటు ఇతర నిందితులు పోలీసులకు చిక్కకుండా ఫోన్‌లు ఆఫ్ చేసుకున్నారని, త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. కారును దహనం చేసేందుకు నిందితులు రెండు కార్లు, బైకులపై వచ్చారని, వారిని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నామని తెలిపారు. ప్రత్యేక బృందాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్ బస్ దగ్ధం

(5వ పేజీ తరువాయి)


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రాయ్‌పూర్‌కు 30మంది ప్రయాణికులతో కాంకర్ రోడ్‌వేస్‌కు చెందిన బస్ (సీజీ19 బీజే8811) బయలుదేరింది. బస్సు కొంపల్లి సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా ఏసీ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ గమనించి రోడ్డు పక్కన బస్సును నిలిపి ప్రయాణికులను కిందికి దించాడు. వెంటనే పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకునే లోపే బస్సులో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ బస్సుతోపాటు ప్రయాణికుల సామగ్రి కాలిపోయి బూడిద అయింది. డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధుయాష్కీగౌడ్‌కు మాతృవియోగం

- నివాళులర్పించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు



అనసూయమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హయత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్ తల్లి అనసూయమ్మ(85) సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మధ్యాహ్నం వారి స్వగ్రామం హయత్‌నగర్‌కు తరలించి స్థానికుల సందర్శనార్థం వారి పాత నివాసంలో ఉంచారు. సాయంత్రం 6గంటలకు అంతిమ యాత్ర ప్రారంభించి హయత్‌నగర్ రేడియో స్టేషన్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. మునుగోడు ఎమ్మెల్యే, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుంభం అనీల్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, గ్రామస్థులు, ఎల్బీనగర్ నియోజకవర్గం నాయకులు అనసూయమ్మ అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు.


అనసూయమ్మ పాడెమోస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రముఖుల పరామర్శ..

మధుయాష్కీ తల్లి అనసూయ మరణవార్త తెలియగానే మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి రాజేశంగౌడ్, టీజేఎస్ నేత ప్రొఫెసర్ కోదండరాం, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మందుల సామేలు, కవంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, నూతి శ్రీకాంత్ గౌడ్, ఫహీం, గీత కార్మిక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రామ్మోహన్‌గౌడ్‌లతో పాటు పలువురు ప్రముఖులు బంజారాహిల్స్‌లోని ఆయన ఇంటికి వచ్చి అనసూయమ్మ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మధుయాష్కీ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంతాపం వ్యక్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మధుయాష్కీకి, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి మనోధైర్యం కలిగించాలని భగవంతుణ్ని ప్రార్థించారు.

బేరియాట్రిక్ సర్జరీ నూరు శాతం ఫలితాన్నివ్వాలంటే, బిఎమ్ఐకి తగిన సర్జరీని ఎంచుకోవడంతో పాటు, అత్యాధునిక చికిత్సా విధానాలను వినియోగించుకోగలగాలి.

బేరియాట్రిక్ సర్జరీ





బరువు తగ్గించే సర్జరీలు

అధిక బరువు ఆరోగ్యాన్ని కుదేలు చేయడం మొదలుపెట్టినప్పుడు, అత్యవసరంగా బరువు తగ్గించుకోక తప్పదు. అందుకోసం అక్కరకొస్తున్న బేరియాట్రిక్ సర్జరీలు ఇప్పుడు మరింత సులభతరంగా మారాయి. అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో మునుపటికి మించిన ఫలితాలు సాధ్యపడుతున్నాయి అంటున్నారు వైద్యులు.

స్లీవ్, బైపాస్ అనే బేరియాట్రిక్ సర్జరీల్లో దేన్ని ఎంచుకోవాలనేది వ్యక్తి బిఎమ్ఐ, ఆరోగ్య పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. కానీ అధిక బరువు తగ్గించడమే ప్రధాన ఉద్దేశం కాబట్టి, బైపాస్ చేయవలసిన అవసరం ఉన్న వాళ్లకు కూడా స్లీవ్ సర్జరీలతో సరిపెట్టే పరిస్థితి ఇంతకు ముందు ఉండేది. ఇందుకు వైద్యుల అవగాహనా లోపం, సర్జరీ వెసులుబాట్లు లేకపోవడం లాంటి ఎన్నో కారణాలున్నాయి. కానీ నిజానికి బేరియాట్రిక్ సర్జరీ నూరు శాతం ఫలితాన్నివ్వాలంటే, బిఎమ్ఐకి తగిన సర్జరీని ఎంచుకోవడంతో పాటు, అత్యాధునిక చికిత్సా విధానాలను వినియోగించుకోగలగాలి. ఈ క్రమంలో వేర్వేరు రకాల బేరియాట్రిక్ బైపాస్ సర్జరీలు తాజాగా అందుబాటులోకొచ్చాయి.

రొబొటిక్స్‌తో సురక్షితమైన సర్జరీ


బిఎమ్ఐ 50కి మించిన, సూపర్ ఒబేస్ ఉన్న వాళ్ల బరువును హ్యాండిల్ చేయడం చాలా కష్టం. మితిమీరిన ఊబకాయం వల్ల వైద్యులకూ, రోగులకూ సర్జరీ అసౌకర్యంగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో సర్జరీలో ఉపయోగించే సన్నని ల్యాప్రోస్కోపీ పరికరాలు వంగిపోయి, మరొక సర్జరీకి పనికిరాకుండా పోవచ్చు. కొందరికి సర్జరీ క్లిష్టం కావచ్చు. ఫలితంగా సర్జరీలో గాయాల తీవ్రత, సర్జరీ తర్వాత కోలుకునే సమయం ఎక్కువగా ఉండవచ్చు. ఈ పరిస్థితిని అధిగమించేలా తాజాగా రొబోటిక్స్ అందుబాటులోకొచ్చాయి. రొబొటిక్ ఆర్మ్స్ దృఢంగా ఉంటాయి, హైడెఫెనిషన్ వల్ల సూక్ష్మ రక్తనాళాలను కూడా వైద్యులు స్పష్టంగా చూడగలుగుతారు. ఫలితంగా సర్జరీలో రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు కూడా సర్జరీ నుంచి త్వరగా కోలుకోగలుగుతున్నారు.

బేరియాట్రిక్ బైపాస్‌లో...

ఆరు మీటర్ల చిన్న పేగులో ఒకటి నుంచి రెండు మీటర్ల పొడవు మేర పేగులోకి ఆహారం వెళ్లకుండా నియంత్రించే ప్రక్రియే బేరియాట్రిక్ బైపాస్. ఇంతకు ముందు ఈ ప్రక్రియ కొంత క్లిష్టంగా ఉండేది. రెండు దశల్లో రెండు చోట్ల జాయింట్లతో ఈ ప్రక్రియ సాగేది. కానీ ఇప్పుడు మిని గ్యాస్ట్రిక్ బైపాస్, స్లీవ్ జిజినల్ బైపాస్... ఇలా కొత్త ప్రక్రియల్లో బైపాస్ సర్జరీలు జరుగుతున్నాయి. వైద్యులు ఈ సర్జరీలను ఒకే జాయింట్‌తో ముగించగలుగుతున్నారు. అలా ఈ తరహా కొత్త బైపాస్ సర్జరీలను చేసే సులభతరమైన ప్రక్రియలు తాజాగా అందుబాటులోకొచ్చాయి.

బైపాస్‌తో ప్రయోజనం

స్లీవ్ సర్జరీ కంటే బైపాస్ సర్జరీల్లో ఫలితం ఎక్కువగా ఉంటుంది. స్లీవ్ చేయించుకున్న వాళ్ల కంటే బైపాస్ చేయించుకున్న వాళ్లలో వెయిట్ లాస్ ఎక్కువగా ఉండడమే కాకుండా, వెయిట్ లాస్ ఎక్కువ కాలం కొనసాగుతుంది. అలాగే స్లీవ్ సర్జరీ తర్వాత, మళ్లీ బరువు పెరిగి, రెండోసారి సర్జరీ చేసే పరిస్థితి ఉంటూ ఉంటుంది. కానీ బైపాస్ చేయించుకున్న వాళ్లు తిరిగి బరువు పెరిగే అవకాశం ఉండదు. దాంతో రెండోసారి సర్జరీ అవసరం పడదు. పైగా సర్జరీ చేయించుకున్న మూడో రోజే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిపోవడం తాజా సర్జరీలతో ఉన్న మరొక సౌలభ్యం. అలాగే సర్జరీ జరిగిన పది రోజుల నుంచే మునుపటి జీవనశైలిని కొనసాగించవచ్చు.



సర్జరీ తర్వాత ఇలా...

సర్జరీ ఫలితం, ప్రభావం 50 శాతమే! మిగతా 50 శాతం వ్యక్తిగత ప్రయత్నం మీదే ఆధారపడి ఉంటుంది. సర్జరీ తర్వాత న్యూట్రిషనిస్టులు సూచించిన ఆహారం, సూచించిన పరిమాణాల్లోనే తీసుకోవాలి. అలాగే సూచించిన ఆహార నియమాలను జీవితాంతం కొనసాగించాలి. సర్జరీతో తగ్గిన బరువు భవిష్యత్తులో పెరగకుండా ఉండాలంటే వైద్యులు సూచించిన నియమాలను తూచతప్పకుండా పాటించాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అలాగే వైద్యులు ఏర్పాటుచేసే కౌన్సెలింగ్ సెషన్లు, సపోర్టివ్ మీటింగ్స్‌కు కూడా హాజరవుతూ ఉండాలి. ఆ మీటింగ్స్‌లో అనుమానాలను నివృత్తి చేసుకోవడమే కాకుండా అవగాహన కూడా ఏర్పరుచుకునే అవకాశం ఉంటుంది.

రెండో సర్జరీ వరకూ రాకుండా..

ఈ దశకు రాకుండా ఉండాలంటే మొదటి సర్జరీ సక్రమమైనదై ఉండాలి. వ్యక్తి బిఎమ్ఐతో సంబంధం లేకుండా స్లీవ్ సర్జరీతో సరిపెట్టేస్తే, భవిష్యత్తులో రీ డు సర్జరీ అవసరం రావచ్చు. బైపాస్ సర్జరీ సమయాన్ని తట్టుకోలేని వాళ్లు, అవయవాల మార్పిడి చేయించుకోవలసిన అవసరం ఉన్న కొందరికి, స్లీవ్ సర్జరీ మినహా పేగుల బైపాస్ చేసే పరిస్థితి ఉండకపోవచ్చు. కానీ కొందరికి తగిన సర్జరీ బైపాస్ ఒక్కటే అయి ఉండవచ్చు. ఇంకొందరికి స్లీవ్, బైపాస్... రెండు సర్జరీల అవసం ఉండవచ్చు. కాబట్టి ఎవరికి ఏ సర్జరీ తగినదో కచ్చితంగా అంచనా వేయగలిగే అనుభవం, అర్హత వైద్యులు కలిగి ఉండాలి. అందుకోసం అనుభవజ్ఞులైన వైద్యులనే బేరియాట్రిక్ సర్జరీల కోసం ఎంచుకోవాలి. రోగిని, సర్జరీని ఎంచుకునే విధానం, సర్జరీ చేసే విధానం, సర్జరీ తర్వాత రోగిని మేనేజ్ చేయడం... ఇలా బేరియాట్రిక్ సర్జరీ ఫలితం నాలుగు అంశాల మీద ఆధారపడి ఉంటుంది.



డాక్టర్ కోన లక్ష్మీ కుమారి,
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ అండ్ బేరియాట్రిక్ సర్జన్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్



గుడ్ ఫుడ్

ప్రొటీన్ తింటున్నారా?

పోషకాల్లో మాంసకృత్తులే కీలకం. శక్తిని సమకూర్చి శరీర జీవక్రియల సామర్థ్యాన్ని పెంచడంలో, వ్యాధులను అరికట్టేలా రోగనిరోధకశక్తిని బలపరచడంలో ప్రొటీన్లు కీలక పాత్ర పోషిస్తూ ఉంటాయి. ఇలాంటి అత్యవసరమైన ప్రొటీన్లకు దైనందిన ఆహారంలో చోటు కల్పించమెలాగో తెలుసుకుందాం!

ప్రతి కిలో శరీర బరువుకూ 0.8 నుంచి ఒక గ్రాము ప్రొటీన్ తీసుకోవడం అవసరం. ఉదాహరణకు మన శరీర బరువు 68 నుంచి 70 కిలోలు ఉంటే, రోజుకు 55 నుంచి 68 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలి. మరి ఇంత పెద్ద మొత్తంలో ప్రొటీన్ అందాలంటే ఏం చేయాలి? ఏం తినాలి?



- **అలవాటు:** ప్రొటీన్ తినడం దైనందిన అలవాటు కావాలి. ఉదయం అల్పాహారంగా లేదా వ్యాయామం తర్వాత ప్రొటీన్ షేక్ తాగుతూ ఉండాలి.
- **తొలి ప్రాధాన్యం:** ఆహారంలో ప్రొటీన్‌కు ప్రాధాన్యమివ్వాలి. కడుపు నిండేలోగా ప్రొటీన్‌తో కూడిన పదార్థాలను తినేయాలి.
- **నట్స్:** సలాడ్స్, ఓట్‌మీల్, వేపుళ్లు, ఉప్మా, దోశల్లాంటి వాటిలో నట్స్ చల్లుకుని తింటూ ఉండాలి.
- **లేత మాంసం:** చికెన్ బ్రెస్ట్ లాంటి తక్కువ క్యాలరీలు, ఎక్కువ ప్రొటీన్లు దొరికే లేత మాంసం తినాలి.
- **బ్రౌన్ రైస్:** తెల్ల బియ్యానికి బదులు బ్రౌన్ రైస్ ఎంచుకోవాలి.
- **బీన్స్:** పీచు, విలువైన పోషకాలు, ప్రొటీన్ సమృద్ధిగా దొరికే బీన్స్ ఎక్కువగా వాడుకోవాలి.

ఇలాంటి చిన్న చిన్న మార్పులు చేసుకోగలిగితే, ప్రొటీన్ ఇన్‌టేక్ పెరిగి ఆరోగ్యం భేషుగ్గా ఉంటుంది.

అవగాహన

ఇంటర్నల్ బ్రా ఇలా...

బ్రా ఫ్రీ లైఫ్‌ను ఇష్టపడని మహిళలు ఉండరు. ఒరుసుకుపోతూ, అసౌకర్యంగా ఉండే బ్రాసరీల నుంచి విముక్తి పొందేలా, శరీరంలోనే అమర్చే వీలుండే బ్రాసరీలు త్వరలో మహిళల ఇబ్బందులను పరిష్కరించబోతున్నాయి. ఆ అంతర్గత బ్రాసరీలే 'ఇంటర్నల్ బ్రా'లు.

మెష్, లేదా పంది చర్మాన్ని ఉపయోగించి, రొమ్ములను పైకి లిఫ్ట్ చేసి ఉంచే 'ఇంటర్నల్ బ్రా సర్జరీలు' తాజాగా యుకె, అమెరికాల్లో ఊపందుకున్నాయి. గురుత్వాకర్షణ, బరువు వల్ల కిందకు సాగిపోతూ అందవిహీనంగా కనిపించే రొమ్ములను మహిళలు ఇంతకు ముందు బ్రెస్ట్ లిఫ్ట్, బ్రెస్ట్ రిడక్షన్ సర్జరీలతో, సపోర్టివ్ బ్రాసరీలతో ఆకర్షణీయంగా సరిదిద్దుకునే వాళ్లు. అయితే తాజాగా ఎలాంటి బ్రాసరీలు, బ్రెస్ట్ లిఫ్ట్‌లతో పని లేకుండా, రొమ్ములు కిందకు జారే వీలు లేకుండా, వాటికి పట్టును అందించే ఇంటర్నల్ బ్రా సర్జరీలను వైద్యులు కనుగొన్నారు. పుష్ అప్ బ్రాలను తలపించే ఈ సర్జరీల్లో రొమ్ముల అడుగు భాగంలో మెష్‌ను అమరుస్తారు. పాలీ 4 హైడ్రాక్సీబ్యుటిరేట్ అనే సింథటిక్ పదార్థంతో తయారయ్యే మెష్, కాలక్రమేణా శరీరంలో కలిసిపోయే స్వభావాన్ని కలిగి ఉండడం విశేషం. ఇలా కరిగిపోయేలోపు, ఛాతీ గోడలో ఆరోగ్యకరమైన



కణజాలంవృద్ధి చెంది, మెష్ స్థానాన్ని భర్తీ చేయడంతో పాటు రొమ్ములకు సహజసిద్ధ ఆసరాను అందిస్తాయి. దాంతో రొమ్ములు కిందకు జారిపోకుండా ఉంటాయి. ఇంటర్నల్ బ్రా సర్జరీల కోసం వైద్యులు పందులు లేదా మృత కళేబరాలకు చెందిన సజీవ కణజాలం నుంచి 'అసెల్యులర్ డెర్మల్ మేట్రిక్స్'ను సేకరించి, రసాయనాలతో శుద్ధి చేసి రొమ్ముల అడుగు భాగంలో అమరుస్తూ ఉంటారు. అయితే వీటిలో ఏ సర్జరీ చేయించుకున్నప్పటికీ, సర్జరీ తర్వాత బ్రాసరీలను వాడవలసిన అవసరం ఉండదని కొందరు వైద్యులు అంటుంటే, రొమ్ముల మీద గురుత్వాకర్షణ ప్రభావం ఉంటూనే ఉంటుంది కాబట్టి సర్జరీ తర్వాత కూడా తప్పనిసరిగా బ్రాసరీలను వాడుకోవాలనీ ఇంకొందరు వైద్యులు చెప్తున్నారు. ఏది ఏమైనప్పటికీ, దీర్ఘకాల ఫలితాలను పరిశీలించిన తర్వాతే, ఇలాంటి సర్జరీలు మహిళలు ఎంచుకోవడం శ్రేయస్కరం.

ఆయుర్వేదం



వీటిని ఆపకూడదు

శరీర సహజసిద్ధ కోరికలను అణచుకోవడం వల్ల, వ్యాధులు దరి చేరతాయని అయుర్వేదం నమ్ముతోంది. కాబట్టి ఈ కింది శరీర జీవక్రియలు, స్వభావాలను కట్టడి చేయవలసిన అవసరం లేదని ఆయుర్వేదం పేర్కొంటోంది.

- **ఆవలింత:** నలుగురిలో ఉన్నప్పుడు ఆవలించడానికి సంశయిస్తూ ఉంటాం. కానీ ఆవులింతలను ఆపుకోవడం వల్ల, చెవులు, కళ్లు, ముక్కు, గొంతు సంబంధ రుగ్మతలు దరి చేరతాయి.
- **తుమ్ములు:** తుమ్ములను బలవంతంగా ఆపుకోవడం వల్ల దగ్గు, ఎక్కిళ్లు, ఆకలి మందగించడం, ఛాతీలో నొప్పి వేధిస్తాయి.
- **మలవిసర్జన:** దీన్ని ఆపుకుంటే, తలనొప్పి, అజీర్తి, పొట్టలో నొప్పి, వాయువులు వేధిస్తాయి.
- **మూత్రవిసర్జన:** ఎక్కువ సమయం పాటు ఆపుకోవడం వల్ల, మూత్రవిసర్జన కష్టం కావచ్చు. మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు తలెత్తవచ్చు.
- **కన్నీళ్లు:** అజీర్తి సమస్యలు, మానసిక సమస్యలు, ఛాతీలో నొప్పి మొదలవుతాయి.
- **ఆకలి, దప్పిక:** పోషకాహార లోపం, డీహైడ్రేషన్.

అలాగే ఎలాగైతే కోరికలను కట్టడి చేయడం వల్ల అనారోగ్యాలు వేధిస్తాయో, మితిమీరిన కోరికలకు కళ్లెం వేయకపోవడం వల్ల కూడా కొన్ని ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కాబట్టి అతి అనర్థదాయకమనే విషయాన్ని గుర్తు పెట్టుకుని అసహజంగా వేధించే కోరికల మీద కన్నేసి ఉంచి, అప్రమత్తంగా వ్యవహరిస్తూ, అవసరాన్ని బట్టి వైద్య సహాయం తీసుకోవాలి.

కేన్సర్ కేర్

కేన్సర్ ముప్పు తప్పాలంటే..

భారతదేశం ప్రపంచ మధుమేహుల రాజధానిగా మారిందనే విషయం మనందరికీ తెలిసిందే! తాజాగా మన దేశం కేన్సర్, అధిక రక్తపోటు, హృద్రోగాలు, మానసిక వ్యాధుల క్యాపిటల్‌గా మారబోతోందనే నివేదికలు కూడా వెలువడుతున్నాయి. కారణాలు, నివారణ మార్గాల గురించి లోతుగా పరిశీలిస్తే.....

2020 నాటికి మన దేశంలో 14 లక్షల మంది ప్రజలు కేన్సర్‌తో బాధపడుతూ ఉన్నారు. 2025 నాటికి ఈ సంఖ్య 15.7 లక్షలకు చేరుకుంటుందని ఒక అంచనా. రొమ్ము, గర్భాశయ ముఖద్వారం కేన్సర్లు భారతీయ మహిళలను వేధిస్తుంటే, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, నోటి కేన్సర్లు పురుషులను బలి తీసుకుంటున్నాయి. తాజా డాటా ప్రకారం, తొలి దశలోనే రొమ్ము కేన్సర్‌ను గుర్తించిన దాదాపు 98 శాతం మంది భారతీయ మహిళలు, ఐదేళ్ల సర్వైవల్ రేటును సాధించగలుగుతున్నారు. దీన్ని బట్టి ముందస్తు స్క్రీనింగ్, పర్యవేక్షణల ప్రాధాన్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

కేన్సర్ వృద్ధి ఎందుకు?

సాధారణ కణాలు బహుళ దశ ప్రక్రియలో భాగంగా కణితి కణాలుగా పరిణామం వల్ల కేన్సర్ అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రక్రియలో భాగంగా కేన్సర్ ముందరి స్థితి నుంచి మాలిగ్నెన్సీగా కణ పరిణామం జరుగుతుంది. అయితే ఇలా ఆరోగ్యకరమైన కణాలు కేన్సర్ కణాలుగా మారడానికి కారణాలు, వ్యక్తుల జన్యు మేకప్‌తో పాటు మూడు రకాల బాహ్య అంశాలు దోహదపడుతూ ఉంటాయి. అవేంటంటే...

- అల్ట్రావయొలెట్, అయొనైజింగ్ రేడియేషన్ లాంటి భౌతిక కేన్సర్ కారకాలు
- యాస్‌బెస్టాస్, పొగాకు, మద్యం, అఫ్లోటాక్సిన్ (ఆహార కలుషితం), ఆర్సెనిక్ (నీటి కలుషితం) లాంటి రసాయనిక కేన్సర్ కారకాలు
- నిర్దిష్ట వైరస్‌లు, బ్యాక్టీరియా లేదా పరాన్న జీవుల వల్ల సోకే ఇన్‌ఫెక్షన్లు లాంటి జీవసంబంధ కేన్సర్ కారకాలు



నియంత్రణ మన చేతుల్లోనే....

ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేన్సర్ సోకే అవకాశాలను నియంత్రించే కొన్ని ముందు జాగ్రత్తలను సూచిస్తోంది. అవేంటంటే...

- ధూమపానానికి దూరంగా ఉండాలి
- మద్యం మానేయాలి లేదా తగ్గించాలి
- హెచ్‌పివి (హ్యూమన్ పాపిలోమా వైరస్), హెపటైటిస్ బి టీకాలు వేయించుకోవాలి
- అతినీలలోహిత రేడియేషన్‌కు దూరంగా ఉండాలి.
- డయాగ్నొస్టిక్ సెంటర్లలో, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో సురక్షితమైన, సరైన రేడియేషన్‌ను ఉపయోగించాలి
- అయొనైజింగ్ రేడియేషన్‌కు దూరంగా ఉండాలి
- బయటి గాలి కాలుష్యం, లోపలి గాలి కాలుష్యాలకు దూరంగా ఉండాలి. మరీ ముఖ్యంగా ఇళ్లు, స్కూళ్లు, ఆఫీసుల్లో ర్యాడాన్ వాయువుతో పాటు, యురేనియం సహజసిద్ధ క్షయం కారణంగా ఉత్పత్తయ్యే అణుధార్మిక వాయువులకు బహిర్గతం కాకుండా చూసుకోవాలి.

కొవ్వును కరిగించాలి

ఒకరి నుంచి మరొకరికి సంక్రమించని వ్యాధుల్లో ఒకటైన ఒబేసిటీ తీవ్రత పెరిగింది. అనారోగ్యకరమైన నడుము, పిరుదులు, పొత్తికడుపు కొవ్వుల నిష్పత్తి ఎక్కువ శాతం మందిలో కనిపిస్తోంది. 90 శాతం మంది మహిళలు, 80 శాతం మంది పురుషులు సూచించిన నడుము, పిరుదుల నిష్పత్తిని మించి పోయి అధిక బరువుతో బాధపడుతున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఫలితంగా మరీ ముఖ్యంగా యువతలో అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్లు పెరిగిపోతున్నాయి. మన దేశంలోని 66 శాతం జనాభా ప్రీ హైపర్‌టెన్సివ్ స్థితితో బాధపడుతున్నట్టు, ప్రతి ముగ్గురిలో ఒకరు ప్రీడయాబెటిస్ స్థితికి చేరుకుంటున్నట్టు, 45 ఏళ్ల కంటే తక్కువ వయసులో ఉన్నవాళ్లలో 20 శాతం మంది ఇప్పటికే ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్నట్టు నివేదికల్లో వెల్లడైంది.

ఈ నియమాలు పాటించాలి

- ప్రాసెస్ చేసిన పదార్థాలు తినడం మానేయాలి
- కొవ్వులు, తీపి పరిమితం చేయాలి
- క్రమం తప్పకుండా వారంలో కనీసం ఐదు రోజుల పాటు 40 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి
- జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- కృత్రిమ రంగులు, నిల్వ పదార్థాలు జోడించిన పదార్థాలకు దూరంగా ఉండాలి
- కుటుంబంలో కేన్సర్ ఉంటే, ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి
- ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకుని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కొనసాగించాలి

హెల్త్ వెల్త్



కొబ్బరి పువ్వు తింటున్నారా?

కొబ్బరి పువ్వు తినడానికి రుచిగా ఉండడమే కాకుండా, ఎన్నో ఆరోగ్యకరమైన పోషకాలను కూడా కలిగి ఉంటుంది. అవేంటంటే...

- కొబ్బరి పువ్వులోని పొటాషియం కొలెస్ట్రాల్ మోతాదును తగ్గించి, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది
- డీహైడ్రేషన్‌కు గురి కాకుండా శరీరాన్ని చల్లబరుస్తుంది
- దీన్లో విలువైన విటమిన్లు, ఖనిజ లవణాలు ఉంటాయి. కాబట్టి రోగనిరోధకశక్తి పెరుగుతుంది
- దీన్లోని యాంటీఆక్సిడెంట్లు ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయి
- దీన్లోని అధిక పీచు జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని వదిలిస్తుంది
- పోషకభరితమైన కొబ్బరిపువ్వు అరటిపండులా తక్షణ శక్తిని కూడా కూడా అందిస్తుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 16 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com


ఘనంగా తమిళ దర్శకుడు
శంకర్ కుమార్తె వివాహం



ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ - ఈశ్వరీ శంకర్‌ల కుమార్తె ఐశ్వర్య వివాహం తరుణ్ కార్తికేయన్‌తో జరిగింది. సోమవారం చెన్నైలో జరిగిన ఈ వివాహ వేడుకలో తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే చలన చిత్ర ప్రముఖులు రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తి, విక్రమ్, విశాల్, అర్జున్, కీర్తి సురేశ్, దర్శకులు భారతీరాజా, మణిరత్నం - సుహాసిని దంపతులు, కె.భాగ్యరాజ్, పి.వాసు, కేఎస్ రవికుమార్, హరి, విష్ణువర్ధన్, విఘ్నేష్ శివన్ - నయనతార దంపతులు, నిర్మాతలు ఆర్బీ చౌదరి, జయంతిలాల్ గడ, ఏఎం రత్నం, దిల్ రాజు, ఐసరి కె.గణేశ్ తదితరులు హాజరయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కలిసి నటించాలని ఎదురుచూస్తున్నా...



'వార్-2' చిత్రంతో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ కోసం ఎన్టీఆర్ ముంబయి వెళ్లారు. తాజాగా, నటి ఊర్వశీ రౌతేలా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తారక్‌తో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకుని.. ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ఎన్టీఆర్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో క్రమశిక్షణ, వినమ్రత, నిజాయితీ, ముక్కుసూటితనం కలిగిన వ్యక్తి. భవిష్యత్తులో ఎన్టీఆర్‌తో కలిసి నటించాలని ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.

పుష్ప 2 కు బాలీవుడ్ దర్శకుడి ప్రశంసలు



'ఇప్పుడే 'పుష్ప 2' టీజర్ చూశా. అద్భుతంగా ఉంది. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటన నాకు బాగా నచ్చింది. ఆ సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'. ఈ మాటలు అన్నది ఎవరో తెలుసా. బాలీవుడ్ దర్శకుడు అనిల్ శర్మ. 'గదర్ 2' చిత్రంతో సూపర్ హిట్ సాధించిన ఈ దర్శకుడు తన ప్రశంసలను కొనసాగిస్తూ 'గత ఏడాది ఆగస్టు 15న నా చిత్రం 'గదర్ 2' విడుదలై మంచి విజయం సాధించింది. ఈ ఏడాది అదే రోజున 'పుష్ప 2' రిలీజ్ అవుతోంది. ఇది కూడా తప్పకుండా హిట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమకు, ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు' అన్నారు.

ఐఫా వేదికపై శ్రీలీల మెరుపులు



చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ రంగప్రవేశం చేసి అనతికాలంలోనే అగ్ర హీరోలతో జతకట్టే స్థాయికి చేరారు నటి శ్రీలీల. 'పెళ్లి సందడి', 'ధమాకా', 'స్కంద' 'గుంటూరు కారం', 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' వంటి చిత్రాలతో వరుసగా సందడి చేసిన ఈ భామ జోరు ఇటీవల బాగా తగ్గింది. నటిగా కంటే మంచి డాన్సర్‌గా ఎక్కువ పేరు తెచ్చుకున్న ఈ నాజూకు భామకు ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చింది. అయితే అది సినిమాలో కాదు. దుబాయ్‌లో సెప్టెంబరులో జరిగే ఐఫా ఉత్సవాలలో డాన్స్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు శ్రీలీల. మంచి డ్యాన్సర్‌గా పేరొందిన ఈ నటి ఐఫా వేదికపై తన మెరుపులతో ప్రేక్షకులను రంజింపచేయనున్నారు. అలాగే ఇటీవలే పెళ్లి చేసుకున్న రకుల్ ప్రీత్‌సింగ్ కూడా తన నృత్యంతో ప్రేక్షకుల మతిపోగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఈ ఇద్దరు భామలు ఐఫా వేదికకు సరికొత్త అందం ఇవ్వనున్నారు. ఈ వేడుకలో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కూడా భాగం కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో.. తెలుగు వేడుకలకి దగ్గుబాటి రానా ..మిగతా విభాగాలకు అకుల్ బాలాజీ, విజయ్ రాఘవేంద్ర వాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు.

క్రికెట్‌లో సెంచరీ కొడితే ఆ ఆటగాడికి చెప్పలేనంత క్రేజ్.. ఫ్యాన్స్, మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేస్తాయి. అలాగే ఓ సినిమా రూ. వంద కోట్లు కలెక్ట్ చేస్తే ఆ చిత్ర బృందానికి వచ్చే కిక్కే వేరు. క్రికెట్‌లో ఆటగాడు సెంచరీ కొట్టాలంటే అది అతని ఒక్కడితోనే అయ్యే పని. కానీ సినిమా విషయం అలా కాదు. అది రూ.. వంద కోట్ల మైలురాయి చేరాలంటే దాని వెనుక చిత్ర బృందం కఠోర శ్రమ దాగి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ గడిచిన వంద రోజుల్లో ఈ డ్రీమ్ టార్గెట్‌ను అందుకున్న దక్షిణాది సినిమాల వివరాలు ఇవీ.



100 రోజులు... రూ. వంద కోట్లు

కలెక్షన్ల సునామీ 'హను-మాన్'

కలెక్షన్ల సునామీ సృష్టించాలంటే పెద్ద హీరోల చిత్రాలే అయ్యుండాలనేది తెలుగులో ట్రేడ్ వర్గాల నమ్మకం. అందుకోసమే ఓ సినిమా రూ. వంద కోట్లు సాధించడం కోసం ఏవేవో లెక్కలు వేసుకుంటూ ఉంటారు మేకర్స్ కానీ ఒక్కసారిగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ..టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వంద కోట్లు సాధించాలంటే భారీ తారాగణం, క్రేజీ కాంబినేషన్స్ అవసరం లేదని, కంటెంట్ బలంగా ఉండాలని నిరూపించిన సినిమా 'హను-మాన్'. ఎటువంటి స్టార్ కాస్టింగ్ లేకుండా కేవలం రూ. 40 బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 330 కోట్లు కలెక్ట్ చేసి పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా సత్తా చాటింది. ఒక్క హిట్‌తో ఎన్నో రికార్డ్స్‌తో పాటు అనేక టాలీవుడ్ సెంటిమెంట్స్‌ను కూడా బ్రేక్ చేసింది. తేజ సజ్జా, అమృత అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకుడు. అతనికి సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది మొదటి చిత్రం. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం వస్తోంది. ఇందులో



హనుమంతుడి, రాముడి పాత్రలకు స్టార్ హీరోలను ఎంచుకుంటామని చిత్ర బృందం ప్రకటించింది. ఆ నటుల పేర్లలో మెగాస్టార్ చిరంజీవి, మహేశ్‌బాబు పేర్లు కూడా వినిపించడం విశేషం. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా మరెన్ని రికార్డులు తిరగరాస్తుందో చూడాలి.


ఫ్యాన్స్‌ను ఖుషీ చేసిన కాంబో

మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'అతడు'. ఇప్పటికీ ఎవరూ ఈ చిత్రం చేసిన మ్యాజిక్‌ను మర్చిపోలేదు. ఆ తర్వాత వీరి కలయికలో వచ్చిన 'ఖలేజా' అంతగా ఆకట్టుకోకపోయినా..సరికొత్త మహేశ్‌బాబును ప్రేక్షకులకు పరిచయం చేసింది. దాదాపు 15 ఏళ్ల విరామం తర్వాత వీరి కలయికలో వచ్చిన మూడో చిత్రం 'గుంటూరు కారం'. భారీ బడ్జెట్‌తో సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర రూ. 171 కోట్లు కలెక్ట్ చేసింది. మహేశ్, త్రివిక్రమ్ కాంబో నుంచి ఎటువంటి ఎంటర్టైన్‌మెంట్‌ను ఆశిస్తారో సరిగ్గా అలాంటి వినోదాన్నే పంచిన ఈ చిత్రం, మహేశ్ అభిమానులను ఖుషీ చేసింది.



సీక్వెల్‌తో టిల్లు మ్యాజిక్

'డీజే టిల్లు'గా సిద్ధు జొన్నలగడ్డ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందీ చిత్రం. రిలీజై రెండేళ్లయినా ఇప్పటికీ ఈ చిత్రంలోని డైలాగ్స్, పాటలు వినిపిస్తూనే ఉన్నాయి. అలా ఎంటర్టైన్‌మెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిల్చిపోయింది టిల్లు పాత్ర. 'అట్లుందది మనతోని' అని మొదటి పార్ట్ అందించిన వినోదానికి కొనసాగింపుగా వచ్చిన రెండో భాగం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు మార్క్ డైలాగ్స్ మేనరిజమ్స్‌తో పాటు అనుపమ గ్లామర్ ఈ సినిమాకు స్పెషల్ అస్సెట్‌గా నిలిచాయి. రీసెంట్‌గా విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే రూ. వంద కోట్ల కలెక్షన్‌ను సాధించిందని ట్రేడ్ పండితులు అంటున్నారు.




చరిత్ర సృష్టించిన 'మంజుమ్మెల్ బాయ్స్'

ఇక మలయాళ చిత్రాల విషయానికి వస్తే.. అక్కడి లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద 200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచి సరికొత్త చరిత్ర సృష్టించింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. విమర్శకుల ప్రశంసలతో పాటు ఇండస్ట్రీ ప్రముఖుల మనసులనూ ఈ చిత్రం గెలుచుకుంది. ఇటీవలే ఈ చిత్రం తెలుగు డబ్బింగ్ విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది.



'ప్రేమలు'

దిగ్గజ దర్శకుడు రాజమౌళి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన గిరీశ్ ఏ డి 'ప్రేమలు' చిత్రాన్ని తెరకెక్కించారు. మలయాళం బాక్సాఫీస్ దగ్గర రొమాంటిక్ కామెడీగా విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్ టాక్‌ను తెచ్చుకుని దాదాపు రూ. 130 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా కథలోని కీలక భాగం హైదరాబాద్‌లో జరగడంతో ఈ సినిమాను తెలుగులోనూ డబ్ చేశారు. రాజమౌళి తనయుడు ఎస్ ఎస్ కార్తికేయ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహించారు. ఇందులో రీనూ రాయ్ పాత్రలో నటించిన నటి మమిత బైజు ఓవర్‌నైట్ స్టార్‌గా.. కుర్రకారు లేటెస్ట్ క్రష్‌గా మారింది. తెలుగు నిర్మాతల దృష్టి ఆమెపై పడింది.



సర్వైవల్ థ్రిల్లర్‌కు కాసుల పంట

పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'ది గోట్ లైఫ్: ఆడు జీవితం'. బ్లెస్సీ దర్శకత్వం వహించారు. 2008లో మలయాళం బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన రచయిత బెన్యమిన్ 'ఆడుజీవితం' పుస్తకం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 130 కోట్లను రాబట్టింది.

'కెప్టెన్ మిల్లర్' హవా...



తమిళంలో కూడా రూ. వంద కోట్లు సాధించిన చిత్రం ఒకటి ఉంది. అది కెప్టెన్ మిల్లర్. సినిమా సినిమాకు తను ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యం ప్రదర్శించే నటుడు ధనుష్ నటించిన లేటెస్ట్ చిత్రం ఇది. సంక్రాంతికి తమిళనాట విడుదలైన ఈ చిత్రం రూ. 104 కోట్లు కలెక్ట్ చేసింది. అరుణ్ మాథేశ్వరన్ ఈ పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌కు దర్శకత్వం వహించారు. 1930లో బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన ఓ తెగకు నాయకుడిగా ధనుశ్ ఇందులో నటించారు.

నవ్వించడానికి సిద్ధం



'అల్లరి' నరేశ్ తన తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'తో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలక నిర్మించారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్‌ను మే 3న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను విడుదల చేస్తోంది. చాలా రోజుల తర్వాత మళ్లీ నరేశ్ పూర్తి స్థాయిలో ఫన్ క్యారెక్టర్ పోషించడంతో ఈ సినిమా కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు రచన: అబ్బూరి రవి, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: సూర్య, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి.

తెలుగులో తొలిసారి!



తెలుగులో సెటైరికల్ ఫిల్మ్స్ కొన్ని వచ్చాయి కానీ పొలిటికల్ సెటైరికల్ ఫిల్మ్స్ తక్కువ అనే చెప్పాలి. అందుకే ఈ తరహా కాన్సెప్ట్ ఎన్నుకొని ప్రేక్షకులను నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి డైలాగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఒక ఓటుకి ఇంత అని డబ్బు నిర్ణయిస్తుంటారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటరే తన రేటుని నిర్ణయించడం విశేషం. ఇటువంటి కాన్సెప్ట్ తెలుగులో రావడం ఇదే తొలిసారి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ ఉంది. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో సాయికుమార్ ముఖ్య పాత్ర పోషించారు. వినయ్, అరుణ్, దీప్తి వర్మ ఇతర ముఖ్య తారాగణం. తాడిపత్రి నేపథ్యంగా చిత్ర కథ ఉంటుందనీ, త్వరలో సరదాగా ఉండే టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫూస్, ఛాయాగ్రహణం: నాని ఐనవల్లి, నిర్మాతలు: యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి.

ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం



'బిగ్ బాస్' ఫేం అర్జున్ అంబటి హీరోగా, కిశోరి ధాత్రిక్ హీరోయిన్‌గా నటించిన 'తెప్ప సముద్రం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సతీశ్ రాపోలు దర్శకుడు. నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మాత. ఆదివారం రాత్రి ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి సినిమాలోని మొదటి పాటను విడుదల చేశారు. ట్రైలర్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ 'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలంటే ఎందరో కష్టపడాలి. నేను చిరంజీవిగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది.' అన్నారు. అర్జున్ అంబటి మాట్లాడుతూ 'చిన్న సినిమా అనగానే నిర్మాతకు, దర్శకుడికి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మా నాన్న, పెద నాన్న డిస్ట్రిబ్యూటర్స్ కాబట్టి ఆ వేదన నాకు తెలుసు. ప్రతి ఒక్కరూ చిన్న సినిమాను బతికించాలని కోరుతున్నా. ఈ సినిమా 90 శాతం షూటింగ్ పోచంపల్లిలో జరిగింది' అని చెప్పారు. 'తెప్ప సముద్రంలో చిన్న పిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని ప్రత్యేక అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. అవి థియేటర్‌లో చూస్తేనే బాగుంటుంది. ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం' అని దర్శకుడు సతీశ్ చెప్పారు.


బిజినెస్

హైదరాబాద్ ● మంగళవారం 16 ఏప్రిల్ 2024

మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా

బ్రిక్స్, జీ-20 దేశాలతో పోల్చినా భారత్ అత్యంత పేద దేశం

మనది పేద దేశమే



వడ్డీ రేట్లు తగ్గించాలని అప్పట్లో ఆర్‌బీఐపై ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం ఒత్తిడి

కేంద్ర బ్యాంక్ స్వయం ప్రతిపత్తి మేడిపండే.. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

హైదరాబాద్/న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2029 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, మనం సంబరపడి పోవాల్సిన అవసరం లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు స్పష్టం చేశారు. అప్పటికీ మన దేశం పేద దేశంగానే ఉంటుందన్నారు. తన తాజా పుస్తకం 'జస్ట్ ఏ మెర్సినరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్ విడుదల సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. సౌదీ అరేబియా సంపన్న దేశంగా మారినా.. అభివృద్ధి చెందిన దేశంగా మారని విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

'భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం సాధ్యమని నేను కూడా భావిస్తున్నా. అయితే అది సంబరాలు జరుపుకోవాల్సిన సమయం కాదు. ఎందుకంటే మన జనాభా 140 కోట్లు. మనం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి జనాభా కూడా ఒక కారణం. అయితే మనం అప్పటికీ పేద దేశంగానే ఉంటామనే విషయాన్ని మర్చిపోకూడదు' అని అన్నారు.

అభివృద్ధి ఫలాలు అందాలి..

దేశ అభివృద్ధి ఫలాలు అందరికీ అందినప్పుడే ఆ అభివృద్ధికి సార్థకత ఉంటుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం 4 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. అయినా తలసరి ఆదాయపరంగా చూస్తే మన దేశం ప్రపంచంలో 139వ స్థానంలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. బ్రిక్స్, జీ-20 దేశాలతో పోల్చినా భారత్ ఇప్పటికీ అత్యంత పేద దేశమన్నారు.

సమన్యాయం, బలమైన ప్రభుత్వం, జవాబుదారీతనం, స్వయం ప్రతిపత్తి ఉన్న సంస్థలతోనే మన దేశం ప్రధాని మోదీ ఆశిస్తున్న విధంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని సుబ్బారావు స్పష్టం చేశారు.

యూపీఏ హయాంలో ఒత్తిళ్లు నిజమే..

యూపీఏ హయాంలోనూ ఆర్‌బీఐపై ఒత్తిళ్లు వచ్చాయని సుబ్బారావు తన పుస్తకంలో వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ బాగుందని ప్రజల్లో సెంటిమెంట్ పెంచుకునేందుకు అప్పట్లో కేంద్ర ఆర్థిక మంత్రులుగా పని చేసిన ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం వడ్డీ రేట్లు తగ్గించి, వృద్ధి రేటు బాగుందని చెప్పాలని తమపై ఒత్తిళ్లు తెచ్చినట్టు సుబ్బారావు వెల్లడించారు. ఆయన తన తాజా పుస్తకంలో ఈ విషయం పేర్కొన్నారు. ఆర్‌బీఐ స్వయం ప్రతిపత్తి ప్రాముఖ్యత పైనా ఆనాటి ప్రభుత్వ పెద్దలకు పెద్దగా అవగాహన లేదని సుబ్బారావు స్పష్టం చేశారు. లేమన్ బ్రదర్స్ దివాలాకు కొద్ది రోజుల ముందు 2008 సెప్టెంబరు 5న ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించక ముందు సుబ్బారావు 2007-08లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు.

ఇద్దరివీ భిన్న వైఖరులు..

ఆర్‌బీఐపై ఒత్తిడి తేవడంలో ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం పద్ధతులు వేర్వేరుగా ఉండేవని సుబ్బారావు తన పుస్తకంలో వెల్లడించారు. ప్రణబ్ ముఖర్జీ.. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల ద్వారా తన వాదన వినిపిస్తే, చిదంబరం.. ఒక లాయర్‌లా తనతో వాదించడంతో పాటు విలేకరుల సమావేశాల ద్వారా తన వైఖరి వెల్లడించేవారని తెలిపారు. ఒక దశలో అప్పటి ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరవింద్ మాయారామ్ తనతో జరిగిన భేటీలో 'ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు ఆయా ప్రభుత్వ కనుసన్నల్లో పని చేస్తున్నాయి. మన దేశంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది' అని తన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సుబ్బారావు వెల్లడించారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తన హయాంలో ఆర్‌బీఐ పూర్తి స్వయం ప్రతిపత్తితోనే పని చేసిందన్నారు. వృద్ధి రేటు, రిటైల్ ద్రవ్యోల్బణంపై అంచనాలు తప్పితే ఆర్‌బీఐ విశ్వసనీయత కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కేంద్ర బ్యాంకులపై ప్రభుత్వాల ఒత్తిళ్లు భారత్‌కే పరిమితం కాదని, సంపన్న దేశాల్లోనూ ఉంటాయని తెలిపారు.

అంబుజా సిమెంట్స్ చేతికి మై హోమ్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్

డీల్ విలువ రూ.414 కోట్లు

న్యూఢిల్లీ: తమిళనాడు, కేరళ తీర ప్రాంతాల సిమెంట్ మార్కెట్లో అదానీ గ్రూప్ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా తమిళనాడులోని ట్యుటికోరిన్ రేవుకు సమీపంలో ఉన్న మై హోమ్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను రూ.413.75 కోట్లకు కొనుగోలు చేసింది. అదానీ గ్రూప్ నిర్వహణలోని అంబుజా సిమెంట్స్ ద్వారా ఈ కొనుగోలు ఒప్పందం జరిగింది. దీంతో 15 లక్షల టన్నుల వార్షిక సిమెంట్ గ్రైండింగ్ ఉత్పత్తి సామర్థ్యం అదానీ గ్రూప్ చేతికి వచ్చినట్టయింది. ఇందుకు అవసరమైన నిధులను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని అంబుజా సిమెంట్స్ తెలిపింది. మైహోమ్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌తో పాటు ఈ ప్లాంట్ ఉద్యోగులు, డీలర్ల నెట్‌వర్క్ కూడా అదానీ గ్రూప్ పరం కానున్నాయి.

పీఎఫ్‌సీ నుంచి వేదాంతకు రూ.3,918 కోట్ల రుణం

న్యూఢిల్లీ: అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ కంపెనీకి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.3,918 కోట్ల టర్మ్ లోన్ లభించింది. ఈ రుణాన్ని వేదాంత 11 ఏళ్లలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణాన్ని ఆంధ్రప్రదేశ్, నెల్లూరులోని 1,000 మెగావాట్ల సామర్థ్యం గల మీనాక్షీ ఎనర్జీ లిమిటెడ్ థర్మల్ విద్యుత్ కేంద్రం, చత్తీస్‌గఢ్‌లోని 1,200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ల పునరుద్ధరణ కోసం వినియోగిస్తారు. దివాలా ప్రక్రియలో ఉన్న ఈ రెండు కంపెనీలను వేదాంత గ్రూప్ గత ఏడాది కొనుగోలు చేసింది.

ఎగుమతుల్లో క్షీణత

న్యూఢిల్లీ: భారత వస్తు సేవల ఎగుమతులు మార్చి నెలలో 4,168 కోట్ల డాలర్లకు దిగి వచ్చాయి. కాగా మార్చి 31వ తేదీతో ముగిసిన అర్థిక సంవత్సరంలో ఎగుమతులు 3.11% దిగజారి 43,706 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా భౌగోళిక, రాజకీయ సంఘటనలు ఎగుమతులపై ప్రభావం చూపాయి. దిగుమతులు కూడా మార్చి నెలలో 5.98% తగ్గి 5,728 కోట్ల డాలర్లకు దిగజారగా ఏడాది మొత్తం మీద 5.41% క్షీణించి 67,724 కోట్ల డాలర్లకు దిగజారాయి. మార్చిలో వాణిజ్య లోటు 156 కోట్ల డాలర్లుగా నమోదు కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి 24,017 కోట్ల డాలర్లకు చేరింది. తాము విదేశీ వాణిజ్యం తాజా పరిస్థితిని పరిశీలిస్తున్నామని, అవసరమైన సమయంలో తగు చర్య తీసుకుంటామని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందు వల్ల మరింత వివరణ ఇవ్వలేకపోతున్నామని తెలిపింది. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువులు; ఔషధాలు, ఫార్మాస్యూటికల్స్; ఇంజనీరింగ్ వస్తువులు, ఇనుప ఖనిజం, కాటన్ యార్న్, చేనేత ఉత్పత్తులు, సిరామిక్, గ్లాస్ వేర్ ఉత్పత్తులు ఎగుమతుల రంగానికి మద్దతు ఇచ్చాయి.

ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ/ముంబై: ఓలా ఎలక్ట్రిక్ తమ ఎంట్రీ స్థాయి విద్యుత్ స్కూటర్ ఎస్1ఎక్స్ ధర వేరియెంట్‌ను బట్టి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు తగ్గించింది. ఈ ధరల తగ్గింపు తక్షణం వర్తిస్తుంది. దీంతో ఇది సాంప్రదాయిక స్కూటర్ల ధరకు చేరువలో అందుబాటులోకి వచ్చింది. కంపెనీ ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.79,999 నుంచి రూ.1,09,999 ధర శ్రేణిలో కొత్త ఎస్1ఎక్స్ స్కూటర్‌ను మూడు వేరియెంట్లలో విడుదల చేసింది. వచ్చే వారం నుంచి కొత్త ధరకు ఈ స్కూటర్లు అందుబాటులోకి వస్తాయి. తాజా నిర్ణయం ప్రకారం 4 కిలోవాట్ బ్యాటరీ గల ఎస్1ఎక్స్ స్కూటర్ రూ.99,999కే అందుబాటులో ఉంటుంది. గతంలో ప్రకటించిన దీని ధర రూ.1,09,999. అలాగే 3 కిలోవాట్ల సామర్థ్య గల ఎస్1ఎక్స్ వేరియెంట్ ధర రూ.89,999 నుంచి రూ.84,999కి తగ్గుతుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,150 ▲	67,050 ▲	89,500 ▲
ముంబై	72,813 ▼	66,697 ▼	83,452 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 16వ తేదీ

హైదరాబాద్	400	విజయవాడ	404
చిత్తూరు	483	విశాఖపట్నం	419
గోదావరి	404	వరంగల్	402
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126	గోదావరి	127
వరంగల్	126	విజయవాడ	127
కరీంనగర్	126	గుంటూరు	127
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	127
కర్నూలు	126	చిత్తూరు	129
విశాఖపట్నం	114		

6-9 నెలల్లో 5జీ సర్వీసులు : వీఐ

న్యూఢిల్లీ: వచ్చే 6 నుంచి 9 నెలల కాలపరిమితిలో 5 జీ సేవలు అందుబాటులోకి తెస్తామని వొడాఫోన్ ఐడియా (వీఐ) ప్రకటించింది. ఈ వారంలోనే రూ.18,000 కోట్ల భారీ ఎఫ్‌పీఓకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అక్షయ ముంద్రా మాట్లాడుతూ.. తాము ఎఫ్‌పీఓకు రావడానికి ప్రధాన కారణం కూడా 5జీ సర్వీసులు ప్రవేశపెట్టడమేనని చెప్పారు. రాబోయే 24 నుంచి 30 నెలల మధ్య కాలంలో తమ ఆదాయ బేస్‌లో 40 శాతం వాటాకు 5జీ విస్తరిస్తుందన్నారు. గురువారం నుంచి మార్కెట్లోకి వస్తున్న ఇష్యూలో ధర శ్రేణిని రూ.10-11గా వీఐ ప్రకటించింది.

3 నెలల గరిష్ఠానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: కూరగాయలు, బంగారం, ఉల్లి, క్రూడాయిల్ ధరల పెరుగుదలతో దేశంలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) మార్చిలో మూడు నెలల గరిష్ఠ స్థాయి 0.53 శాతంగా నమోదైంది. ఫిబ్రవరి నెలలో ఇది 0.20 శాతం ఉండగా గత మార్చిలో 1.41 శాతం ఉంది. ఇటీవలే ముగిసిన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరు నెలల మధ్య కాలంలో డబ్ల్యూపీఐ నెగిటివ్ ధోరణిలో ఉండి నవంబరు నుంచి పెరుగుతోంది.

మార్కెట్లపై పశ్చిమాసియా దెబ్బ

- సెన్సెక్స్ 845 పాయింట్లు డౌన్
- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: పశ్చిమాసియా సంక్షోభం మరోసారి తీవ్ర రూపం దాల్చడంతో సోమవారం ఈక్విటీ మార్కెట్‌ను భారీ నష్టాల బాటలో నడిపింది. ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు కూడా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. విదేశీ నిధులు తరలిపోవడం, అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాలకు మించి ఉండడం కూడా సెంటిమెంట్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 845.12 పాయింట్ల నష్టంతో రెండు వారాల కనిష్ఠ స్థాయి 73,399.78 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 929.74 పాయింట్లు నష్టపోయి 73,315.16 వరకు దిగజారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 246.90 పాయింట్ల నష్టంతో 22,272.50 వద్ద స్థిరపడింది. సూచీలు నష్టపోవడం ఇది వరుసగా రెండో సెషన్. ఈ రెండు సెషన్లలో సెన్సెక్స్ 1,638 పాయింట్లు, నిఫ్టీ 481 పాయింట్లు నష్టపోయాయి. సోమవారం నాటి భారీ పతనంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.5,18,953.97 కోట్ల మేరకు దిగజారి రూ.3,94,48,097.94 కోట్లకు (4.73 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఐపీఓకి దీపక్ బిల్డర్స్: ఇంజనీరింగ్, నిర్మాణ రంగంలోని దీపక్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ ఐపీఓ జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూలో భాగంగా 1.2 కోట్ల తాజా ఈక్విటీ షేర్లు జారీ చేస్తారు. 24 లక్షల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ విధానంలో విక్రయిస్తారు. ఇష్యూ ద్వారా సేకరించే నిధులు రుణభారం తగ్గించుకోవడంతో పాటు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించుకోనున్నట్టు తెలిపింది.

ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ దూకుడు: కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఒక్కో షేరుపై రూ.118 డివిడెండ్ ఇవ్వడానికి ఆమోదం తెలపడంతో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ షేరు 7.50 శాతం మేర లాభపడింది. ఈ షేరు బీఎస్ఈలో 7.13 శాతం లాభంతో రూ.522.75 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 7.53 శాతం లాభంతో రూ.525 వద్ద ముగిసింది. బీఎస్ఈలో ఇంట్రాడేలో 14.41 శాతం మేరకు దూసుకుపోయి రూ.558.30 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది.

బంగారం మరో రూ.300 అప్: ఢిల్లీ మార్కెట్లో బంగారం ధరల్లో ర్యాలీ కొనసాగుతూనే ఉంది. సోమవారం 10 గ్రాముల బంగారం రూ.300 పెరిగి రూ.73,050 పలికింది. వెండి ధర కూడా రూ.500 పెరిగి కిలో రూ.85,700 పలికింది. అంతర్జాతీయ విపణిలో కామెక్స్‌లో స్పాట్ బంగారం ధర ఔన్సు 12 డాలర్లు పెరిగి 2,355 డాలర్లు పలికింది. వెండి కూడా ఔన్సు 28.25 డాలర్లు పలికింది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం.
కోల్‌కతా X రాజస్థాన్


ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
361 పరుగులు	11 వికెట్లు

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) ఫెర్గూసన్ (బి) టోప్లే 34, హెడ్ (సి) డుప్లెసి (బి) ఫెర్గూసన్ 102, క్లాసెన్ (సి) వైశాఖ్ (బి) ఫెర్గూసన్ 67, మార్‌క్రమ్ (నాటౌట్) 32, సమద్ (నాటౌట్) 37, ఎక్స్‌ట్రాలు: 15; **మొత్తం: 20 ఓవర్లలో 287/3; వికెట్ల పతనం:** 1-108, 2-165, 3-231; **బౌలింగ్:** జాక్స్ 3-0-32-0, టోప్లే 4-0-68-1, యష్ దయాల్ 4-0-51-0, ఫెర్గూసన్ 4-0-52-2, వైశాఖ్ 4-0-64-0, లోమ్రోర్ 1-0-18-0.

బెంగళూరు: కోహ్లీ (బి) మార్కండే 42, డుప్లెసి (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 62, జాక్స్ (రనౌట్) 7, పటీదార్ (సి) నితీశ్ (బి) మార్కండే 9, సౌరవ్ (ఎల్బీ) కమిన్స్ 0, దినేశ్ కార్తీక్ (సి) క్లాసెన్ (బి) నటరాజన్ 83, లోమ్రోర్ (బి) కమిన్స్ 19, రావత్ (నాటౌట్) 25, వైశాఖ్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 14; **మొత్తం: 20 ఓవర్లలో 262/7; వికెట్ల పతనం:** 1-80, 2-100, 3-111, 4-121, 5-122, 6-181, 7-244; **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0, భువనేశ్వర్ 4-0-60-0, షాబాజ్ 1-0-18-0, నటరాజన్ 4-0-47-1, కమిన్స్ 4-0-43-3, మార్కండే 4-0-46-2, ఉనాద్కట్ 2-0-37-0.



సమద్ (10 బంతుల్లో 37 నాటౌట్)

1 ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు నమోదు చేసిన టీమ్‌గా సన్‌రైజర్స్

1 ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు (22) బాదిన జట్టుగా సన్‌రైజర్స్

2 టీ20ల్లో రెండో అత్యధిక స్కోరు (287/3) నమోదు చేసిన సన్‌రైజర్స్. నేపాల్ (314/3) టాప్‌లో ఉంది.

చరిత్ర తిరగరాస్తూ..

ఐపీఎల్ అత్యధిక స్కోరు రికార్డు బద్దలు

సన్‌రైజర్స్ 287/3

హైదరాబాదుడు

'చరిత్ర సృష్టించాలన్నా మేమే.. తిరగరాయాలన్నా మేమే..' అన్నట్టుగా తాజా సీజన్‌లో సన్‌రైజర్స్ చెలరేగుతోంది. మారిన జెర్సీ మహిమో.. కొత్త ఆటగాళ్ల చేరిక మాయో కానీ మైదానంలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది. ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు (277/3) బాది ఇరవై రోజులైనా కాలేదు.. ఈసారి బెంగళూరుపై విరుచుకుపడి ఏకంగా 287 రన్స్‌తో సంచలనం సృష్టించింది. వీర బాదుడుకు పర్యాయపదంగా ట్రావిస్ హెడ్, క్లాసెన్, సమద్ త్రయం విధ్వంసానికి చిన్నస్వామిలో పరుగుల కుంభవృష్టి కురిసింది. బంతి పడిందే ఆలస్యం అందరి చూపూ స్టాండ్స్ వైపే.. వీలైతే స్టేడియంపైన కూడా ఉండేలా బ్యాట్‌తో వీరంగం ఆడారు. అటు ఆర్‌సీబీకి మెరుపు ఆరంభం దక్కినా మిడిలార్డర్ తడబాటుతో.. దినేశ్ కార్తీక్ ఎంత పోరాడినా ఫలితం లేకపోయింది.

హెడ్ మెరుపు శతకం
క్లాసెన్, సమద్ తుఫాన్ ఇన్నింగ్స్
262/7తో పోరాడి ఓడిన బెంగళూరు
దినేశ్ కార్తీక్ శ్రమ వృథా

549 ఈ మ్యాచ్‌లో నమోదైన మొత్తం పరుగులు. ఒక టీ20 మ్యాచ్‌లో ఇన్ని రన్స్ సాధించడం ఇదే తొలిసారి.



దినేశ్ కార్తీక్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 83)

1 చేజింగ్‌లో 250+ పరుగులు చేసిన తొలి ఐపీఎల్ జట్టుగా బెంగళూరు



ట్రావిస్ హెడ్ (41 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్సర్లతో 102)

బెంగళూరు: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్‌లో రికార్డులను బద్దలుకొడుతోంది. అసాధ్యమనుకున్న స్కోర్లను అలవోకగా సాధేస్తూ ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టిస్తోంది. ట్రావిస్ హెడ్ (41 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్సర్లతో 102) మెరుపు శతకానికి క్లాసెన్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 67), అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్) బాదుడు తోడవడంతో ఆకాశమే హద్దుగా చెలరేగింది. అయితే రికార్డు ఛేదనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సైతం పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో సన్‌రైజర్స్ 25 పరుగుల తేడాతో నెగ్గింది. రైజర్స్‌కిది హ్యాట్రిక్ గెలుపు కాగా, ఆర్‌సీబీకి వరుసగా ఐదో ఓటమి. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 287 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. మార్‌క్రమ్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 నాటౌట్), అభిషేక్ (34) ఆకట్టుకున్నారు. ఫెర్గూసన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 20 ఓవర్లలో 7 262/7 స్కోరు చేసింది. దినేశ్ కార్తీక్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 83), డుప్లెసి (28 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 62), విరాట్ (20 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 42) పోరాటం చూపారు. కమిన్స్ 3, మార్కండే 2 వికెట్లు తీశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా హెడ్ నిలిచాడు.

దినేశ్ కార్తీక్ పోరాటం: అతి భారీ ఛేదనలో ఆర్‌సీబీ ఓపెనర్లు డుప్లెసి, విరాట్ జట్టుకు కావాల్సిన విధంగానే ఆడారు. అయితే మధ్యలో వికెట్ల పతనం వీరి లయకు బ్రేక్ వేసింది. ఆ తర్వాత దినేశ్ కార్తీక్ ఎంతగా పోరాడినా లక్ష్యం భారీగా ఉండడంతో ఫలితం లేకపోయింది. రెండో ఓవర్‌లో విరాట్ 4,6తో వేగం పెంచగా, డుప్లెసి తర్వాతి ఓవర్‌లో 4,6,6తో 18 రన్స్ అందించాడు. ఇదే జోరుతో పవర్‌ప్లేలో జట్టు 79 పరుగులు సాధించింది. ఐపీఎల్‌లో ఆర్‌సీబీకిదే అత్యధికం. ఇంతవరకు పోటీలో ఉన్నట్టుగానే కనిపించింది. కానీ ఏడో ఓవర్‌లో విరాట్‌ను మార్కండే బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అంతే.. తర్వాతి మూడు ఓవర్లలోనే విల్ జాక్స్ (7) రనౌట్‌తో పాటు పటీదార్ (9), డుప్లెసి, సౌరవ్ చౌహాన్ (0)ల వికెట్లు కోల్పోవడంతో 122/5 స్కోరుతో జట్టు ఓటమి దిశగా పయనించింది. కానీ, దినేశ్ కార్తీక్ పట్టు వదల్లేదు. 13వ ఓవర్‌లో మహిపాల్ లోమ్రోర్ (19) 6,6.. దినేశ్ 6,4తో 25 పరుగులు వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనూ దినేశ్ 4,4,6,4తో 21 రన్స్ రాబట్టాడు. అటు లోమ్రోర్‌ను కమిన్స్ అవుట్ చేయడమే కాకుండా పరుగులను కట్టడి చేయడంతో రన్‌రేట్ 25కి పైగా పెరిగింది. దినేశ్ 19వ ఓవర్‌లో 6,4 బాది అవుటయ్యాడు. ఇక అప్పటిదాకా నిదానంగా ఆడిన రావత్ (25 నాటౌట్) ఆఖరి ఓవర్‌లో 4 ఫోర్లతో 18 రన్స్ రాబట్టి ఓటమి అంతరాన్ని తగ్గించాడు.

రైజర్స్ బ్యాటర్ల ఊచకోత: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ వాయువేగంతో సాగింది. ఓపెనర్ హెడ్ బాదుడుకు చిన్నస్వామి స్టేడియం మరింత చిన్నదిగా మారినట్టనిపించింది. క్లాసెన్, సమద్ సైతం బ్యాట్లు ఝుళిపించడంతో రికార్డు స్కోరు నమోదైంది. బెంగళూరు బౌలర్లకు ముచ్చెమటలు పట్టిస్తూ ఆరంభంలోనే హెడ్ చెలరేగిన విధానంతో రైజర్స్ అలవోకగా రన్స్ కొల్లగొట్టింది. పవర్‌ప్లేలోనే హెడ్ అర్ధసెంచరీ పూర్తి కాగా జట్టు స్కోరు కూడా 7.1 ఓవర్లోనే 100 పరుగులకు చేరింది. రెండో ఓవర్‌లోనే 20 పరుగులు వచ్చాయి. ఐదో ఓవర్‌లో 6,6,4తో 18 రన్స్. ఆరో ఓవర్‌లో 6,6,4తో 20 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేలో జట్టు 76 పరుగులు చేసింది. ఆ తర్వాత హెడ్ మరింతగా చెలరేగాడు. ఏడో ఓవర్‌లోనే అతను మరోసారి 4,6,6తో 21 రన్స్ అందించాడు. తొమ్మిదో ఓవర్‌లో అభిషేక్‌ను టోప్లే అవుట్ చేసినా.. అప్పటికే 49 బంతుల్లో 108 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. వికెట్ తీసిన ఆనందాన్ని ప్రత్యర్థికి దూరం చేస్తూ మధ్య ఓవర్లలో క్లాసెన్ రెచ్చిపోయాడు. అటు హెడ్ తన బాదుడుతో 39 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి 13వ ఓవర్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత బాధ్యతను తీసుకున్న క్లాసెన్ భారీ సిక్సర్లతో హోరెత్తించాడు. 17వ ఓవర్‌లో అతడు బాదిన సిక్సర్ ఏకంగా 106మీ. ఎత్తులో వెళ్లి స్టేడియంపైన పడింది. అతడి ధాటికి 15 ఓవర్లలోనే స్కోరు 200 దాటింది. 17వ ఓవర్‌లో క్లాసెన్ నిష్క్రమించగా, మూడో వికెట్‌కు మార్‌క్రమ్‌తో కలిసి 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి మూడు ఓవర్లలోనైనా ఆర్‌సీబీకి ఉపశమనం కలుగలేదు. అబ్దుల్ సమద్ జూలు విదుల్చుతూ 19వ ఓవర్‌లో 4,4,6,6,4తో 25 పరుగులు పిండుకున్నాడు. ఇక ఆఖరి ఓవర్‌లో మార్‌క్రమ్ 4,6.. సమద్ 6తో ఐపీఎల్‌లో రైజర్స్ తమ టాప్ స్కోరును తిరగరాసింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	6	5	1	0	10	0.767
కోల్‌కతా	5	4	1	0	8	1.688
చెన్నై	6	4	2	0	8	0.726
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	6	3	3	0	6	0.038
గుజరాత్	6	3	3	0	6	-0.637
పంజాబ్	6	2	4	0	4	-0.218
ముంబై	6	2	4	0	4	-0.234
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఒలింపిక్ జ్యోతి ప్రజ్వలన నేడు

ఏథెన్స్: మరో 100 రోజుల్లో పారిస్‌లో విశ్వక్రీడా సంరంభానికి తెరలేవనుంది. సంప్రదాయం ప్రకారం విశ్వక్రీడలు పుట్టిన ఒలింపియాలో మంగళవారం జరిగే జ్యోతి ప్రజ్వలనతో మెగా ఈవెంట్‌కు కౌంట్ డౌన్ ఆరంభం కానుంది. ఇక్కడ వెలిగించిన టార్చ్‌ను పారిస్ క్రీడల నిర్వాహకులకు అందజేయనున్నారు. గ్రీస్‌లో 11 రోజులపాటు టార్చ్ రిలేను నిర్వహించిన అనంతరం.. ఈనెల 27న ఒలింపిక్ జ్యోతి పడవలో విశ్వక్రీడల వేదికైన పారిస్‌కు పయనం కానుంది.

పోలీసు కస్టడీలో స్లేటర్



క్వీన్స్‌లాండ్: ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్, వ్యాఖ్యాత మైకేల్ స్లేటర్ చిక్కుల్లో పడ్డాడు. అతడిపై ఏకంగా 19 కేసులు నమోదు కావడంతో స్థానిక పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 12 వరకు గృహహింస, మహిళలను వెంబడించడం, భయభ్రాంతులకు గురిచేయడం, భౌతిక దాడికి దిగడం, దొంగతనాలు.. ఇలా పలురకాల కేసులు 54 ఏళ్ల స్లేటర్‌పై నమోదయ్యాయి. దీంతో గత శుక్రవారమే స్లేటర్‌ను అరెస్ట్ చేశారు. పలుసార్లు కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ బెయిల్ నియమాలను కూడా ఉల్లంఘించాడు. 2004లో స్లేటర్ క్రికెట్ నుంచి తప్పుకొన్నాక కామెంటేటర్‌గా స్థిరపడ్డాడు.

శోభన, సజనకు పిలుపు

బంగ్లాతో టీ20 సిరీస్‌కు భారత మహిళల జట్టు

న్యూఢిల్లీ: ఇటీవల మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాణించిన స్పిన్నర్ ఆశా శోభన, హార్డ్ హిట్టర్ సజన సజీవన్ తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నారు. బంగ్లాదేశ్‌తో ఈనెల 28 నుంచి జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడే భారత మహిళల జట్టును సోమవారం ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా, స్మృతి మంధాన వైస్‌గా వ్యవహరించనుంది. ఏప్రిల్ 28న తొలి టీ20, 30న రెండోది, మే 2న మూడోది, 6న నాలుగోది, ఐదో మ్యాచ్ మే 9న జరుగుతాయి.

బోపన్న చేజారిన 'టాప్'

న్యూఢిల్లీ: టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న డబుల్స్‌లో తన టాప్‌ర్యాంక్‌ను చేజార్చుకున్నాడు. సోమవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో.. బోపన్న తన డబుల్స్ సహచరుడు మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)కు అగ్రస్థానం కోల్పోయాడు. మాథ్యూ నెం.1 ర్యాంక్ దక్కించుకోగా, బోపన్న రెండో స్థానం లో నిలిచాడు. ఇక సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 80వ ర్యాంకుతో కెరీర్‌లో అత్యుత్తమంగా నిలిచాడు.

థాయ్‌లాండ్‌తో పురుషులు

కెనడాతో మహిళల ఢీ

థామస్, ఉబెర్ కప్ షెడ్యూల్

చెంగ్డూ (చైనా): థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్స్ డ్రా సోమవారం విడుదలైంది. టోర్నీ ఈనెల 28 నుంచి మే ఐదు వరకు చెంగ్డూలో జరగనుంది. థామస్, ఉబెర్ కప్‌ల్లోని నాలుగేసి గ్రూపుల నుంచి రెండేసి జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంటాయి.

థామస్ కప్ షెడ్యూల్:
ఏప్రిల్ 27: భారత్ x థాయ్‌లాండ్ (మ. 3.30 నుంచి), **ఏప్రిల్ 29:** భారత్ x ఇంగ్లండ్ (ఉ. 7 నుంచి), **మే 1:** భారత్ x ఇండోనేసియా (సా. 5 నుంచి)

ఉబెర్ కప్: ఏప్రిల్ 27: భారత్ x కెనడా (ఉ.10.30 నుంచి), **ఏప్రిల్ 28:** భారత్ x సింగపూర్ (ఉ. 6 నుంచి), **ఏప్రిల్ 30:** భారత్ x చైనా (ఉ. 7 నుంచి).

రెండో సీడ్‌కు విదిత్ చెక్

క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజ్‌రాతీ అద్భుతంగా పుంజుకొన్నాడు. గత గేమ్‌లో ఓటమి పాలైన అతడు ఈ రౌండ్‌లో రెండో సీడ్ హికారు నకమురాకు షాకిచ్చాడు. ఇద్దరు భారత టీనేజ్ ఆటగాళ్ల ప్రజ్ఞానంద-గుకేష్ మధ్య జరిగిన గేమ్ ఫలితం తేలకుండా ముగిసింది. గుకేష్ (5.5), నెపోమ్నియాచి (5.5) అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రజ్ఞానంద (5) మూడో స్థానంలో నిలిచాడు. గుజరాతీ (4) సంయుక్తంగా నాలుగోస్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో హంపి (4) తన గేమ్‌ను డ్రా చేసుకోగా, వైశాలి (2.5) పరాజయం పాలైంది.



మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్న ఆటోలు

డ్రైవర్లు లేక నిరుపయోగంగా స్వచ్ఛ ఆటోలు

- బీఆర్ఎస్ పాలనలో 300 కోట్లతో 5 వేల ఆటోల కొనుగోలు
- చెత్త సేకరణ కోసం 2020లో మున్సిపాలిటీలకు అందజేత
- డ్రైవర్ల నియామకం లేకపోవటంతో మూలనపడిన ఆటోలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రగతి పేరుతో గత ప్రభుత్వ హయాంలో భారీ ఖర్చుతో కొనుగోలు చేసిన స్వచ్ఛ ఆటోల్లో వందలాది ఆటోలు డ్రైవర్లు లేక కొన్నేళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని పలు మున్సిపాలిటీలలో ప్రజలు కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, వివిధ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ కోసం తెలంగాణ స్టేట్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ద్వారా ఆటోలను, చెత్త వేయటానికి అవసరమైన డబ్బాలను (ట్విన్ బిన్స్) కొనుగోలు చేశారు. ఒక్కో ఆటోను రూ.6 లక్షల చొప్పున, ట్విన్ బిన్స్‌ను రూ.120 లెక్కన కొనుగోలు చేశారు. ఆటోల కోసం సుమారు రూ.300 కోట్లు, ట్విన్ బిన్స్ కోసం మరో రూ.150 కోట్లు ఖర్చు చేశారు. 2020లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ఆటోలను మున్సిపాలిటీలకు అందించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ట్విన్ బిన్స్‌ను లక్షల్లో కొన్నారు. ఆగమేఘాల మీద ఆటోలను కొన్నప్పటికీ వాటిని నడిపేందుకు డ్రైవర్లను నియమించకపోవటంతో పలు మున్సిపాలిటీల్లో చాలా ఆటోలను షెడ్లకే పరిమితం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు మంచిర్యాల జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా వాటి కోసం రూ.10.26 కోట్లతో 171 స్వచ్ఛ ఆటోలు, రూ.1.14 కోట్లతో 95,621 ట్విన్‌బిన్స్ కొనుగోలు చేశారు. అయితే, ఆటోలు నడపటానికి అవసరమైన సిబ్బందిని నియమించకపోవటంతో, కొనుగోలు చేసిన ఆటోలలో కొన్నింటినే వినియోగిస్తూ మిగిలిన వాటిని మూలన పెట్టేశారు. దీని వల్ల రోజువారీగా చెత్తను తరలించలేక కొన్ని వార్డుల్లో వారం రోజులకు ఒకసారి, మరికొన్ని చోట్ల రెండు మూడు రోజులకు ఒకసారి చెత్తను సేకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆటోలు అసలు వినియోగంలో లేని చోట రిక్షాల ద్వారా అరకొరగా చెత్త సేకరణ జరుపుతున్నారు. దీనిపై మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర ఛైర్మన్ భూక్యా రాము నాయక్ స్పందిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సిపాలిటీలలో స్వచ్ఛ ఆటోలను షెడ్లలో పెట్టి నిరుపయోగంగా మార్చారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా డ్రైవర్లను నియమించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

ఆ నీటిని ఎలా పొదుపు చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ లేఖ రాసింది. కాగా, సదరు నీటి కేటాయింపుపై సీడబ్ల్యూసీ అనుమతిస్తే 45 టీఎంసీల నీటితో పాలమూరు డీపీఆర్‌కు మార్గం సుగమం కానుంది. మరోవైపు, సమ్మక్క బ్యారేజీకి (తుపాకులగూడెంకు) సంబంధించి ఛత్తీస్‌గఢ్ ఇవ్వాల్సిన నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ప్రక్రియ ఎక్కడి వరకు వచ్చింది అన్నదానిపై కూడా సీడబ్ల్యూసీ ఆరా తీసింది. ఈ బ్యారేజీ నుంచి దేవాదుల ఎత్తిపోతల పథకానికి 38 టీఎంసీలు, శ్రీరాంసాగర్ రెండో దశకు 47 టీఎంసీల నీటిని తీసుకెళ్లనున్నట్లు తెలంగాణ ప్రతిపాదించింది. అయితే ఎగువన ఉన్న రాష్ట్రాలు తమ వాటా నీటిని వాడుకున్న తర్వాత ఆ మేరకు నీటి లభ్యత ఉందా? లేదా? అనే అంశాలపై సిమ్యులేషన్ స్టడీస్ చేసి, నివేదిక అందించాలని సీడబ్ల్యూసీ కోరింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన 85 టీఎంసీల నీరు తుపాకులగూడెం వద్ద లభ్యత ఉందా అని ఆరా తీసింది. సీతారామ ఎత్తిపోతల పథకం కింద ఒక్కో హెక్టార్‌కు 79.07 క్వింటాళ్ల వడ్లు లేదా 49.42 క్వింటాళ్ల పత్తి లేదా 69.19 క్వింటాళ్ల మొక్కజొన్న పండుతుందని డీపీఆర్‌లో తెలంగాణ పేర్కొనటంపైనా సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. 2022 వ్యవసాయ గణాంకాల ప్రకారం తెలంగాణలో సగటున ఒక హెక్టార్‌కు 33 క్వింటాళ్ల వరి లేదా 5.46 క్వింటాళ్ల పత్తి లేదా 51.78 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి వస్తుందని గుర్తు చేసింది. డీపీఆర్‌లో పేర్కొన్న విధంగా పంటల దిగుబడి ఎలా సాధ్యమో చెప్పాలని, ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖతో ధ్రువీకరించిన పత్రాలు అందించాలని పేర్కొంది.

ఇంటర్, డిగ్రీ దరఖాస్తుల్లో అమ్మాయిలే టాప్

- డిగ్రీకి15,952, జూనియర్ కాలేజీలకు 28,401 అప్లికేషన్లు
- అబ్బాయిల నుంచి నామమాత్రమే

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాల పరిధిలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్షకు అమ్మాయిల నుంచి రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. వారి నుంచి డిగ్రీ ప్రవేశ పరీక్షకు 15,952 దరఖాస్తులు రాగా బీసీ జూనియర్ కళాశాలల ప్రవేశాలకు 28,401 అప్లికేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గురుకుల డిగ్రీ కళాశాల ప్రవేశాలకు అబ్బాయిల నుంచి నామమాత్రంగా 2,604దరఖాస్తులు, జూనియర్ కళాశాలల ప్రవేశాలకు 18,384 అప్లికేషన్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు ఏప్రిల్ 28న పరీక్షను నిర్వహించాలని నిర్ణయించాయి. గురుకులాల పరిధిలో మొత్తం 76 డిగ్రీ కాలేజీలుండగా, వీటిలో అబ్బాయిలకు 5,530, అమ్మాయిలకు 14,810సీట్లు కలిపి మొత్తం 20,340 సీట్లున్నాయి. ఈ సీట్లకుగాను 18,556 అప్లికేషన్లు వచ్చాయి. ఇక బీసీ గురుకులం పరిధిలో ఉన్న 261 జూనియర్ కళాశాలల్లో అబ్బాయిలకు 11,500.. అమ్మాయిలకు 10,300 సీట్లు కలిపి మొత్తం 21,800 సీట్లుండగా 46,785 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అబ్బాయిల నుంచి 18,384దరఖాస్తులు మాత్రమే రాగా, అమ్మాయిల నుంచి అత్యధికంగా 28,401అప్లికేషన్లు వచ్చాయని అధికారులు తెలియజేశారు. విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం దగ్గర నుంచి పుస్తకాలు సహా పలు సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తున్నా.. ఆయా కాలేజీల్లో ఉన్న సీట్ల సామర్థ్యం మేరకూ దరఖాస్తులు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

నైరుతిలో వానలే వానలు!

- ఈ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువే
- సగటున 106% నమోదయ్యే అవకాశం
- వాతావరణ శాఖ తొలిదశ అంచనా

విశాఖపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది రైతులకు భారత వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగానికి ఊతమిచ్చే నైరుతి రుతుపవనాల సీజన్ (జూన్ నుంచి సెప్టెంబరు)లో ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానుందని తెలిపింది. దీర్ఘకాలిక సగటులో 106 శాతం వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. నాలుగు నెలల నైరుతి రుతువనాల సీజన్‌కు సంబంధించి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తొలిదశ దీర్ఘకాలిక అంచనా బులెటిన్‌ను విడుదల చేసింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల దీర్ఘకాలిక సగటు (1971 నుంచి 2020 వరకు 87 సెంటీమీటర్లు)లో 106 శాతం (ఐదు శాతం అటు ఇటుగా) నమోదవుతుందని అంచనా వేసింది. దేశంలో దక్షిణ, మధ్య, పశ్చిమ, ఉత్తర భారతంలో అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని, తూర్పు భారతంలో ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్‌తోపాటు ఈ రాష్ట్రాలకు ఆనుకుని దక్షిణ ఛత్తీస్‌గఢ్, విదర్భ, మధ్యప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం, ఈశాన్య భారతంలో అనేక ప్రాంతాలు, జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురుస్తాయని, రైస్ బెల్ట్‌గా పిలిచే గంగా మైదానంలో వర్షాలు తక్కువగా కురుస్తాయని ఐఎండీ నివేదిక స్పష్టం చేసింది. కాగా.. తాజా నివేదికపై సవరించిన బులెటిన్‌ను వచ్చే నెల చివరి వారంలో విడుదల చేయనుంది.



బలహీనపడిన ఎల్‌నినో

ఎల్‌నినో ప్రభావంతో గతేడాది నైరుతి సీజన్‌లో 868.6 మిల్లీమీటర్లకుగాను 820 మి.మీ. వర్షపాతం నమోదుతో అనేక ప్రాంతాల్లో పంటల దిగుబడి తగ్గింది. అయితే, తాజా మోడళ్ల మేరకు మధ్యపసిఫిక్ సముద్రంలో ఎల్‌నినో బలహీనపడిందని, వచ్చే నెలాఖరుకల్లా తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని, నైరుతి సీజన్ రెండో భాగం (ఆగస్టు-సెప్టెంబరు)లో లానినా వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇంకా హిందూమహాసముద్రంలో తటస్థంగా ఉన్న ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐవోడీ) రుతుపవనాల సీజన్ చివరికల్లా పాజిటివ్‌గా మారనుంది. గత మూడు నెలల కాలంలో ఉత్తరార్ధ గోళంలో మంచు సాధారణం కంటే తక్కువగా కురిసింది. ఎల్‌నినో బలహీనపడడం, ఐవోడీ తటస్థం నుంచి పాజిటివ్ దిశగా మారడం, యురేషియాపై మంచు కవచం తక్కువగా ఉండడం వంటివి నైరుతి రుతుపవనాల సీజన్‌కు సానుకూలంగా పేర్కొంటున్నారు. కాగా, ఎల్‌నినో తర్వాత వచ్చే లానినా సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

తెలంగాణ అభ్యంతరాలు బేఖాతరు!

(మొదటి పేజీ తరువాయి)

డీమ్డ్ టు అప్రూవల్ (ఆమోదించినట్లు)గా పరిగణనలోకి తీసుకుంటామని తేల్చిచెప్పింది. ఆ తర్వాత ప్రభావిత రాష్ట్రాల (తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, పుదుచ్చేరి) ముఖ్యమంత్రుల సంతకాలు తీసుకుంటామని తెలిపింది. ఇక బ్యారేజీని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలం ఇచ్చంపల్లి వద్ద 87 మీటర్ల ఎత్తుతో నిర్మించనున్నట్లు పునరుద్ఘాటించింది. ఇప్పటిదాకా బ్యారేజీ నిర్మాణ ప్రదేశంపై ఊగిసలాట ఉండగా.. తాజాగా ఇచ్చంపల్లికే ఓటు వేసింది. అయితే నదుల అనుసంధానంపై పదేళ్లుగా నాన్చుతూ వచ్చిన ఎన్‌డబ్ల్యూడీఏ.. సరిగ్గా దేశంలో సార్వత్రిక ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో దూకుడు పెంచడం ప్రాధాన్యం సంతరించుకుంది. నెలాఖరులోగా అభ్యంతరాలు తెలపాలని, ఆయా రాష్ట్రాల సీఎంలతో సంతకాలు చేయించాలని ప్రతిపాదించడం వెనుక ఆంతర్యమేంటన్నది అంతుచిక్కని విషయంగా మారింది. వాస్తవానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రభుత్వాలు ఏ విధాన నిర్ణయాలు తీసుకోవడానికీ వీల్లేదు. ముఖ్యమంత్రుల స్థాయిలో సంతకాలు చేయాలంటే ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి. దాంతో తదుపరి ఏం జరగనుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు తాము లేవనెత్తిన అభ్యంతరాలు వేటికీ జవాబు కూడా ఇవ్వకుండా ముసాయిదా డీపీఆర్‌ను పంపించడంపై తెలంగాణ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది.



కర్ణాటకకు నీటి కేటాయింపుపై అభ్యంతరం

గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల్లో 16 టీఎంసీలను కర్ణాటకకు కేటాయించడం, ఆ నీటిని కృష్ణా బేసిన్‌లోని సబ్‌బేసిన్ కే-4 (మలప్రభ)లోని ఆల్మట్టి రిజర్వాయర్ నుంచి తరలించడానికి (వాడుకోవడానికి) వెసులుబాటు కల్పించడం తెలిసిందే. అయితే దీనివల్ల దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం జలాశయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీలకు బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు వినియోగించుకోవడానికి వీలు కల్పించారు. దీంతో కృష్ణా బేసిన్‌లో 21 టీఎంసీలను కర్ణాటక, 14 టీఎంసీలను మహారాష్ట్ర వాడుకోవడానికి ప్రతిపాదనలు చేస్తున్నాయి. తాజాగా మరో 16 టీఎంసీలను వాడుకోవడానికి వీలు కల్పిస్తే.. జూరాల, శ్రీశైలంపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలంగాణ పేర్కొంది. అంతేకాకుండా.. కర్ణాటకలోని బెడ్తి-వారాదా నదుల అనుసంధానంలో తరలించే 18 టీఎంసీల్లో 9 టీఎంసీల వాటాను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. గోదావరి బేసిన్‌లో 968 టీఎంసీల నికర జలాల వినియోగానికి ప్రతిపాదనలు ఉన్నాయని, పలు ప్రాజెక్టుల డీపీఆర్‌లు పరిశీలనలో ఉన్నాయని గుర్తు చేసింది. కరువు పీడిత మహబూబ్‌నగర్‌లో 30 లక్షల ఎకరాలు, నల్లగొండలో 20.3 లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాల్లో 12.2 లక్షల ఎకరాల్లో 86 శాతానికి పైగా సాగునీటి వసతి లేదని తెలిపింది. గోదావరి-కావేరి అనుసంధానంలో 50 శాతం వాటా ఇస్తే.. ఆయా ప్రాంతాలకు సాగునీరు అందించడానికి అవకాశం ఉంటుందని తెలంగాణ నివేదించింది. ఇక ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే ఆ డ్యామ్ నుంచి విడుదలయ్యే వరదనీటి ప్రభావం తుపాకులగూడెం (సమ్మక్కసాగర్) బ్యారేజీపై ఉంటుందని పేర్కొంది. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌పై బాబ్లీ ప్రాజెక్టు ఉన్నట్లే సమ్మక్కసాగర్ బ్యాక్‌వాటర్‌పై ఇచ్చంపల్లి బ్యారేజీ నిర్మాణం ఉంటుందని తెలిపింది. కానీ, ఈ అభ్యంతరాలేవీ పరిశీలించకుండా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో మళ్లీ డీపీఆర్ పంపించడంపై తెలంగాణ ఆగ్రహంతో ఉంది.

బ్యారేజీపై డైలమాకు బ్రేక్..

గోదావరి-కావేరి అనుసంధానం కోసం తొలుత ఇచ్చంపల్లి నుంచి బ్యారేజీ కట్టి, అక్కడి నుంచే నీటిని తరలించాలని ప్రతిపాదించగా.. గత తెలంగాణ ప్రభుత్వం మాత్రం తుపాకులగూడెం బ్యారేజీ(సమ్మక్కసాగర్)నుంచి అనుసంధానం చేపడితే అభ్యంతరాల్లేవని ఎన్‌డబ్ల్యూడీఏకు తెలిపింది. అయితే ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ కట్టడానికి వీలుగా ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి తెలంగాణ ప్రాంతంలో గోదావరి నీటిని అందించడానికి వీలుగా 1980లో 118 మీటర్ల ఎత్తుతో ఇచ్చంపల్లి బ్యారేజీ నిర్మాణానికి బచావత్ ట్రిబ్యునల్ అనుమతినిచ్చింది. అయితే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అభ్యంతరాలతో ఈ బ్యారేజీ ఎత్తును 112 మీటర్లకు తగ్గించారు. మళ్లీ 1986-88లో 108 మీటర్లకు, కాలక్రమంలో 105 మీటర్లకు తగ్గించి.. తాజాగా నదుల అనుసంధానంలో 87 మీటర్ల ఎత్తుకు కుదించారు. అయినా.. ఛత్తీస్‌గఢ్‌లోని నాలుగు గ్రామాలు నీటమునగనున్నాయని ఆ రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర అభ్యంతరాలు ఉన్నాయి. ఇక ఇచ్చంపల్లి నుంచి కేవలం 24కిలోమీటర్ల దిగువలోనే తుపాకులగూడెం(సమ్మక్క) బ్యారేజీ ఉండగా.. ఇచ్చంపల్లి నుంచి ఆకస్మికంగా వరద విడుదలైతే నియంత్రించే పరిస్థితుల్లేవని, ఫ్లడ్‌రూటింగ్‌కు ఇబ్బందులు వస్తాయని తెలంగాణ పలు సందర్భాల్లో తెలిపింది. ఇచ్చంపల్లికి దిగువన 158 టీ ఎంసీల(దేవాదులకు 38, సీతారామకు 70, తుపాకులగూడెంకు 50 టీఎంసీల) నీటి వినియోగం ఉందని, ఇచ్చంపల్లి బ్యారేజీ కట్టి ఏకకాలంలో గోదావరి-కావేరి అనుసంధానంతోపాటు దిగువన ఉన్న ప్రాజెక్టుల నీటి అవసరాలు తీర్చడం ఎలా సాధ్యమని తెలంగాణ ప్రశ్నించింది.

ఏ రాష్ట్రానికి ఎంత

141 టీఎంసీలతో గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఇందులో సాగునీటికి 82.27, తాగునీటి అవసరాలకు 21.49, పారిశ్రామిక అవసరాలకు 29.79 టీఎంసీలు వినియోగించనున్నారు. రాష్ట్రాల వారీగా తెలంగాణకు 42.6; ఏపీకి 41.8; తమిళనాడుకు 38.6; కర్ణాటకకు 9.8; పుదుచ్చేరికి 2.2 టీఎంసీలు కేటాయించనున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 8 ఎంపీ సీట్లు

- బీజేపీకి 5, బీఆర్ఎస్‌కు 3 స్థానాలు
- ఏపీలో టీడీపీకి 14, వైసీపీకి 7 సీట్లు
- మొత్తం 325 స్థానాలతో బీజేపీ హవా
- 109 సీట్లకే ఇండియా కూటమి పరిమితం
- న్యూస్ ఎక్స్ ఒపీనియన్ పోల్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అధికార కాంగ్రెస్‌దే పైచేయి కానుందని న్యూస్ ఎక్స్ ఒపీనియన్ పోల్‌లో వెల్లడైంది. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకుగాను కాంగ్రెస్ 8 సీట్లను గెలుచుకుంటుందని, బీజేపీ 5, బీఆర్ఎస్ 3 స్థానాలను దక్కించుకుంటుందని న్యూస్ ఎక్స్ తెలిపింది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ హవా ఉంటుందని పేర్కొంది. ఏపీలోని మొత్తం 25 స్థానాలకుగాను టీడీపీ 14 సీట్లను కైవసం చేసుకుంటుందని వెల్లడించింది. అధికార వైసీపీ 7 స్థానాలకు పరిమితమవుతుందని, బీజేపీ, జనసేన పార్టీలకు రెండు చొప్పున సీట్లు దక్కుతాయని తెలిపింది. ఇక దేశ వ్యాప్తంగా మరోసారి బీజేపీ ప్రభంజనం వీస్తుందని సర్వే సంస్థ పేర్కొంది. అన్ని రాష్ట్రాల్లో కలిసి బీజేపీ 325 స్థానాలు గెలుచుకుంటుందని, కూటమిగా ఎన్డీయేకు 383 వస్తాయని వెల్లడించింది. కాగా, కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమి 109 స్థానాలకే పరిమితం కానున్నట్లు తెలిపింది. కాంగ్రెస్‌కు ఒంటరిగా 50 సీట్లు కూడా దాటవని తేలినట్లు వివరించింది.

2 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు

- నిప్పుల కొలిమిలా తెలంగాణ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ ఎండలు మండుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఉష్ణోగ్రతలు దాదాపు 2 డిగ్రీలు పెరిగాయి. ఆదివారం అత్యధిక గరిష్ఠ ఉష్ణోగ్రత 42.7 డిగ్రీలు కాగా... సోమవారం అది 44.2 డిగ్రీలకు పెరిగింది. మంగళవారం నుంచి 3 రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయని, కొన్ని జిల్లాల్లో 2 నుంచి 3 డిగ్రీల మేరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక బుధవారం నుంచి వడగాలులు కూడా వీచే అవకాశం ఉందని పేర్కొంది. రంగారెడ్డి మినహా అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

తప్ప తాగి.. కారుతో వాహనాలను ఢీకొంటూ..!

- మద్యం మత్తులో టెకీ బీభత్సం
- ఒకరి మృతి.. 9 మందికి గాయాలు

రాయదుర్గం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన కారుతో రోడ్డుపై విధ్వంసం సృష్టించాడు. ఓ పాదచారితోపాటు రోడ్డుపై వెళ్తున్న పలు వాహనాలను ఢీ కొడుతూ దూసుకెళ్లాడు. దీంతో ఒకరు మృతి చెందగా.. పలువురికి గాయాలయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. క్రాంతి కుమార్ (30) ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతడు పీకల దాకా మద్యం సేవించాడు. తన వోక్స్‌వ్యాగన్ పోలో కారులో బయలుదేరాడు. రాత్రి 12.30 గంటల ప్రాంతంలో ఐకియా ఫ్లైఓవర్, శిల్పా ఫ్లైఓవర్, పిస్తాహౌస్, షేక్‌పేట ఫ్లైఓవర్లపై ఒక కారు, మూడు బైకులు, ఒక ఆటోతోపాటు పాదచారిని ఢీ కొంటూ దూసుకెళ్లాడు. దీంతో వాహనదారులు షేక్‌పేట ఫ్లైఓవర్‌ను పట్టుకొని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. పిస్తాహౌస్ వద్ద గుర్తు తెలియని ఓ పాదచారిని ఢీ కొట్టడంతో అతడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మరో 9 మందికి గాయాలయ్యాయి. ఇంత జరిగినా విషయం బయటకు రానీయని రాయదుర్గం పోలీసుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అబద్ధాలు..మోసాలు!

జగన్‌రెడ్డీ.. ఎన్నాళ్లు ఇలా నాటకాలాడతావ్?: చంద్రబాబు





విజయనగరం జిల్లా రాజాంలో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, కార్యకర్తలు బహూకరించిన నాగలితో చంద్రబాబు

విజయనగరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ చెప్పేవన్నీ అబద్ధాలు.. చేసేవన్నీ మోసాలేనని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. గత ఎన్నికల్లో కోడికత్తి కేసుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాడని.. మళ్లీ ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నాడని విమర్శించారు. ఇలాంటి దగాకోరు వ్యవహారాలను ప్రజలు నమ్మరని అన్నారు. ప్రజాగళంలో భాగంగా సోమవారం విజయనగరం జిల్లా రాజాం, శ్రీకాకుళం జిల్లా పలాసల్లో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతాన్ని దోచుకునేందుకు జగన్‌రెడ్డి ఒక్కొక్కరికి అవకాశం ఇచ్చాడని.. ఉత్తరాంధ్రను విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి దత్తత ఇచ్చారని ధ్వజమెత్తారు. విశాఖను చెరబట్టారని.. భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసి 46 వేల కోట్లకు పైగా దోచుకున్నారని అన్నారు. ఉత్తరాంధ్రలో వారి పెత్తనం ఏమిటని నిలదీశారు. 'విశాఖను ఆర్థిక రాజధాని చేయాలన్న సంకల్పంతో నేను ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టా. జగన్ వచ్చాక విశాఖను ఆర్థిక రాజధాని కాకుండా.. గంజాయి, డ్రగ్స్ రాజధానిగా తయారు చేశారు. దీని వల్ల ఎన్నో కుటుంబాలు, ఎంతో మంది జీవితాలు దుర్భరంగా మారాయి' అని వాపోయారు. 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు జగన్ పీఆర్సీ ఇవ్వలేదని.. తాను వస్తే వారి బకాయిలన్నీ ఇచ్చేస్తానని చెప్పారు. "రాష్ట్రంలో దొంగలు పడ్డారు.. సమష్టిగా కాపాడుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఓ పెద్ద సైకో.. అంతటా చిన్న సైకోలను తయారు చేశాడు. ఐదేళ్లు కష్టపడి నిర్మించిన రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది.. జనసైనికులు, బీజేపీ కార్యకర్తలు, టీడీపీ సైన్యం దానిని తరిమేందుకు సిద్ధంగా ఉన్నారు" అని పేర్కొన్నారు.

రాయి తగలాల్సిన చోట తగల్లేదు

- దేవుడి దయతో కన్ను, కణతను తాకలేదు: ఏపీ సీఎం జగన్
- టీడీపీ అధినేతపై ద్వేషాన్ని చిమ్మిన వైనం

(విజయవాడ/మచిలీపట్నం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

"నా నుదుటిపై వారు చేసిన గాయం పెద్దదేమీ కాదు. దేవుడి దయతో ఆ రాయి ఇక్కడ తగల్లేదు (కంటిని చూపుతూ), ఇక్కడ తగల్లేదు (కణత భాగాన్ని చూపుతూ).. అంటే దేవుడు మీ బిడ్డ విషయంలో మరింత పెద్ద స్క్రిప్టు రాశాడని అర్థం. ఈ స్థాయికి వారు దిగజారారు అంటే అర్థమేంటి? విజయానికి మనం అంత చేరువలో ఉన్నామని వారు అంత దూరంగా ఉన్నారని అర్థం." అంటూ తనపై జరిగిన గులకరాయి దాడిపై సీఎం జగన్ తొలిసారి స్పందించారు. గుడివాడలో సోమవారం సాయంత్రం జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. రాయి దాడి నెపాన్ని మొత్తం చంద్రబాబుపై వేసేందుకు ఆయన ప్రయత్నించారు. గాయపరచడం, కుట్రలు చేయడం చంద్రబాబు నైజం అని, దుష్టచతుష్టయం కుట్రలకు అదరబోనంటూ వ్యాఖ్యలు చేశారు. తన నుదిటిపై గాయం 10 రోజుల్లో తగ్గిపోతుందని, కానీ పేదల విషయంలో చంద్రబాబు చేసిన గాయం ఎన్నటికీ మానదంటూ వ్యాఖ్యానించారు.

గుడివాడలో సీఎం జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' సభకు జనాన్ని తరలించడానికి రాజమండ్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు సోమవారం ఉదయం 8 గంటలకే పామర్రు చేరుకున్నాయి. సాయంత్రం 4.13 గంటలు దాటినా బస్సుల్లో ఎవరు ఎక్కడానికి ఆసక్తి చూపించలేదు. చల్లపల్లి నుంచి వస్తున్న రేపల్లె డిపోకు చెందిన బస్సుల్లో కనీసం నలుగురైనా లేకుండానే పామర్రు సెంటర్ మీదుగా గుడివాడ తరలించారు. మరోవైపు జగన్ ఎక్కడ పర్యటిస్తే అక్కడ జనం తిప్పలు పడాల్సి వస్తోంది. తాజాగా సోమవారం జాతీయ రహదారిపై హనుమాన్ జంక్షన్ నుంచి కైకరం మధ్య 51 కి.మీ మేర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగన్ బస్సుయాత్ర సోమవారం రాత్రి 7.30 సమయంలో హనుమాన్ జంక్షన్ దాటి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. హనుమాన్ జంక్షన్‌లోనే అర్ధగంటకుపైగా రాజమండ్రి, తణుకు, రావులపాలెం, ఏలూరువైపు వాహనాలను నిలిపివేశారు. సీఎం పర్యటించిన ప్రాంతాల్లో ఎక్కడా జనం కనిపించలేదు.

జనంలోంచే రాయి.. విసిరింది ఒక్కడే

- ఆగంతకుడు చేత్తోనే విసిరాడు
- ముందు జగన్‌కు, తర్వాత వెలంపల్లికి తగిలింది
- విద్యుత్ తీగలు కిందకున్నందునే సరఫరా కట్
- ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతిరాణా టాటా వెల్లడి

విజయవాడ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడి ఘటనకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా పలు కీలక విషయాలు వెల్లడించారు. దాడి ఘటన ఆగంతకుడి పనేనని, రాయి విసిరింది ఒక్కడేనని వివరించారు. దుండగుడు వినియోగించింది 'ఒక్కరాయే'నని తెలిపారు. అంతేకాదు.. ఆ రాయి కూడా జనంలోంచే పడిందన్నారు. జగన్‌కు ఎడమవైపు నుదుటిపై తగిలిన రాయి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుకు తగిలిన రాయి ఒక్కటేనని తేల్చి చెప్పారు. "ఎడమ వైపు నుంచి అరచేతిలో పట్టేంత రాయి వేగంగా వచ్చి జగన్ నుదుటికి తగిలింది. అదే రాయి వెలంపల్లి కంటి భాగం, ముక్కు వద్ద తగిలింది" అని చెప్పారు. ఆగంతకుడు ఈ పనిచేసి ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. విజయవాడలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. "సీఎం జగన్ రోడ్ షో అజిత్ సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్ దాటి గంగానమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి ఒక దుండగుడు రాయి విసిరాడు. ఈ రాయిని అతను రోడ్డు మీద నుంచే విసిరాడు. కొన్ని సీసీ కెమెరాల ఫుటేజీలు, సెల్‌ఫోన్ల వీడియోలను విశ్లేషించాక ఈ నిర్ధారణకు వచ్చాం. వివేకానంద స్కూల్ అన్ని గదులకు తాళాలు వేసి ఉన్నాయి. భవనంపై కానిస్టేబుళ్లు ఉన్నారు. కింద గేటుకు వాచ్‌మన్ తాళాలు వేశాడు. వివేకానంద స్కూల్ ప్రాంగణం నుంచి పక్కనే ఉన్న మాకినేని స్టేడియంలోకి వెళ్లడానికి గేటు ఉంది. స్కూల్, స్టేడియానికి చెంతనే గంగానమ్మ ఆలయం ఉంది. ఈ మూడింటి సరిహద్దులో కొంత ఖాళీ ప్రదేశం ఉంది. అక్కడి నుంచే దాడి జరిగింది. ఆగంతకుడు చేత్తోనే రాయిని విసిరాడు. క్యాట్‌బాల్‌తో ఇలా కొట్టడం సాధ్యం కాదు. పైగా, క్యాట్‌బాల్ ఉపయోగించినట్టుగా ఆధారాలూ లభించలేదు. మేం సేకరించిన 60 వీడియోలను సాంకేతిక విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాం. కొంతమందిపై అనుమానాలు ఉన్నాయి. ఆధారాల కోసం దర్యాప్తు చేస్తున్నాం. నేరచరిత్ర ఉన్న అనుమానితులను, ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న వారిని కూడా విచారిస్తున్నాం. జనాల మధ్య నుంచే ఈ రాయి వచ్చింది. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం. శిఖామణి సెంటర్, డాబాకొట్లు సెంటర్లలో విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ తీగలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని తొలగించాం. విద్యుత్ తీగలను మేం తొలగించలేం కాబట్టి సరఫరాను నిలుపుదల చేయించాం. ప్రతిపక్ష నేతల పర్యటనలు ఉన్నా ఈ విధంగానే చేస్తాం" అని రాణా వివరించారు.

'రోత' ప్రచారమే!

సీఎం జగన్‌పై జరిగిన రాయి దాడి ఘటనపై ఆయన రోత మీడియాలో పదే పదే ప్రసారం చేసిన వీడియోలో పసలేదని, ఇదంతా రోత ప్రచారమేనని సీపీ రాణా ఇచ్చిన వివరణతో స్పష్టమైంది. బస్సు యాత్ర సాగుతున్న ప్రాంతానికి ఎడమ పక్కన ఉన్న భవనంపై నుంచి రాయి దూసుకువచ్చి, జగన్‌కు తగిలిందంటూ.. ఓ వీడియోను రోత మీడియా పదేపదే ప్రసారం చేసింది. అయితే.. ఏ భవనంపై నుంచి రాయి రాలేదని.. అది జనంలో నుంచే వచ్చిందని కమిషనర్ రాణా స్పష్టం చేయడంతో జగన్ రోత మీడియా బండారం బట్టబయలైనట్లయింది. కాగా,సోమవారం నాటి జగన్ బస్సు యాత్రలో కూడా భద్రతా వైఫల్యం అడుగడుగునా కనిపించింది. బస్సు యాత్ర సాగే ప్రాంతాల్లో గన్నవరం, హనుమాన్ జంక్షన్ వంటి ప్రాంతాల్లో తప్ప పెద్దగా పోలీసులను భవనాలపై పర్యవేక్షణకు నియమించలేదు. ఒకటి రెండు భవనాలపైనే పోలీసులు కనిపించారు. ఇదిలా ఉండగా, సీఎం జగన్‌పై గులకరాయి దాడి ఘటనలో నిందితుల సమాచారం ఇచ్చిన వారికి పోలీసు శాఖ రూ.2 లక్షల పారితోషికం ప్రకటించింది.

మోదీకి జగన్ తొత్తు!

- చిన్నాన్న హంతకుడిని పక్కన పెట్టుకు తిరుగుతున్నాడు
- ఏపీలో ట్రయాంగిల్ లవ్ స్టోరీ: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



చిత్తూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బీజేపీతో చంద్రబాబుది బహిరంగ పొత్తు అయితే, జగన్‌ది రహస్య పొత్తు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. మోదీకి జగన్ తొత్తు అని విమర్శించారు. చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీడీనెల్లూరు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు రమేశ్‌బాబు, శివశంకర్, ఎంఎస్ బాబులను ఆమె ప్రజలకు పరిచయం చేశారు. వీరికి ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'పాలకపక్షం, ప్రతిపక్షం.. ఇద్దరికీ బీజేపీతో పొత్తు కావాలంట. ఇది ట్రయాంగిల్ లవ్ స్టోరీలా ఉంది. మన రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్. ఎవరికి ఓటేసినా మొత్తం బీజేపీ ఖాతాలోనే పడతాయి. అంతమాత్రానికి వారికి ఓట్లెందుకు వేయాలి. బీజేపీ మన రాష్ట్రానికి ఏం చేసింది?' అని షర్మిల ప్రశ్నించారు. 'సొంత చిన్నాన్ననే హత్య చేసిన అవినాశ్‌రెడ్డిని పక్కన పెట్టుకుని తిరుగుతున్నారు జగన్. ఈ హత్యా, గూండా రాజకీయాలు మనకు అవసరమా? వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా ఇంకా 2.25 లక్షల ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయి. ఐదేళ్లు ఏం చేశారు.. గుడ్డి గుర్రానికి పళ్లు తోమారా? గాడిదలు కాశారా..? జగన్ ఒకవైపు బటన్ నొక్కుతున్నా.. మరోవైపు లూటీ చేస్తున్నారు. కరెంటు చార్జీలు ఏడుసార్లు.. ఆర్టీసీ చార్జీలు ఐదుసార్లు పెంచారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఇంటి పన్ను కూడా పెంచుకుంటూ పోతున్నారు. ఓ చేత్తో మట్టి చెంబు ఇచ్చి మరో చేత్తో వెండి చెంబు లాగేసుకుంటున్నారు. బీజేపీ మెడలు వంచి హోదా తెస్తానని చెప్పిన జగన్, ఇప్పుడు దాని ఊసే లేకుండా చేస్తున్నారు' అని అన్నారు.

కాంగ్రెస్ ఖాతాలోకి కామారెడ్డి మునిసిపాలిటీ

» చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ ప్రమాణం


ఇందుప్రియకు నియమాక పత్రం అందిస్తున్న ఆర్డీవో

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ఖాతాలో మరో మునిసిపాలిటీ చేరింది. రెండు నెలలుగా కామారెడ్డి మునిసిపల్ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియకే చైర్‌పర్సన్ పదవి దక్కింది. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించగా.. బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఒకే ఒక నామినేషన్ కాంగ్రెస్ నుంచి దాఖలు కాగా చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్డీవో రఘునాథ్‌రావు ఇందుప్రియతో ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాన్ని అందించారు. నాలుగేళ్లుగా బీఆర్ఎస్‌కు చెందిన నిట్టు జాహ్నవి మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఉండగా.. ఇటీవల మెజారిటీ కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దించేశారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ముందువరకు కాంగ్రెస్‌లో కేవలం నలుగురు కౌన్సిలర్లే ఉన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి సస్పెండ్‌కు గురైన వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు హస్తం గూటికి వెళ్లారు. ఆ తర్వాత ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. మునిసిపల్‌లో వారి సంఖ్యాబలం 28కి చేరింది.

నేడు కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ

» సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో ఏర్పాట్లు

హైదరాబాద్, పుల్కల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ వద్ద మంగళవారం జరిగే ఈ సభలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. చేవేళ్ల తర్వాత ఇది రెండో సభ కావడంతో దీన్ని విజయవంతం చేసేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పర్యవేక్షణలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సభ కోసం స్థానిక రైతులకు చెందిన 45 ఎకరాల పట్టా భూమిలో సభా వేదిక, కళాకారుల వేదిక, జనం కూర్చునేందుకు వీలుగా గ్యాలరీల ఏర్పాటుతో పాటు వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని చదును చేసి పనులను వేగంగా పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల సభ కావడంతో సంబంధిత రైతుల వద్ద నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ)లపై సంతకాలు తీసుకున్నారు.

సమాచార హక్కు చట్టం అమలు అధ్వానం

» కమిషనర్లను నియమించండి: యూఎఫ్ఆర్టీఐసీ

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత పదేళ్లుగా సమాచార హక్కు చట్టం అమల్లో లేకుండా పోయిందని 'యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపేయిన్(యూఎఫ్ఆర్టీఐసీ)' సంస్థ ప్రతినిధులు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని అవినీతి, అక్రమాలు, కుంభకోణాలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు చట్టాన్ని అమలుచేయకుండా అడ్డుకున్నారని సంస్థ ప్రతినిధులు రామకృష్ణంరాజు, మహేశ్, వేంకటేశ్వర్లు ఆరోపించారు. అర్హులైన నిపుణులతో సమాచార ప్రధాన కమిషనర్, కమిషనర్లను వెంటనే నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం వారు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పునరావాస కేంద్రంగా కాకుండా చట్టం అమలుకు చిత్తశుద్ధితో కృషిచేసే సమర్థులను నియమించాలని కోరారు. సమాచార హక్కు చట్టంపై గతంలో పదోతరగతిలో తొలగించిన పాఠ్యాంశాన్ని వెంటనే చేర్చాలని, ఆర్టీఐ చట్టం అమలులో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసకోవాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.

ప్రజాసమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

» ఎన్నికల పేరుతో హామీలను ఎగ్గొట్టొద్దు: నిరంజన్‌రెడ్డి

» అవినీతి అనకొండలకు కాంగ్రెస్ అండ: ఎ.జీవన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాగునీరు సమృద్ధిగా లేక ప్రజలు, సాగునీరందక రైతాంగం అవస్థ పడుతోందని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్దతు ధరకు పంట కొనుగోలు చేస్తామని, క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు.. లోక్‌సభ ఎన్నికల పేరుతో ఇప్పుడు ఎగ్గొట్టడం తగదన్నారు. ఇక నుంచి బీజేపీపైనే తమ పోరాటమని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని, బీజేపీ మీద పోరాడే దమ్ము ఆ పార్టీకి లేదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ లేదనడం వారి అవివేకమని, మిషన్ 15 అంటున్న కాంగ్రెస్, చేతనైతే 5 స్థానాల్లో గెలిపించుకోవాలని నిరంజన్‌రెడ్డి సవాల్ విసిరారు. కాగా, విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి లాంటి అవినీతి అనకొండలకు కాంగ్రెస్ అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. రంజిత్‌రెడ్డి మోసగాడని, నమ్మినోళ్లను నట్టేట ముంచిన నయవంచకుడని విమర్శించారు. సిద్దిపేట జిల్లాలోని ధర్మాజీపేటలో సర్వే నంబర్ 591లో 14 ఎకరాల 44 గుంటల అసైన్డ్ భూమిని బ్యాంకులో తనఖాపెట్టి చట్ట విరుద్ధంగా రూ.233 కోట్లు అప్పుతెచ్చుకున్న మోసపూరిత చరిత్ర ఉన్న రంజిత్‌రెడ్డి.. బండ్ల గణేశ్ భూమిని కూడా గుంజుకున్నారని జీవన్‌రెడ్డి ఆరోపించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు

» హస్తం గూటికి మదన్‌రెడ్డి, రాథోడ్ బాపూరావు

» మెదక్, నిర్మల్ మునిపల్ చైర్మన్లు కూడా..

హైదరాబాద్/మెదక్/నర్సాపూర్/ఇచ్చోడ, ఏప్రిల్ 15: మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన మెదక్ జిల్లా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, బీజేపీ నేత, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు హస్తం గూటికి వెళ్లారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి సమక్షంలో మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు ఫుడ్‌కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, మెదక్ మునిసిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ సహా 9 మంది కౌనిలర్లు, కోఆప్షన్ మెంబర్ బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి వెళ్లారు. వారితో పాటు.. పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, చిలప్‌చెడ్ ఎంపీపీ వినోద దుర్గారెడ్డి, వైస్ఎంపీపీ విశ్వంభరస్వామితో పాటు పలువురు మాజీ సర్పంచులు, నేతలు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మాజీ ఎమ్మెల్యే బాపూరావు కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ తరఫున బోథ్ నుంచి వరుసగా 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బాపూరావుకు 2024 ఎన్నికల్లో ఆ పార్టీ టికెట్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆయన బీజేపీలో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి ఆదిలాబాద్ టికెట్‌ను ఆశించారు. టికెట్ దక్కకపోవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. బాపూరావుతో పాటు నిర్మల్ మునిసిపల్ చైర్మన్ జి.ఈశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రాజ్ మహమ్మద్, రవీందర్‌రెడ్డిలూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.


పార్టీ కండువా కప్పి బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్

ఆగస్టు 15లోగా రుణమాఫీ!

(మొదటిపేజీ తరువాయి)

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ప్రకటించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జన జాతర సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. "తన బిడ్డ బెయిల్ కోసం మాజీ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌ను బీజేపీకి తాకట్టు పెట్టారు. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం మోదీతో చీకటి ఒప్పందం చేసుకొని సుపారీ తీసుకున్నారు. మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, జహీరాబాద్, భువనగిరి లోక్‌సభ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారు. అందుకే.. ఆయా నియోజకవర్గాల పరిధిలో మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ గ్రామాలకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కూడా అడగడం లేదు" అని వివరించారు. బీఆర్ఎస్‌ను బీజేపీకి తాకట్టు పెట్టడం ద్వారా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర ఉంచారని మండిపడ్డారు. బిడ్డ లగ్గం ఉన్నా కూడా వదలకుండా తనను, ఇతర పార్టీల నాయకులను, కార్యకర్తలను జైల్లో పెట్టినప్పుడు కేసీఆర్‌కు బాధ కలగలేదని, కానీ, తన బిడ్డను జైల్లో పెట్టగానే తెలంగాణ ఆత్మగౌరవాన్ని కేసీఆర్ తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా గద్వాల వంటి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడానికి బీజేపీ సహకరించిందని, ఇప్పుడు బీజేపీ గెలవడానికి బీఆర్ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు. "సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా సామాజికవర్గ కూర్పు ఆధారంగా టికెట్లు ఇచ్చాం. బీసీ బిడ్డ నీలం మధుకు కాంగ్రెస్ మెదక్ టికెట్ ఇస్తే.. కేసీఆర్ వెంకట్రామి రెడ్డికి ఇచ్చారు. ఇదే ఆ పార్టీ విధానం. 119 నియోజక వర్గాల్లో 10 శాతం ఉన్న ముదిరాజ్ బిడ్డలను బీఆర్ఎస్ పట్టించుకోలేదు. మేం టికెట్ ఇచ్చి మరీ మక్తల్ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరిని గెలిపించుకున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 14 పార్లమెంట్ స్థానాల్లో గెలిస్తే ముదిరాజ్ బిడ్డను ఆగస్టు 15లోపు మంత్రిని చేస్తాను" అని హామీ ఇచ్చారు. బీసీ ఏలో ఉన్న ముదిరాజ్‌లను ప్రత్యేక పరిస్థితుల్లో బీసీ డీలోకి మార్చారని, ఆ కేసు సుప్రీం కోర్టులో ఉందని, పదేళ్లుగా ఆ కేసులో కేసీఆర్ సర్కారు వాదనలు వినిపించలేదని తప్పుబట్టారు. "మాదిగల ఏబీసీడీ వర్గీకరణను పదేళ్లు కేసీఆర్ పట్టించుకోలేదు. మేం అధికారం చేపట్టిన తర్వాత మంత్రి రాజనర్సింహతోపాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పంపించి సుప్రీంలో కేసు వాదిస్తున్నాం. వర్గీకరణ కోసం పోరాడుతున్న మంద కృష్ణకు పలుమార్లు మద్దతు తెలిపాం. అసెంబ్లీలో గళం విప్పి మార్షల్స్‌తో గెంటేయించుకున్నాం" అని గుర్తు చేశారు. దళిత నాయకులు సిరిసిల్ల రాజయ్య, సంపత్ కుమార్, పాల్వాయి రజిని, ప్రీతంకుమార్‌కు పదవులు ఇచ్చామని, సర్వే సత్యనారాయణ కుమార్తె, దళిత ఐఏఎస్ సంగీతను తన పేషీలో నియమించుకున్నామని చెప్పారు. కురుమ బిడ్డకు సీటు ఇస్తే డీకే అరుణ అల్లుడి కోసం ఆమెను ఓడించారని, వారికి అన్యాయం జరిగిందని గుర్తించి అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ ఇచ్చామని వివరించారు.


జన జాతర సభలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

నన్నెందుకు ఓడించాలి!?

అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సహచర మంత్రులతో కలిసి సెలవు కూడా తీసుకోకుండా రోజుకు 18 గంటలపాటు పని చేస్తున్నామని, పదేళ్లలో చేసిన వందేళ్ల విధ్వంసాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. "మహిళలకు గ్యాస్ సిలిండర్ ఇచ్చాం. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. పేదలకు 200 యూనిట్లలోపు ఉచితంగా కరెంటు ఇస్తున్నాం. నియోజక వర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు మంజూరు చేశాం. 60 ఏళ్లుగా పోరాడుతున్న బీసీ గణనకు అనుకూలంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేశాం. 126 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఇందుకేనా రేవంత్ రెడ్డిని ఓడగొట్టాలని, ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆలోచన చేస్తున్నారు!?" అని బీజేపీ, బీఆర్ఎస్‌లపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వంద రోజులుగా అధికారంలో ఉన్న తనను గద్దె దించాలని అంటున్న బీఆర్ఎస్ నేతలు.. పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీని గద్దె దించాలని ఎందుకు కోరడం లేదని నిలదీశారు. "పాలమూరు బిడ్డగా ముఖ్యమంత్రిగా పని చేసే హక్కు నాకు లేదా!? దొరలే ఎప్పుడూ సీఎం కావాలా!? వారు కాకపోతే వారి కొడుకులే కావాలా!?" అని ప్రశ్నించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పాలమూరు ప్రజలకు అందకుండా ఎమ్మెల్సీ కోడ్‌తో బీజేపీ కుట్ర పన్నిందని విమర్శించారు. కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను పాలమూరులో కూడా అమలు చేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని, కుట్రలు చేస్తున్న వారిని అడ్డుకొని, ప్రతి బూత్, గ్రామంలో మెజారిటీ తెచ్చేందుకు కష్టపడితే ఆ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చి గెలిపించుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి సంక్షేమ పథకాలను కార్యకర్తల చేతులమీదుగానే అందజేస్తామన్నారు. ఉమ్మడి పాలమూరులో రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సభలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పర్ణికారెడ్డి, శంకర్, వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి!?

» సీఎం రేవంత్ వ్యాఖ్యలతో ఊహాగానాలు



నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రి పదవి వరించనుందా!? కాంగ్రెస్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య ఆయన గురించేనా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కాంగ్రెస్ పార్టీ వర్గాలు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 14 స్థానాలు ఇస్తే ముదిరాజ్ బిడ్డకు ఆగస్టు 15లోపు మంత్రి పదవి ఇస్తానని సీఎం రేవంత్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఏకైక ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాత్రమే. దీనికితోడు, మంత్రివర్గ విస్తరణ పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఉంటుందని అంతా భావిస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో మంత్రివర్గ విస్తరణ చేయలేదు. రేవంత్ రెడ్డితోపాటు 11 మంది మంత్రులు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రివర్గంలో మరో ఆరుగురికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే మంత్రివర్గ విస్తరణలో వాకిటికి అవకాశం ఉంటుందంటూ ఊహాగానాలు చెలరేగుతున్నాయి.

రాహుల్ గాంధీని ప్రధానిని చేయండి

ప్రజలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విజ్ఞప్తి

» దేశం కోసం నెహ్రూ, ఇందిర జైలుకెళ్లారు
» నెహ్రూ తన ఆస్తిని ధారపోశారు
» ఇలా చేసిన బీజేపీ నేతలెవరైనా ఉన్నారా?
» దేశాన్ని నాశనం చేసిన పార్టీ బీజేపీ
» త్యాగాల కుటుంబ నేపథ్యం రాహుల్‌ది
» డబుల్ ఇంజన్ అంటే డబుల్ అప్పులేనా?
» రాముడి పేరు చెప్పి పరేషాన్ చేస్తున్నారు
» బీజేపీపై జగ్గారెడ్డి ఫైర్



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం గాంధీ కుటుంబం సర్వం త్యాగం చేసిందని, ఆ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రధాని అయితే.. ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని కనీసంగా 15 సీట్లలో గెలిపించి.. రాహుల్ ప్రధాని కావడానికి సహకరించాలని కోరారు. డబుల్ ఇంజన్ సర్కారు అంటే.. దేశం అప్పులను డబుల్ చేయడమేనా..? అని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ముత్తాత మోతీలాల్ నెహ్రూకు ఆ రోజుల్లోనే రూ.వందల కోట్ల ఆస్తులు ఉండేవని, స్వాతంత్ర్య ఉద్యమం కోసం ఆయన ఆస్తినంతా ధార పోశారని, పెద్ద పెద్ద భవనాలూ ఇచ్చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు గాంధీ కుటుంబానికి ఉండటానికి ఇల్లు కూడా లేదన్నారు. బీజేపీలో ఒక్కరైనా ఇలా దేశం కోసం ఆస్తులను ధారాదత్తం చేసిన వారు ఉన్నారా..? అని నిలదీశారు. దేశం కోసం జవహర్‌లాల్ నెహ్రూ 16 ఏళ్లు, ఇందిరా గాంధీ ఆరేళ్లు జైలు జీవితం గడిపారని తెలిపారు. ఇందిర, రాజీవ్‌గాంధీలు ఉగ్రవాదుల చేతిలో బలయ్యారని గుర్తుచేశారు. ఇలా దేశం కోసం త్యాగం చేసిన వారు బీజేపీలో ఎవరైనా ఉన్నారా..? అని ప్రశ్నించారు. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం నుంచి రాహుల్‌గాంధీ వచ్చారని చెప్పారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ నుంచి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరకు కేంద్రంలోని ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.55 లక్షల కోట్లు మాత్రమేనని.. కానీ మోదీ 9 ఏళ్ల పాలనలో రూ.113 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని పేర్కొన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు అంటే.. అప్పులను డబుల్ చేయడమేనా..? అని నిలదీశారు. ఈ 9 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని.. ఈ అప్పుల భారమంతా తమపైనే పడుతుందన్న సంగతిని దేశ ప్రజలు గుర్తించాలన్నారు. దేశ వినాశనానికే బీజేపీ వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే మత సామరస్యం బాగుందన్నారు. శ్రీరాముడు దేవుడే కానీ నాయకుడు కాదన్నారు. రాహుల్ గాంధీ కూడా రాముడిని మొక్కుతారని, కానీ చుట్టూ కెమెరాలు పెట్టుకుని మొక్కరని తెలిపారు. తానూ ఏటా ఘనంగా సీతారామ కల్యాణం చేయిస్తానని, హనుమంతుడినీ మొక్కుతానని చెప్పారు. బీజేపీ వాళ్లు సీతారామ కల్యాణం చేయరని, దీపం పెట్టరని ఆరోపించారు. మోదీ, అమిత్ షా, బండి సంజయ్ లు దైవం విషయంలో అతిగా వ్యవహరిస్తున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే ధరల నియంత్రణ ఉంటుందని తెలిపారు. మోదీ ప్రధాని కాక ముందు రూ.25 వేలు ఉన్న తులం బంగారం ధర.. ఇప్పుడు రూ.75 వేలకు పెరిగిందన్నారు. ప్రస్తుతం బంగారం కొనే పరిస్థితి ఉందా..? అని ప్రశ్నించారు. గ్యాస్ సిలిండర్ ధరను పెంచి, ఎన్నికలు రాగానే రూ.వంద తగ్గించారని జగ్గారెడ్డి అన్నారు.

'గల్ఫ్' ఓట్లపై కాంగ్రెస్ నజర్

కార్మిక కుటుంబాల మద్దతు పొందేందుకు యత్నం

- ఏడు ఎంపీ స్థానాల పరిధిలో వారి ఓట్లు
- గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో భేటీలు
- దుబాయ్ వెళ్లి మహేశ్‌కుమార్ చర్చలు
- నేడు సీఎంతో గల్ఫ్ సంఘాల భేటీ

నిజామాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్.. పలు వర్గాలు, సంఘాల ఓట్లపై ప్రధానంగా దృష్టిసారిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న గల్ఫ్ కార్మికుల కుటుంబాల మద్దతు కూడగట్టేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కువగా గల్ఫ్ కార్మికుల కుటుంబాలు ఉన్నాయి. పెద్దపల్లి, మెదక్, జహీరాబాద్, వరంగల్, పార్లమెంట్ పరిధిలోనూ ఈ కుటుంబాల వారు ఉన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో అత్యధికంగా 3.75 లక్షల మంది గల్ఫ్ కుటుంబాల ఓటర్లు ఉన్నారు. ఇక్కడి ఓటర్లు సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్‌తో పాటు ఇతర దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబాల వారు గత ప్రభుత్వాల తీరుపై కొంత వ్యతిరేకంగా ఉన్నారని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారి కోసం పలు హామీలు ఇచ్చింది. అధికారంలోకి వస్తే గల్ఫ్ కార్మికులకు పునరావాసం కల్పిస్తామని చెప్పింది. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చింది. చనిపోయిన కుటుంబాల వారికి రూ.5 లక్షలు అందించే పథకాన్ని ప్రారంభించింది. గత శాసనసభ ఎన్నికల్లో గల్ఫ్ కార్మికుల కుటుంబాలు చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చాయి. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా వారి మద్దతును కూడగట్టేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గల్ఫ్ సంఘాల వారితో కొన్ని రోజులుగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ నాలుగు రోజుల క్రితం దుబాయ్ వెళ్లి అక్కడి సంఘాలతో మాట్లాడుతున్నారు. ఇక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థులతో మాట్లాడిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో పోటీలో ఉన్న అభ్యర్థులు కూడా ఆయా సంఘాల నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో పాటు అండగా ఉంటామని చెబుతున్నారు.

నేడు సీఎం రేవంత్‌తో భేటీ..

గల్ఫ్ సంఘాలతో మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కానున్నారు. ఈ మేరకు గల్ఫ్‌లో పనిచేస్తున్న సంఘాల నేతలకు ఆహ్వానం పంపారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం పనిచేస్తున్న సంఘాలను కూడా ఆహ్వానించారు. గల్ఫ్ కార్మికుల కోసం ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరిస్తూనే పార్లమెంట్ ఎన్నికల తర్వాత వారి కుటుంబాల కోసం ఏం చేస్తారో చెప్పే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఏడు పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులు కూడా పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

మీడియాతో మాటలేంటి?

(మొదటిపేజీ తరువాయి)



కొత్తగాం ఏమీ లేదు. రెండు సంవత్సరాల నుంచి అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారు. ఇది సీబీఐ కస్టడీ కాదు.. బీజేపీ కస్టడీ. బయట బీజేపీ వాళ్లు మాట్లాడే మాటలనే మళ్లీ లోపల సీబీఐ వాళ్లు అడుగుతున్నారు" అని కవిత వ్యాఖ్యానించారు. దీంతో కవిత వ్యవహార శైలిపై న్యాయమూర్తి కావేరీ బవేజా ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా స్టేట్‌మెంట్లు కోర్టులో ఇస్తే ఎలా? అని ప్రశ్నించారు. "ఆమె ఏం చెప్పాలనుకుంటున్నారో విచారణ సమయంలో చెప్పమనండి. అంతేతప్ప.. కోర్టు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడితే ఎలా? కోర్టు ఆవరణలో ఇలా మాట్లాడడం సరికాదు. ఒకవేళ మీడియాతో మాట్లాడాలనుకుంటే కోర్టు బయట మాట్లాడమని చెప్పండి" అని కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావుకు న్యాయమూర్తి సూచించారు.

23 వరకు జ్యుడీషియల్ కస్టడీ..

కవితను సోమవారం ఉదయం 10 గంటలకు కోర్టులో హాజరు పరచగా.. ఆమెకు న్యాయమూర్తి ఈ నెల 23 వరకు తొమ్మిది రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. కవిత మూడురోజుల కస్టడీ ముగియడంతో న్యాయస్థానంలో ప్రవేశ పెట్టిన సీబీఐ.. ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించాలని కోరింది. అయితే.. ఢిల్లీ మద్యం కేసులోనే కవితకు ఈ నెల 23వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ గతంలోనే కోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో సీబీఐ కేసులో సైతం ఆమెకు న్యాయమూర్తి తొమ్మిదిరోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ నెల 23న మళ్లీ న్యాయస్థానం ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. కాగా, కవిత మూడు రోజుల సీబీఐ విచారణకు సంబంధించి 11 పేజీల రిపోర్టుకు దర్యాప్తు సంస్థ కోర్టుకు సమర్పించింది. సీబీఐ తరఫున న్యాయవాది పంకజ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మద్యం కేసుకు సంబంధించిన ఆధారాలు, సహ నిందితుల వాంగ్మూలాలు ముందు పెట్టి మరీ కవితను ప్రశ్నించామని తెలిపారు. కానీ, విచారణకు ఆమె సహకరించలేదని, సరైన సమాధానాలు చెప్పలేదని న్యాయస్థానానికి వెల్లడించారు.

ఆధారాలు ముందు పెట్టి ప్రశ్నించినా..

"నిందితుడు గోరంట్ల బుచ్చిబాబు మొబైల్ ఫోన్లలో లభించిన వాట్సాప్ సంభాషణలు, సాక్షులు, అప్రూవర్ల స్టేట్‌మెంట్ల ఆధారంగా కవితను ప్రశ్నించాం. మహబూబ్‌నగర్‌లో భూమి కుంభకోణం పేరుతో డబ్బు మళ్లింపు, ఆమ్ ఆద్మీ పార్టీకి విజయ్ నాయర్, ఇతర నిందితుల ద్వారా రూ.100 కోట్లు మళ్లించడం, ఆ డబ్బును ఇతరుల నుంచి వసూలు చేయడంలో కవిత పాత్రపై ప్రశ్నించాం. శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ.14 కోట్ల గురించి కూడా విచారించాం. అలాగే మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, విజయ్ నాయర్ సహా నిందితులతో జరిగిన సమావేశాల గురించి ప్రశ్నించాం. కానీ, నగదు బదిలీల గురించి కవిత సరైన సమాధానాలు ఇవ్వలేదు. ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేలా సమాధానాలు చెప్పారు. కవిత ప్రముఖ రాజకీయ నాయకురాలు. సమాజాన్ని ప్రభావితం చేసే మహిళ. ఆమె బయటికి వెళితే సాక్షులను బెదిరించే అవకాశం ఉంది. ఢిల్లీ మద్యం కేసు కీలక దశలో ఉంది. ఇప్పుడు కవిత బయటికి వెళితే కేసుపై ప్రభావం పడుతుంది. మరికొంత మందిని విచారించాల్సి ఉంది. మరిన్ని కీలక ఆధారాలను, డిజిటల్ పరికరాలను పరిశీలించాల్సి ఉంది. అందుకే కవితకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించండి" అని న్యాయస్థానాన్ని పంకజ్‌కుమార్ కోరారు. ఇదిలా ఉండగా.. ఈడీ కేసుకు సంబంధించి కవిత దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో మంగళవారం విచారణ జరగనుంది. మరోవైపు సీబీఐ అరెస్టుకు సంబంధించి కవిత మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై 20వ తేదీలోపు కౌంటర్ దాఖలు చేయాలంటూ సీబీఐకి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 22న విచారణ చేపడతామని పేర్కొంది.

అనారోగ్య సమస్యలున్నాయి.. బెయిలివ్వండి: కవిత

సీబీఐ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సోమవారం రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించిన కవిత.. అందుకు తన అనారోగ్య సమస్యలను ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన మెడికల్ రిపోర్టులను జత చేశారు. ఈ కేసులో సహ నిందితులకు బెయిల్ ఇచ్చారని, అలాగే తనకూ బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు 664 పేజీలతో కూడిన బెయిల్ పిటిషన్ వేశారు.

పిటిషన్‌లో కవిత పేర్కొన్న కొన్ని కీలక అంశాలు..

- 20 ఏళ్ల క్రితం చేతి మణికట్టు వద్ద ఎముక విరిగింది. అది ప్రస్తుతం నన్నెంతో బాధిస్తోంది.
- 2013లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారు. 2020లో గర్భసంచి సంబంధిత వ్యాధితో బాధపడ్డాను.
- 2023లో అల్సర్ మొదలైంది. ఆ సమస్య నన్నెంతో బాధిస్తోంది.
- బీపీతో బాధ పడుతున్నాను. మార్చి 16న ఈడీ కస్టడీలో ఉన్నప్పుడు రాత్రి 12.15 గంటలకు బీపీ చెక్ చేయగా.. 186/103గా నమోదైంది. దీంతో అదేరోజు రాత్రి 3:35 గంటలకు వైద్యులు చికిత్స అందించారు.
- బీఆర్ఎస్ పార్టీ తరఫున నేను స్టార్ క్యాంపెయినర్‌ను. అందుకే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కు ఒకరోజు ముందు ఈడీ అరెస్టు చేసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించడానికి 10 రోజుల ముందు సీబీఐ అరెస్టు చేసింది.
- చార్జిషీట్‌లో నా పేరు లేదు. మొదట నన్ను సాక్షిగా మాత్రమే విచారించారు. ఆ తర్వాత రాజకీయ కోణంలోనే నన్ను అరెస్టు చేశారు.
- ఈ కేసు గురించి నాకు ఏమీ తెలియదు. ఈడీ, సీబీఐ ఒకే ప్రశ్నలు మళ్లీ మళ్లీ అడుగుతున్నాయి. నేనేమీ చెప్పడం లేదని ఈడీ, సీబీఐ చెబుతున్నాయి. ఆ సాకుతో ఎన్నికలు ముగిసే వరకూ నన్ను జైల్లోనే ఉంచాలని చూస్తున్నారు. నాకేమీ తెలియదు కాబట్టే ఎన్నిసార్లు అడిగినా నేనేమీ చెప్పడం లేదు.
- కేసు విచారణలో ఉన్నందున ట్రయల్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే బెయిల్ ఇవ్వండి.

కొనుగోలు కేంద్రాల తనిఖీలు షురూ

» మెదక్ జిల్లాలో పరిశీలించిన కమిషనర్ చౌహాన్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీలు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తానని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రం ఆయన మెదక్ జిల్లా నార్సింగి మండలం జాప్తిశివనూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ఎంట్రీ చేయాలని, రైతులకు 48 గంటల్లో డబ్బులు చెల్లించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

30 లక్షల టన్నుల..

పారాబాయిల్డ్ బియ్యం సేకరణకు కేంద్రం ఆమోదం

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 2023-24 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి రాష్ట్రం నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ బియ్యాన్ని సేకరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకు గానూ కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్ర రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ మేనిఫెస్టోలో బీసీల ఊసేది?: జాజుల

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల కోసం బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో బీసీల ఊసే లేదని, బీసీల పట్ల బీజేపీ వ్యతిరేక వైఖరికి ఇదే నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మేనిఫెస్టోలో దేశంలోని 70 కోట్ల మంది బీసీల ఆకాంక్షలు, డిమాండ్‌లను పేర్కొనకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు కావాల్సింది ఉచిత బియ్యం, ముద్ర లోన్లు, సబ్సిడీ గ్యాస్ కాదని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల పెంపు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, కేంద్ర బడ్జెట్‌లో వాటా అని జాజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే దానం అనర్హతపై వివరణ ఇవ్వండి

» అసెంబ్లీ సెక్రటరీ, ప్రభుత్వం, ఈసీలకు హైకోర్టు నోటీసులు

» బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి, ఎలక్షన్ కమిషన్‌లకు నోటీసులు జారీచేసింది. దానం నాగేందర్‌కు కూడా నోటీసు పంపించింది. ఒక పార్టీ పేరుతో గెలిచి మరో పార్టీలో చేరిన నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ తాము ఇచ్చిన దరఖాస్తుపై స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ బీఆర్ఎస్ తరఫున ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. కౌశిక్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని పిటిషన్ ఇవ్వడానికి వెళ్తే స్పీకర్ చాంబర్‌లోకి కూడా రానివ్వలేదని పేర్కొన్నారు. అనర్హత పిటిషన్‌లను కేవలం రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలని చెబుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిర్ణయాలు తీసుకోవాలని స్పీకర్‌ను ఒత్తిడి చేయలేమని పేర్కొన్నారు. గత అసెంబ్లీ స్పీకర్ సైతం చాలా అనర్హత పిటిషన్‌లను పెండింగ్‌లో ఉంచారని, అసెంబ్లీ కాలవ్యవధి ముగిసే వరకు కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గుర్తుచేశారు. ప్రస్తుత పిటిషన్ గురించి స్పీకర్ కార్యాలయానికి తెలియజేస్తామని పేర్కొన్నారు. ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది.

బీజేపీ.. బలహీన వర్గాలకు వ్యతిరేకి: పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ.. బలహీన వర్గాల వ్యతిరేక పార్టీ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని 14 అంశాల్లో ఒక్కటి కూడా బలహీన వర్గాలకు సంబంధించినవి లేవని విమర్శించారు. కాంగ్రెస్ 'పాంచ్ న్యాయ్'లో బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలను చేర్చామని తెలిపారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలు ఆలోచన చేసి.. కాంగ్రెస్‌కు అండగా నిలబడాలంటూ విజ్ఞప్తి చేశారు. కుల గణననూ పాంచ్ న్యాయ్‌లలో ఒక అంశంగా పెట్టినట్లు గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం పూర్తిగా వ్యాపార వర్గాల ప్రభుత్వంగా వ్యవహరిస్తోందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వర్గీకరణ బాధ్యత రేవంతే తీసుకున్నారు

» కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్నారని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్లమెంటులో వర్గీకరణ బిల్లును ఆమోదిస్తామంటూ తమకు హామీ ఇచ్చారని ఆ పార్టీ మాదిగ సామాజిక వర్గ నేతలు గజ్జల కాంతం, పిడమర్తి రవిలు వెల్లడించారు. బీజేపీ అనుకుంటే వర్గీకరణ బిల్లును పార్లమెంటులో పెట్టే అవకాశం ఉన్నా.. ఎందుకు ఆ పని చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల ఎంపికలో మాదిగలకు నష్టం జరిగిన మాట వాస్తవమేనని, కానీ ఇతర కారణాల వల్ల ఇవ్వలేకపోయిందన్నారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు తప్పకుండా అవకాశాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఎల్లుండి పుట్టంగండి మోటార్ల ట్రయల్ రన్

» 15 నుంచే నీటిని ఎత్తిపోయాలనుకున్నా.. ఆలస్యం

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 15: హైదరాబాద్‌తో పాటు నల్లగొండ జిల్లా వాసులకు తాగు నీటిని సరఫరా చేసేందుకు పుట్టంగండి వద్ద ఏర్పాటు చేస్తున్న అత్యవసర మోటార్ల ట్రయల్ రన్‌ను గురువారం చేపట్టనున్నారు. వారం రోజులుగా మోటార్ల బిగింపు ఏర్పాట్లు కొనసాగుతుండగా.. ఈ నెల 15 నుంచి నీటిని పంపింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే, విద్యుత్ తీగలు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు ఆలస్యమయ్యాయి. దీంతో 18 నుంచి ట్రయల్ రన్ ప్రారంభిస్తామని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సివరేజ్ బోర్డు(హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) అధికారులు తెలిపారు. ఆరేళ్ల తర్వాత నాగార్జున సాగర్ నీటి మట్టం కనిష్ఠ స్థాయికి(509 అడుగులు/129.9 టీఎంసీలు) చేరుకోవడంతో ఆ ప్రభావం జంట నగరాల తాగునీటి సరఫరాపై పడింది. సాధారణ రోజుల్లో పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి వద్ద ఉన్న ఏఎమ్మార్పీ పంప్‌హౌ‌స్‌కు సాగర్ బ్యాక్ వాటర్ చేరుకుంటుంది. రోజూ మూడు మోటార్ల ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తే.. ఆ నీరంతా 10 కి.మీ. దూరంలో ఉన్న అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుతుంది. అక్కడి నుంచి నల్లగొండ జిల్లా వాసుల తాగునీటి అవసరాల నిమిత్తం ఉదయ సముద్రానికి, కోదండాపురం వాటర్‌ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి జంట నగరాలకు తరలిస్తారు. సాగర్ జలాశయం కనిష్ఠ నీటి మట్టానికి చేరుకోవడంతో ప్రస్తుతం రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయి. వాటి ద్వారా పుట్టంగండి నుంచి 800 క్యూసెక్కుల నీరు అక్కంపల్లి రిజర్వాయర్‌కు చేరుతోంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు అప్రోచ్ కెనాల్‌కు గ్రావిటీ ద్వారా నీరు అందడం లేదు. దీంతో పుట్టంగండి జీరోపాయింట్ వద్ద 10 అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి డెడ్ స్టోరేజీ నుంచి నీటి తరలింపునకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఏర్పాట్లు చేపట్టింది.

రూ. కోటికి పైగా విలువైన
500 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 15: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.కోటీ ఐదు లక్షల విలువ చేసే 500 టన్నుల రేషన్ బియ్యాన్ని సంగారెడ్డి పోలీసులు పట్టుకున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలో సోమవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రూపేశ్ కుమార్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు, సివిల్ సప్లయ్ విజిలెన్స్ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 500 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ బియ్యం విలువ సుమారు రూ. కోటీ ఐదు లక్షలు ఉంటుందని, రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద రేషన్ బియ్యం కుంభకోణమని వివరించారు. బియ్యంతోపాటు మూడు లారీలు, నాలుగు డీసీఎంలను కూడా సీజ్ చేశామని చెప్పారు. ఫేక్ మోనోగ్రామ్‌ల ద్వారా, దొంగ వేబిల్లులతో రేషన్ బియ్యాన్ని రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారని వివరించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, అతని అనుచరుడు రవి దీనికి ప్రధాన సూత్రధారులని ఎస్పీ వెల్లడించారు. దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నామని, బాధ్యులపై కఠిన చట్టాలు ప్రయోగిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ ఎస్పీ శశిధర్‌రాజు, ఏఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికే 2.69 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం

(మొదటిపేజీ తరువాయి)



టన్నుల మేరకు కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. మారుమూల గ్రామాన్ని కూడా వదలిపెట్టకుండా చివరి గింజవరకూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మందుల సామ్యేలుతో కలిసి ఉత్తమ్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, రేషన్ సరఫరాల్లో ప్రభుత్వం సమర్థంగా ముందుకు వెళుతోందని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు ఈ ఏడాది జరిగినంత సమర్థంగా గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. గత ఏడాది (2022-23) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 9న ప్రారంభిస్తే.. ఈ ఏడాది తాము మార్చి 23నే ప్రారంభించినట్లు తెలిపారు. నిరుడు మొత్తం 7031 కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. ఈసారి తాము 7149 ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 6919 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. సిద్దిపేటలో గత ఏడాది ఈ సమయానికి ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభం కాలేదని, ప్రస్తుతం 418 కేంద్రాల్లో ధాన్యం కొంటున్నారని మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రంలోని రైతులు ఒక్క ధాన్యపు గింజను కూడా మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని సూచించారు. "నిల్వ ఉన్న యాసంగి ధాన్యాన్ని గత ప్రభుత్వం ఎక్కువగా కొనుగోలు చేసింది. ఆ తర్వాత ధాన్యం పాడవుతుందని చెప్పి అమ్మకానికి పెడితే క్వింటాలుకు రూ.1702 ధర వచ్చింది. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత కమిటీ వేసి అదే ధాన్యాన్ని అమ్మితే క్వింటాలుకు రూ.2022 చొప్పున వచ్చింది. ధాన్యం వేలం ద్వారా రూ.1110.05 కోట్లు అదనంగా వచ్చాయి" అని ఉత్తమ్ వెల్లడించారు. గత ప్రభుత్వంలో సన్నబియ్యానికి, దొడ్డు బియ్యానికి తేడా లేకుండా వేలంలో అమ్మేశారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా నడిపిందన్నారు. ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రీసైకిలింగ్ మాఫియా తయారైందని చెప్పారు.

జూన్ 9న ప్రధానిగా రాహుల్ ప్రమాణం

లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి 272 సీట్ల కంటే ఎక్కువగా గెలుచుకుంటుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 9న ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి కచ్చితంగా గెలుస్తుందని చెప్పారు. దేశ చరిత్రలో 70 రోజుల్లోనే 5 గ్యారెంటీలు అమలు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. వంద హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ.. పదేళ్ల అధికారంలో ఉండి కూడా వాటిని అమలు చేయలేదని ఆరోపించారు.

ఢిల్లీకి పైసలు పంపడంపైనే శ్రద్ధ

కాంగ్రెస్ ప్రభుత్వానికి ధాన్యం కొనుగోళ్లపై శ్రద్ధ లేదు.. ఓట్ల కోసం వచ్చే నేతలను నిలదీయండి

» రైతు డిక్లరేషన్ ఓ బోగస్

» రైతు దీక్షలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్, హిమాయత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ధాన్యం కొనుగోలుపై శ్రద్ధ లేదని, వసూళ్లకు పాల్పడి ఆ డబ్బును ఢిల్లీకి పంపడం పైనే వారి ధ్యాస అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను గాలికొదిలేసి కొత్త హామీలతో వస్తున్న కాంగ్రెస్ నేతలను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం డొల్లతనం బయటపడిందని.. వారి రైతు డిక్లరేషన్ బోగస్, రైతులకు ఇచ్చిన గ్యారెంటీ బోగస్ అని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యమంటే రైతులను వెన్నుపోటు పొడవడమేనా? అని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి రైతుదీక్ష చేపట్టారు. 400 పైగా హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చే స్థితిలో లేదని విమర్శించారు. హామీల అమలుకు ఎలాంటి కార్యాచరణ ఉందో సీఎం రేవంత్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని.. ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైనా, రుణాలు కట్టాలని బ్యాంకులు ఒత్తిడి చేసినా, విత్తనాలు అందకపోయినా ఫిర్యాదు చేయాలని సూచించారు. వీటితో పాటు కిసాన్ సమ్మాన్ నిధి అర్హులు పేరు నమోదు చేసుకోవాలనుకుంటే 99041 19119 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.

మార్పు.. అంటే మతిమరుపు మార్పా?

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు రైతులకు అన్యాయం చేసిందని కేసీఆర్ మాటలు కోటలు దాటేవని, పనులు ఫాంహౌస్ దాటేవి కాదని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలన కూడా కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే ఉందన్నారు. "మార్పు వస్తుందన్నారు.. కేసీఆర్ కుటుంబ పాలన పోయి.. సోనియా కుటుంబ పాలన వచ్చింది. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎగ్గొట్టారు. మార్పు అంటే మతిమరుపు మార్పా..? హామీలను అమలు చేయకపోవడమే మార్పా..?" అని నిలదీశారు.



రైతుదీక్షలో వరికంకులు, నాగలితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కాగా, రుణ మాఫీ, పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధుల్లేవని, ఎన్నికల కోసం అధిష్ఠానం ఖజానా నింపడానికి మాత్రం నిధులున్నాయని బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్ ఆరోపించారు. రైతు దీక్షలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి ఇక్కడినుంచే డబ్బులు పంపిస్తున్నారని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్‌కు డిపాజిట్లూ రావు

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదని, డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని కిషన్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్, హైదర్‌గూడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేయాలని కోరారు. తెలంగాణలో బీజేపీ డబుల్ డిజిట్ సాధించడం ఖాయమన్నారు. బీజేపీకి రాష్ట్రంలో రెండు సీట్లు కూడా రావని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. కాంగ్రెస్‌కు దేశవ్యాప్తంగా 40 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇండియా కూటమికి నాయకుడు, ప్రధాని అభ్యర్థి లేరని వారి నేతలే చెబుతున్నారన్నారు.

గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి అన్యాయం: లక్ష్మణ్

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 15: ఆరు గ్యారెంటీల పేరిట ఓట్లు దండుకున్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశం, ధర్మం, ప్రజల భవిష్యత్ కోసం పాటుపడుతున్న ప్రధాని మోదీని రాహుల్ గాంధీ విమర్శించడం అవివేకమన్నారు. వికసిత్ భారత్ నినాదాన్ని ఎద్దేవా చేయడం పట్ల మండిపడ్డారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చి హామీలు అమలు చేశారని పేర్కొన్నారు.

ఖరీఫ్ నుంచి రైతులకు మూడు పథకాలు

» రైతు భరోసా, పంటల బీమా, రుణమాఫీకి కసరత్తు

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్ నుంచే అన్నదాతల ముంగిట్లోకి మూడు సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా, పంటల బీమా, రుణమాఫీ పథకాల విధివిధానాలపై ముమ్మర కసరత్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తుమ్మల మాట్లాడారు. పంట రుణాల రికవరీ కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దని పరపతి సంఘాలకు, బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు సంబంధిత అధికారులు, సంస్థలతో చర్చించి రుణమాఫీ పథకాన్ని అమల్లోకి తెస్తామని తెలిపారు. మార్కెట్ యార్డులకు రైతులు తెచ్చే ధాన్యానికి, ఇతర పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం అన్నిరకాల పంటల కొనుగోళ్ల ప్రారంభించిందని, మార్క్‌ఫెడ్ ద్వారా పొద్దుతిరుగుడు, శనగ, కంది, మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోలు జరుగుతోందన్నారు. పంటల బీమా-2024 అమలుకు సంబంధించి అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించి, ఎన్నికల సంఘం అనుమతితో ఖరీఫ్ కాలానికి పంటల బీమా అమలు చేసే విధంగా టెండర్ల ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసా పథకానికి సంబంధించి అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. గత నెలలో కురిసిన వడగళ్ల వానతో జరిగిన పంట నష్టానికి సంబంధించిన లెక్కలు తేల్చామని, పరిహారం విడుదలకు ఎన్నికల కమిషన్ అనుమతి కోరామని.. అది రాగానే విడుదల చేస్తామన్నారు.



చీరను చూపిస్తున్న హరిప్రసాద్

బంగారం, వెండితో 'సీతారాముల' పట్టుచీర

» సిరిసిల్ల నేతన్న హరిప్రసాద్ ప్రతిభ

సిరిసిల్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండిని ఉపయోగించి సీతారాముల ప్రతిరూపంతో పట్టుచీరను తయారు చేశారు సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు యెల్ది హరిప్రసాద్. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణం కోసం దీనిని తయారుచేశారు. ఈసారి చీరపై సీతారాముల కల్యాణ వేడుక ప్రతిరూపాలను, శంకుచక్రనామాలు, చీర అంచు లో 'జై శ్రీరామ్' నామాలను పొందుపరిచారు. 5.5 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో 800గ్రాముల బరువున్న చీరలో 2 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండిని ఉపయోగించారు.

యాదాద్రి వార్షిక ఆదాయం
రూ.224.25 కోట్లు

» వార్షిక వ్యయం రూ.214.55 కోట్లు: ఈవో

యాదాద్రి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి గత ఆర్థిక సంవత్సరం(2023-24) రూ.224.25 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే ఆలయ వార్షిక వ్యయం రూ.214.55 కోట్లు అయింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆలయ ఈవో ఎ.భాస్కర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ పరిధిలోని వసతి గృహాల ద్వారా రూ.2,74,52,489, హుండీ కానుకల ద్వారా రూ.32,26,06,456, సత్యనారాయణస్వామి వ్రతాల ద్వారా రూ.5,61,84,600, శీఘ్ర దర్శనం (పాతగుట్ట, రూ.50 టికెట్) ద్వారా రూ.15,21,650, ఇతర విభాగాల అన్నీ కలిపి మొత్తం రూ.224,25,87,229.39లు సమకూరింది. ఆలయ సిబ్బంది వేతనాలు, పింఛన్లకు రూ.35,83,58,737, ప్రసాదాల ఫల సరుకులకు రూ.26,96,02,686, ప్రభుత్వానికి చెల్లించిన పన్నులు రూ.20,72,23,358, పొరుగు సేవలకు రూ.7,17,01,877, ఆర్జిత సేవలకు రూ.4,92,17,184, ఎలక్ట్రికల్, నీటి నిర్వహణకు రూ.3,91,98,088.. ఇలా మొత్తం రూ.214,55,85,249 వార్షిక వ్యయం అయిందని ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు వెల్లడించారు.

దశాబ్దాల కల.. సాకారమైన వేళ !

గోదావరి రెండో వారధిపై రాకపోకలు షురూ.. భద్రాచలం వద్ద ప్రారంభించిన భద్రాద్రి కలెక్టర్

» మంత్రి తుమ్మల కృషి ఫలితమే: ఏజెన్సీవాసులు

భద్రాచలం, ఏప్రిల్ 15: దశాబ్దాల కల సాకారమై భద్రాచలం వద్ద గోదావరి రెండో వారధిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఈ వారధిపై రాకపోకలను సారపాక వైపు నుంచి భద్రాచలం వైపునకు భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ప్రారంభించారు. ఈ క్రమంలో కలెక్టర్ తన వాహనంలో వారధిని దాటారు. అంతకుముందు గోదావరి రెండో వారధి వద్ద కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో భద్రాద్రి దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ నుంచి జగదల్‌పూర్ జాతీయ రహదారిలో 166వ కి.మీ. వద్ద ఈ వంతెన నిర్మాణం జరిగింది. 2014లో ఈ బ్రిడ్జికి టెండర్ల ప్రక్రియ జరగ్గా 2015 ఏప్రిల్ ఒకటిన పనులు ప్రారంభమయ్యాయి. రూ.65 కోట్లతో ఈ వారధిని నిర్మించారు. మొత్తం 2.3 కి.మీ. నిర్మాణంలో 1.25 కి.మీ. పొడవున వంతెన ఉంటుంది. మిగిలింది అప్రోచ్ రహదారిగా ఉంది. 7.5 మీటర్ల వెడల్పు, 37 పిల్లర్లతో వంతెన నిర్మాణం చేశారు. పదేళ్ల క్రితం ఈ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించగా మొదట్లో పనులు నత్తనడకన సాగాయి. దాంతో నాడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు వేగవంతం చేసినా.. మళ్లీ పనులు ఆగిపోయాయి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం, మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల.. శ్రీరామనవమి నాటికి రెండో వారధిపై వాహనాల రాకపోకలు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చారు. తరువాత కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో పాటు జాతీయ రహదారుల శాఖ అధికారులతో మాట్లాడి శ్రీరామనవమి నాటికి రెండో వారధిని అందుబాటులోకి తెచ్చారు.



నూతన వారధిపై ప్రయాణిస్తున్న భద్రాద్రి కలెక్టర్ వాహనం

నాలుగు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగం

ఈ వారధి నిర్మాణంతో తెలంగాణవాసులతో పాటు ఎగువన ఉన్న ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని వల్ల భద్రాచలం వాసుల ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించనుంది.



వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ ముఖ్యనేతలతో కేటీఆర్

కాంగ్రెస్, బీజేపీలకు ఎదురు దెబ్బే

» పెద్దపల్లి, వరంగల్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు

» పార్టీ నేతలతో సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణలో ఒకేసారి ఎదురుదెబ్బ తగలనుందని, వరంగల్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఆయన వరంగల్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ ముఖ్యనేతలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్‌లో కడియం కుటుంబం పార్టీకి చేసిన మోసానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ పట్ల మంచి స్పందన వస్తోందన్నారు. ఆయన గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని, కొందరు నాయకులు పార్టీ వీడినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదని, ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని తెలిపారు. పెద్దపల్లిలోనూ గులాబీ గెలుపు ఖాయమని, తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతోపాటు సుదీర్ఘ రాజకీయప్రయాణంలో మచ్చలేని నాయకుడిగా పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఆయనను ఎన్నుకుంటేనే పార్లమెంటులో తెలంగాణ వాణి బలంగా వినిపించగలమని పేర్కొన్నారు. అన్నదాతల నుంచి ఆటో డ్రైవర్ల వరకు ప్రజలంతా కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్నారని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నమ్మించి మోసం చేసిన ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. చెప్పుకోవడానికి బీజేపీకి ఎజెండా లేదని, అందుకే మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి గట్టెక్కాలని చూస్తోందని ఆయన విమర్శించారు.

కొడంగల్‌లో రేవంత్ కొత్త డ్రామా

» మోసం చేయడం కాంగ్రెస్, బీజేపీ నైజం: హరీశ్‌రావు



కోస్గి రూరల్/గద్వాల, ఏప్రిల్ 15: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తే ఎవరెందుకు కుట్రలు చేస్తారని ప్రశ్నించారు. సోమవారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గ ముఖ్యనాయకుల విస్తృత స్థాయి సమావేశం, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగిన జలదీక్షలో ఆయన మాట్లాడారు. సాధ్యంకాని హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా కాంగ్రెస్ నేతలు ఎలా ఓట్లు అడుగుతారని నిలదీశారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందే తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఒక్క మెడికల్ కళాశాల కూడా మంజూరు చేయలేదన్నారు. కేసీఆర్ హయాంలోనే మెడికల్ కళాశాలలు వచ్చాయని చెప్పారు. చివరి దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని, రైతులను కాపాడేందుకు కర్ణాటకతో మాట్లాడి నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి ఐదు టీఎంసీల నీరు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు రోడ్లు ఎక్కుతున్నారని, ఎమ్మెల్యేలు దీక్షలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడైనా రైతులు, నీళ్లకోసం రోడ్డెక్కారా అని ప్రశ్నించారు. పాలన వదిలేసిన రేవంత్‌రెడ్డి ఇతర పార్టీల నాయకుల ఇళ్లకు పోయి కాంగ్రెస్ కండువాలు కప్పుతున్నారని ఆయన విమర్శించారు. కాగా, ప్రజలను మభ్యపెట్టడానికే ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. డిసెంబరు 9న రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాట తప్పినందుకు సీఎం రైతులకు క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా ఆయన డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 16 ఏప్రిల్ 2024

ఐకార్ ఆలిండియా పీజీ, పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్

వ్యవసాయ సంబంధిత పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో నిర్దేశిత కోటా సీట్ల భర్తీకి ఉద్దేశించిన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్) ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)పీజీ 2024', ఐకార్ ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఫర్ డాక్టోరల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఐసీఈ- జేఆర్‌ఎఫ్/ఎస్‌ఆర్‌ఎఫ్-పీహెచ్‌డీ)2024'లకు నోటిఫికేషన్‌లు వెలువడ్డాయి. ఈ ఎగ్జామ్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. వీటిలో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 74 అగ్రికల్చరల్ యూనివర్సిటీలు అందిస్తున్న కోర్సుల్లో ప్రత్యేకించిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో 63 రాష్ట్రీయ వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ యూనివర్సిటీలు; 4 ఐకార్ డీమ్డ్ యూనివర్సిటీలు; 3 సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలు; 4 సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



పీజీ

విభాగాలు: ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రానమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/అగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ

అర్హత: విభాగాన్ని అనుసరించి(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్/ హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరికల్చర్/బయోటెక్నాలజీ/అగ్రిల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/వెటర్నరీ సైన్సెస్/కమ్యూనిటీ సైన్స్/హోమ్ సైన్స్/డెయిరీ); (బీఈ/బీటెక్)(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/డెయిరీ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/డెయిరీ ఇంజనీరింగ్/ఫిషరీ సైన్స్); బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.625

పీహెచ్‌డీ (జేఆర్‌ఎఫ్/ఎస్‌ఆర్‌ఎఫ్)

స్పెషలైజేషన్‌లు: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్లాంట్ పాథాలజీ, నెమటాలజీ, ఎంటమాలజీ, సెరికల్చర్, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ ఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, వెజిటబుల్ సైన్స్, ఫ్రూట్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్-స్పైసెస్- మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ పాథాలజీ, డెయిరీ కెమిస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, బయోఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో(జనరల్ నాలెడ్జ్/రీజనింగ్ ఎబిలిటీ)(అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండ్రీ, డెయిరీ, ఫిషరీస్, అలైడ్ సైన్సెస్) అంశాలనుంచి 20, రెండో పార్ట్‌లో కోర్ గ్రూప్ సబ్జెక్ట్ నుంచి 50, మూడో పార్ట్‌లో స్పెషలైజేషన్ సబ్జెక్ట్ నుంచి 50 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1900; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.975.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 11
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 13 నుంచి 15 వరకు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **పరీక్షల తేదీ:** జూన్ 29న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/ICAR/

ఆంధ్ర వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ)- మూడేళ్ల బీబీఏ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ+ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లకు విశాఖ ఐఐఎం సహకారం అందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో మొదటి మూడేళ్ల తరవాత కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ డిగ్రీ ఇస్తారు. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీబీఏ+ఎంబీఏ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఫౌండేషన్ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, కేస్ స్టడీస్, విదేశీ ప్రొఫెసర్ల ఆన్‌లైన్ లెక్చర్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏటా కంపల్సరీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.
- క్రియేటివిటీ, ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్, టీంవర్క్, బిజినెస్ ఎథిక్స్, స్ట్రాటజిక్ అనాలిసిస్, లైఫ్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- **స్పెషలైజేషన్‌లు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ద్వితీయశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 18
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 20 నుంచి 22 వరకు
- **సీట్ల కేటాయింపు:** మే 23
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లింపు:** మే 24 నుంచి 27 వరకు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద వాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

ఎడ్యు న్యూస్

'ఈజీ ఇంగ్లీష్' ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్- 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'ఈజీ ఇంగ్లీష్' ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆఫర్ చేస్తోంది. ఇంగ్లీష్‌కు తోడు మోటివేషనల్ సెమినార్లు, వ్యక్తిత్వ వికాస పాఠాలు కూడా ఉంటాయి. మొత్తమ్మీద పది ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఉంటుంది. ఈ సంస్థ ఫౌండర్, చీఫ్ అయిన డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహణ ఉంటుంది. విద్యార్థులే కాకుండా నిరుద్యోగులు, ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు ఈ కోర్సులో చేరవచ్చు. ఏప్రిల్ మూడో వారంలో కోర్సు ఆరంభమవుతుంది. కోర్సు కాలవ్యవధి మూడు వారాలు కాగా, ఈ నెల 21 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. మరిన్ని వివరాలకోసం 9866006662 నెంబర్లో మాట్లాడవచ్చు.

హైదరాబాద్ ఐఐటీలో 'గ్రీన్కో' పీహెచ్‌డీ ఫెలోషిప్స్

హైదరాబాద్ ఐఐటిలోని గ్రీన్కో స్కూల్ ఆఫ్ సస్టయినబిలిటీ - పీహెచ్‌డీ ఫెలోషిప్స్‌ను ప్రకటించింది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫర్ నెట్ జీరో ట్రాన్సిషన్‌కు సపోర్ట్ చేసే పనిలో భాగంగా ఈ ఫెలోషిప్‌ను ఇస్తోంది. ఆరు గ్రీన్కో ఫెలోషిప్స్ ఉన్నాయి అలాగే మరో నాలుగు ఎంఓఈ ఫెలోషిప్స్ అయిదేళ్ల కాలవ్యవధికి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అవి ఉంటాయి. ప్రథమ శ్రేణి డిగ్రీకి తోడు ఇంజనీరింగ్‌లో పీజీ ఉత్తీర్ణులు ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు. యూజీసీ - నెట్/ గేట్/ సీడ్/ సీఐఎస్ఆర్ టెస్టుని క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఎంఓఈ స్కాలర్‌షిప్స్ కోరే విద్యార్థులు ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎండిజైన్/ ఎం.ఆర్క్ పాసై ఉండాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.75,000 చొప్పున నాలుగేళ్ల పాటు చెల్లిస్తారు. మూడు లక్షల మేరకు వార్షిక కంటింజెన్సీ ఫండ్ కూడా ఇస్తారు. సస్టయినబుల్ ఇంజనీరింగ్‌లో ఏడు ప్రాజెక్టులపై ఈ సంస్థ పనిచేస్తోంది. ఎంపిక విద్యార్థులను ఈ ప్రాజెక్టుల్లో భాగస్వామిగా చేస్తారు.

వెబ్‌సైట్: http://www.iith.ac.in/phdadmissions, https://gss.iith.ac.in/

ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఎకానమీ

న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే మానవాభివృద్ధి సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్), జెనీవా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) సంయుక్తంగా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక 2024ను తయారుచేసి ఇటీవల విడుదల చేశాయి. పోటీపరీక్షలకు తయారయ్యే విద్యార్థులు ఈ నివేదికలోని ముఖ్యాంశాలను పరిశీలించి దృష్టిలో పెట్టుకోవాలి. ఆర్థికవేత్తలు, అర్థశాస్త్ర విద్యార్థులు ఈ నివేదికను చదవడం అవసరం. ఇతరులు కూడా నివేదికలోని ప్రధానాంశాలను పరిశీలించినా భారత ఆర్థికవ్యవస్థ, ఉద్యోగితా/ నిరుద్యోగం స్థితిపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో ఉద్యోగితా స్థితికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక చలాంకాల ధోరణి ఈ మధ్య కాలంలో కిందివిధంగా ఉంది.



భారత శ్రామికశక్తి: పదిహేను సంవత్సరాలు, ఆపై వయసు ఉండి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారు, ఉపాధి పొందుతున్న వారి మొత్తాన్ని శ్రామికశక్తి(లేబర్ ఫోర్స్)గా పరిగణిస్తారు.

శ్రామికశక్తి రేటు: మొత్తం జనాభాలో శ్రామికశక్తి శాతాన్ని శ్రామికశక్తి రేటు(లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) అంటారు. 2024 ఉద్యోగితా నివేదిక ప్రకారం భారతదేశ శ్రామికశక్తి రేటు 2022లో 55.2 శాతంగా ఉంది. అయితే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు 59.8 శాతంగా ఉండటం గమనార్హం. అంటే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు కంటే మనదేశ శ్రామికశక్తి రేటు తక్కువగా ఉంది.

- అంతేకాకుండా కొంతకాలంగా భారత శ్రామికశక్తి రేటు తగ్గుతూ ఉండటం గమనించదగ్గ విషయం. భారత శ్రామికశక్తి రేటు 2000లో 61.6 శాతం కాగా 2019 నాటికి 50.2 శాతానికి చేరింది. అయితే 2022 నాటికి తిరిగి అది 55.2 శాతానికి పెరిగింది. నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 39.63 కోట్లు ఉండగా 2019 నాటికి 49.55 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు పది కోట్లు(9.92 కోట్లు) పెరిగింది. ఇక 2022లో భారత శ్రామికశక్తి 56.74 కోట్లుగా ఉంది.

కార్మికశక్తి(వర్కింగ్ ఫోర్స్): ఏదేని ఆర్థిక కార్యక్రమంలో ఉపాధి పొందుతున్న వారిని కార్మికశక్తి అంటారు. మొత్తం జనాభాలో కార్మికశక్తి శాతాన్ని జనాభా కార్మికశక్తి నిష్పత్తిగా పిలుస్తారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారత కార్మికశక్తి నిష్పత్తి 2022లో 52.9 శాతంగా ఉంది. అయితే 2000లో ఇది 60.2 శాతంగా ఉండి 2019 నాటికి 47.3 శాతానికి తగ్గింది.

- నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 38.71 కోట్లు కాగా 2019లో 46.65 కోట్లు, ఇక 2022లో 54.45 కోట్లు.

నిరుద్యోగం రేటు: మొత్తం శ్రామికశక్తిలోని నిరుద్యోగుల శాతాన్ని నిరుద్యోగరేటు అంటారు.

సాధారణ స్థితి నిరుద్యోగం

సర్వే సంబంధిత సంవత్సరకాలం(365 రోజులు)లో ఎక్కువ కాలం ఉపాధి దొరకని వారిని సాధారణ స్థితి నిరుద్యోగులు అంటారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారతదేశ సాధారణ స్థితి(యూజ్‌వల్ స్టేటస్) నిరుద్యోగం రేటు 2000లో 2.3 శాతం ఉండగా 2019 నాటికి 5.8 శాతానికి పెరిగింది. అయితే 2022 నాటికి తిరిగి 4.1 శాతానికి చేరింది. నిరపేక్షికంగా సాధారణ స్థితి నిరుద్యోగుల సంఖ్య 2000లో 9.2 మిలియన్లు ఉండగా 2019 నాటికి 29 మిలియన్లకు చేరింది. అయితే 2022లో అది 22.9 మిలియన్లుగా ఉంది.

- మొత్తమ్మీద శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి రేటు 2000 నుంచి 2019 సంవత్సరాల మధ్య తగ్గగా, 2019-2022ల మధ్య పెరిగాయి. ఇక నిరుద్యోగం రేటు 2000-2019 సంవత్సరాల మధ్య పెరగ్గా 2019-22 సంవత్సరాల మధ్య తగ్గింది. 2012 నుంచి 2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి పెరిగిన స్థాయిలో ఆర్థికవ్యవస్థలో ఉపాధి అవకాశాలు విస్తరించకపోవడం వల్ల నిరుద్యోగం రేటు పెరిగిందని నివేదిక పేర్కొంది.
- అయితే 2019-2022 సంవత్సరాల మధ్య నిరుద్యోగం రేటు కొంత తగ్గినప్పటికీ ప్రపంచ ఆర్థిక మందగమనం దృష్ట్యా ఉద్యోగాల నాణ్యత, తక్కువ ప్రతిఫలంతో కూడిన ఉద్యోగిత గమనించదగ్గ అంశాలుగా నివేదిక చెప్పింది.

పురుషుల, స్త్రీల ఉద్యోగితా స్థితి

- 2022 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 77.2 శాతం ఉండగా, స్త్రీల శ్రామికశక్తి రేటు 32.8 శాతంగా ఉండటం గమనార్హం. ప్రపంచ సగటు మహిళా శ్రామికశక్తి రేటు 47.3 శాతం కాగా దక్షిణాసియా సగటు మహిళా శ్రామికశక్తి రేటు 24.8 శాతంగా ఉంది. 2000 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 83.6 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 38.9 శాతంగా, 2019లో పురుషుల శ్రామికశక్తి రేటు 75.5 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 24.5 శాతంగా ఉంది. కార్మికశక్తి నిరుద్యోగం రేట్లలో కూడా ఇదే ధోరణి ఉంది.

గ్రామీణ, పట్టణ ఉద్యోగితా స్థితి

- మొత్తమ్మీద పురుషులు, స్త్రీల విషయంలోనూ, గ్రామాలు, పట్టణాల్లో కూడా 2000-2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం తగ్గగా, నిరుద్యోగం రేటు పెరిగింది. 2019-22 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం పెరగ్గా నిరుద్యోగం రేటు తగ్గింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.

లిటిల్స్



తెలివైన సింహం!


చీమలు దూరని చిట్టడవి.. కాకులు దూరని కారడవి. ఆ అడవికి రాజు సింహం. ఈ సింహం చాలా తెలివైనదని అందరూ చెప్పుకునేవాళ్లు. ఎందుకంటే.. చెప్పుడు మాటలు వినదు. పైగా ప్రతి విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంది. మృగరాజు మాట అంటే మాటే. జంతువులన్నీ ఆ మాటకు కట్టుబడి ఉండేవి.

ఒకరోజు రాజుగారు అడవి జంతువులకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని జంతువులూ హాజరయ్యాయి. అడవికి రాజు కావాలనే ఆశ పులి, నక్కకు ఉంది. అయితే అవి మనసులోనే ఎప్పటినుంచో బాధపడుతున్నాయి. మేము మీ సహాయకుడిగా ఉంటానని నక్క అడిగింది రాజుగారిని. 'అవసరం లేదు' అన్నది సింహం. 'మీకు మంత్రిగా ఉంటాను' అనడిగింది పులి. 'మాకేమి కావాలో బాగా తెలుసు. మీరు చెప్పాల్సిన అవసరం లేద'న్నది సింహం. ఎదురుగా గజగజ వణుకుతూ ఉండే కుందేలుని దగ్గరకు రమ్మని సింహం పిలిచింది. 'ఈరోజు నుంచి నువ్వే నా బాగోగులు చూడాలి' అన్నది. నా గుహ దగ్గరే నీ ఇల్లు అని చెప్పింది. అయిష్టంతోనే.. నేను శాకాహారిని.. రాజుగారు అన్నది. 'తెలుసు కాబట్టే నువ్వే మాకు సహాయంగా ఉండాలి' అన్నది. రాజు దగ్గర సహాయకుడిగా కుందేలు ఉండేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఇష్టమైన ఆహారం తినేసి వచ్చేది. ఆ సమయంలోనే కుందేలును కలిసి నక్క ఒక ఉపాయం చెప్పింది. రాజుగారికి తెలిస్తే ఎలా? అన్నది కుందేలు. 'అది అసంభవం' అన్నది.



ఒకరోజు కుందేలు పరిగెత్తుకొచ్చింది. 'రాజావారు దగ్గర కొలనులో ఓ సింహం ఉంది. ఈ అడవికి ఇదే రాజంట' అన్నది. కుందేలుతో కలిసి సింహం బయలుదేరింది. కొలనులో సింహం రూపం కనిపించింది. 'నేను ఎంత అందంగా ఉన్నానో కదా!' అని కుందేలును అడిగింది. నీటి కొలను ముందు గాండ్రించింది. దూరంగా ఉండే నక్కకు ఈ మాటలేవీ వినపడలేదు. పరిగెత్తుకుంటూ క్షణాల్లో నక్క వెనకాలే సింహం దగ్గరకు వచ్చి ఆగింది. 'రాజుగారూ.. నీళ్లలో దూకి ఆ పొగరుబట్టిన సింహాన్ని సంహరించండి' అన్నది. నీళ్లలోకి దూకినట్లు ముందుకు ఎగిరి.. క్షణాలో వేగంగా వెనక్కి వచ్చింది. 'ఓహో.. తమరి తర్ఫీదా ఇది' అంటూ నక్క గొంతును కొరికేసింది సింహం. 'చెప్పుడు మాటలు ఇకమీదట వింటే నీకిదే గతి' అంటూ కుందేలుతో అన్నది. గజగజవణుకుతూ 'ఈసారి క్షమించండి' అన్నది. 'నీ మనసు నాకు తెలుసు. నా తెలివి నీకు తెలుసు' అంటూ సింహం నవ్వింది. కుందేలు కూడా గట్టిగా నవ్వింది.

సరైన నీడ ఏది?




దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



జత ఉన్న బొమ్మలు ఏవి?



డైలీ సుడోకు - 282

		8		7				6
	3		4	2				5
	9					4	1	
1							5	
			5		3			
	6							1
	8	6					4	
9				4	6		2	
2				5		7		

సుడోకు - 281 సమాధానం

8	6	1	7	9	5	3	4	2
9	2	5	1	3	4	8	6	7
7	4	3	2	6	8	1	9	5
4	3	7	8	5	6	9	2	1
2	8	9	4	7	1	6	5	3
1	5	6	3	2	9	4	7	8
3	9	4	5	1	2	7	8	6
5	1	8	6	4	7	2	3	9
6	7	2	9	8	3	5	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.